13290



# చిలకమర్తి లక్ష్మీనరసింహము

మొదలి నాగభూషణశర్మ

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణ

అకాడమీ ప్రచురణ నం. 11
ఫిబ్రవరి, 1973
ప్రతులు : 1000

# చిలకమర్తి లక్ష్మీనరసింహము

© A. P. SANGEETA NATAKA AKADEMI

*Cover Design:*
**V. Srinivasa Sarma**

13290
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6
920

ప్రతులకు:
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ,
కళాభవన్, హైదరాబాద్–500004.

Book Printed at Natyakala Press, Khairatabad; Cover Page Printed at Saahiti Printers, Narayanguda, Hyderabad.

శ్రీ మొదలి నాగభూషణశర్మగారు జననం గుంటూరు జిల్లా ధూళిపూడిలో. స్వగ్రామంలోను, మచిలీపట్నం, గుడివాడ, హైదరాబాదులలోను విద్యాభ్యాసం. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు. నాలుగు నాటకాలు, పదిహేను నాటికలు, పాతిక దాకా రేడియో నాటికలు వ్రాశారు. తెలుగు నాటక సాహిత్యాన్ని గురించి, తెలుగు దేశి రూపకాలను గురించి పరిశోధన వ్యాసాలు వ్రాశారు. ''తెలుగు సాహిత్యం: గాంధీజీ ప్రభావం''. "తెలుగు నవలావికాసం" ప్రచురింపబడిన గ్రంథాలు.

# విషయసూచిక


1. జీవిత సంగ్రహం 1
2. నాటకేతర రచనలు 10
3. సమకాలీన నాటకరంగం 29
4. స్వతంత్రనాటకాలు 36
5. అనువాద నాటకాలు 62
6. ప్రహసనాలు 69
7. తెలుగు నాటకరంగానికి చిలకమర్తి చేసిన సేవ 94

# తొలిపలుకు

సంగీత, నృత్య నాటకోత్సవాలను నిర్వహించటం, ఆయాకళలలో శిక్షణాలయాలకు, సాంస్కృతికసంస్థలకు, నిస్సహాయస్థితిలో గల వృద్ధ కళాకారులకు ఆర్థిక సహాయము చేయటం, మరుగునపడి పోతున్న మన సంప్రదాయ, జానపద కళారూపాల పునర్వికాసానికి కృషిచేయటం మున్నగు కార్యక్రమాలతోపాటు ఆయా రంగాలలో పరిశోధన చేయించి, గ్రంథాలు ప్రచురించే కార్యక్రమాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ చేపట్టింది. ఈ పథకం క్రింద సంస్కృతంలోని ప్రామాణిక సంగీత, నృత్యశాస్త్ర గ్రంథాలను అనువదింపజేసి ప్రచురిస్తున్నాము. ఇంతవరకు 'సంగీతరత్నాకరం' మొదటిభాగం, 'నృత్తరత్నావళి' ప్రచురించాము. కర్నాటక సంగీతానికి సర్వస్వంగా పేరుపొందిన 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' పునర్ముద్రణ కార్యక్రమాన్ని అకాడమీ చేపట్టింది. త్వరలో ఈ బృహత్తర గ్రంథం మొదటి భాగం వెలువడుతున్నది.

పూర్వ గ్రంథాల అనువాదాలు, పునర్ముద్రణలు చేపట్టటమేకాక తెలుగునాట సంగీత, నృత్య, నాటక కళా వికాసాలను తెలియ పరిచే స్వతంత్రగ్రంథాలను ప్రచురించాలని కూడా అకాడమీ సంకల్పించింది.

మొదట నాటక కళాభివృద్ధికి దోహదకారులైన తెలుగు నాటక కర్తలను గురించి గ్రంథాలను ప్రచురించాలని అకాడమీ నిర్ణయించింది. ఆ ప్రకారం నాటక కర్తలుగా చిలకమర్తి, తిరుపతి వేంకటకవులను గురించిన గ్రంథాలను ప్రథమంగా ప్రచురిస్తున్నాము. ధర్మవరం, కోలాచలం, గురజాడ ప్రభృతి నాటకకర్తలను గురించి క్రమంగా గ్రంథాలను ప్రచురించ సంకల్పించాము.

అదే విధంగా సంగీత, నృత్య కళాకోవిదుల గురించి కూడా గ్రంథాలు ప్రచురించ తలపెట్టాము. అకాడమీ వెలువరిస్తున్న ప్రచురణలు, కళాకారులకు, కళాభిమానులకు కూడా ఉపయోగకరం కాగలవని మా విశ్వాసము.

మేము కోరినంతనే ప్రసిద్ధ నాటకకర్త చిలకమర్తి లక్ష్మీనరసింహాము గారి జీవితచరిత్ర వ్రాసి ఇచ్చిన మొదలి నాగభూషణశర్మగారికి ధన్యవాదములు తెలియపరుస్తున్నాము.

కె. ఆర్. పరమహంస
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

# జీవిత సంగ్రహం

భారత దేశ చరిత్రలో పందొమ్మిదవ శతాబ్ది ఉత్తర భాగం ప్రశస్తమైనది. 1857 తో ప్రారంభమైన జాతీయ సంచలనం ఆ శతాబ్ది ఉత్తరార్థంలో ఉజ్జ్వలరూపం ధరించింది. ఆంధ్రదేశ చరిత్రలో కూడా ఈ కాలం విలక్షణమైనదే! స్వాతంత్ర్య సముపార్జనే ధ్యేయంగా కాంగ్రెసు సాగిస్తున్న జాతీయోద్యమం అప్పుడే దేశంలో విస్తరిస్తున్నది. వేరొకవంక సాంఘిక దురన్యాయాల పట్ల నిరసన, వానిని మార్చవలెనన్న దృఢ సంకల్పమూ సంస్కర్తలలో ప్రగాఢంగా నాటుకొని పోయాయి. రాజకీయ, సాంఘికరంగాలలో ఈ విధమైన చైతన్యం ద్యోతకం కాగా, అదే విధమైన చైతన్యం సాహిత్యంలో కూడా ప్రజ్జ్వలితం అయింది. జాతీయ చైతన్యంలో పాలుపంచుకుని తమ సర్వస్వాన్ని స్వాతంత్ర్య సముపార్జన కోసం త్యాగం చేసిన ఉత్తమ రాజకీయ నాయకులెందరో తెలుగునాట ఉదయించారు. సనాతనపరుల ఆగ్రహావేశాలకు గురియై, ఒక మహాప్రవాహానికి ఎదురీదడానికి కూడా జంకక సంఘంలో జరుగుతున్న దురన్యాయాలను కూకటి వ్రేళ్ళతో పెకలించి వేయాలన్న పవిత్ర ఆశయంతో ఎన్నో ఇక్కట్లకు గురియైన సంఘ సంస్కర్తలున్నారు. సాహిత్య ప్రమాణాలు దిగజారిపోయి, తమ మనోల్లాసానికో, తమ పోషకుల ఆనందానికో కవులు అవాస్తవికమైన శృంగార కవిత్వాన్ని మాత్రమే

వ్రాసే రోజుల్లో వినూత్నమైన భావాలను, యదార్థమైన జీవిత చిత్రణను చిత్రించి సాహిత్యానికి ఒక క్రొత్త ఒరవడిని పెట్టిన సాహితీవేత్తలున్నారు. కాని ఒక వంక జాతీయభావాలకు ఉద్రిక్తులై, సాంఘిక దురన్యాయాలకు కోపోద్రిక్తులై, నవసాహిత్య చైతన్యానికి మార్గదర్శకులైన వ్యక్తులు అటు భారతదేశం మొత్తంలో నేమి, ఇటు ఆంధ్రదేశంలో నేమి బహుకొద్దిమంది మాత్రమే ఉన్నారు. బెంగాల్‌కు చెందిన రవీంద్రనాథ ఠాగూరు, ఆంధ్ర దేశంలో చిలకమర్తి అట్టివారు. ఈ మూడు రంగాలలో కూడా సమానమైన అభినివేశం కలిగి, ప్రతి రంగంలోను తాను చేసిన కృషిద్వారా సమాజాన్ని అభ్యుదయ పథం వైపుకు నడిపించే ప్రయత్నం చేశారు వారు.

చిలకమర్తి జీవిత చరిత్ర ఎన్నో కార్యకలాపాలతో నిండినది. జాతీయ మహాసభలలో పాల్గొనడం, గోదావరీ మండల సభలలో, ఆస్తిక మహాసభలలో ఉపన్యాసా లివ్వడం, స్త్రీ జాతి ఉద్ధరణకు, నిమ్న జాతుల ఉద్ధరణకు నిరంతరం కృషి చేయడం, క్రొత్త గా ప్రారంభమైన 'నవల' వంటి ప్రక్రియలోనేకాక, నాటకం, ప్రహసనం వంటి ప్రక్రియలలో కూడ గ్రంథాలు రచించడం — ఇవి అన్నీ చిలకమర్తి జీవితంలో క్రమం తప్పకుండా నడిచిన కార్యకలాపాలు. ఇంతటి కార్యకర్త, బహు వ్యాపకుడు, రచనా ధురీణుడు — తన జీవితంలో దాదాపు సగభాగం అంధునిగా ఉన్నాడన్న విషయం స్మరణకు వస్తే ఆయన ఈ అన్ని రంగాలలో చేసిన సేవ ఇతోధికంగా మనకు కన్పట్టక మానదు.

చిలకమర్తి తన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలనన్నింటిని 'స్వీయ చరిత్ర' లో పొందుపరచారు. "స్వీయ చరిత్రలు వ్రాయువారికి వారి వారి దినచర్యా గ్రంథములు (Diary), నితర సహాయములు నుండును. నే నంధుడ నగుటచే నట్టి దినచర్యా గ్రంథములు



వ్రాయలేక పోతిని. కాబట్టి యీ గ్రంథము వ్రాయుటకు పూర్తిగ పరమేశ్వరుడు నా కిచ్చిన జ్ఞాపక శక్తి యొక్కటే నాధారముగాని, లిఖిత పూర్వకమైన యాధారముగాని మరి యే యితర సహాయము గాని లేదు'' అని వారే స్వయంగా చెప్పుకోవడం వల్ల వారి జ్ఞాపక శక్తి ఎంత పదునైనదో గ్రహించవచ్చు.

## బాల్యదశ - విద్యాభ్యాసం

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు 1867 వ సంవత్సరం సెప్టెంబరు 26 వ తేదీకి సరియైన ప్రభవనామ సంవత్సర భాద్రపద బహుళ చతుర్దశి నాడు ఇప్పటి గోదావరి జిల్లాలోని తణుకు తాలుకాలో ఉన్న ఖండవల్లి గ్రామంలో మేనమామల యింట జన్మించారు. వీరి కుటుంబం మొదట గుంటూరు మండలానికి చెందినది. 1832 వ సంవత్సరములో ఆంధ్రదేశంలో సంభవించిన ''నందన సంవత్సరపు కరువు''నకు ఈయన తాతగారు-పేరయ్యగారు-గోదావరి మండలాన మొగలితుర్రు గ్రామానికి వలస వచ్చారు. కొంతకాలం తరువాత వీరవాసరం వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు.

చిలకమర్తి వారి తాతగారు వైదిక వృత్తి చేత జీవించారు. కాని ఆయన తండ్రి వెంకన్నగారు లౌకిక వృత్తిని అవలంబించి కొంత కాలం తాలూకా కచేరీలో ఉద్యోగంకూడా చేశారు. లక్ష్మీనరసింహము గారి తల్లి రత్నమ్మగారు పురాణపండవారి ఆడపడుచు. ఉభయభాషా కవితా విశారదుడైన పురాణపండ భద్రయ్య శాస్త్రిగారి రెండవ కుమార్తె. పిఠాపురం మహారాజావారి ఆస్థాన పండితులై బ్రహ్మ సూత్ర భాష్యాన్ని ఆంధ్రీకరించి, "ప్రభావతీ ప్రద్యుమ్నము" మొదలైన కావ్యాలకు వ్యాఖ్యలు వ్రాసిన పురాణపండ మల్లయ్య శాస్త్రి గారు చిలకమర్తి వారి మేనమామ.

లక్ష్మీనరసింహముగారి విద్యాభ్యాసము వీరవాసరంలో ప్రారంభమైనది. అక్కడ మొదటి నాలుగు తరగతులు పూర్తిచేసి 1882 లో నరసాపురంలోని మిషను హైస్కూలులో చేరారు. 1884 లో మేనమామతో పాటు రాజమహేంద్రవరానికి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశించారు. ఆ విధంగా అక్కడ ఉద్యోగం చేస్తున్న వీరేశలింగం పంతులుగారు, వావిలాల వాసుదేవ శాస్త్రిగారు చిలకమర్తి వారికి ఉపాధ్యాయులైనారు. 1887 వ సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులై కళాశాలలో ప్రథమ శాస్త్ర పరీక్షకు, పట్టపరీక్షకు చదవాలన్న ఉత్సాహం ఉన్నా, అప్పటికే నేత్రావరోధం కలగడం వల్ల ఆ సంకల్పంలో కృతకృత్యులు కాలేకపోయారు.

మెట్రిక్యులేషన్ చదువుతూ ఉండగానే చిలకమర్తి పద్య రచన ప్రారంభించారు. నరసాపురంలో ఏలేశ్వరపు వెంకటప్పయ్య శాస్త్రిగారివద్ద ఛందశ్శాస్త్ర గ్రంథాలను పఠించి 1887 వ సంవత్సరంలో జరిగిన 'విక్టోరియా రాణి జూబిలీ' సందర్భంలో వానిని మరొక మిత్రుని పేర వెలువరించారు. ఆతరువాత తమ గురువుగారు వేదము వెంకటాచలము గారిపై వ్రాసిన పద్యాలు పలువురి మన్ననకు పాత్రమైనాయి.

## ఉద్యోగం

1889 వ సంవత్సరంలో లక్ష్మీనరసింహముగారి మేనమామ మల్లయ్య శాస్త్రిగారికి జబ్బు చేయడంవల్ల, ఆయన స్థానంలో చిలకమర్తి ప్రవేశించి ఇన్నీసుపేట పాఠశాలలో మొదటిసారిగా ఉద్యోగంలో ప్రవేశించారు.

అదే సంవత్సరంలో రాజమహేంద్రవరంలోని పాతఊరులో ప్రారంభమైన "ఆర్యన్ హైస్కూలు" లో తెలుగు పండితులుగా



నియమింపబడ్డారు చిలకమర్తి. కాని ఆ పాఠశాల వేసవి కాలపు సెలవులు వచ్చేసరికి అంతరించింది.

తిరిగి లక్ష్మీనరసింహముగారు 1892 వ సంవత్సరంలో ఇన్నీసుపేట పాఠశాలలో సహోపాధ్యాయుడుగా నియమింపబడి 1893 వ సంవత్సరం చివరివరకు అక్కడ పనిచేశారు. కాని 1894 లో ప్రభుత్వ ట్రెయినింగు కళాశాల స్థాపింపబడి, ఊరిలోని పాఠశాలలు దానికి అనుబంధంగా స్వీకరింప బడడంతో చిలకమర్తి ఉద్యోగం పోయింది. ఆ సంవత్సరంలోనే సెకండరీ గ్రేడు ట్రెయినింగులో చేరారు. వ్రాత పరీక్షలో ఉత్తీర్ణుడైనా, నేత్రావరోధం వలన ప్రాక్టికల్ పరీక్షకు కూర్చోవడానికి ప్రయత్నం చేయక పోవడం వల్ల ఆ ట్రెయినింగు కూడా పూర్తి చేయలేదు.

తిరిగి 1895 లో కొత్తగా ప్రారంభమైన మునిసిపల్ స్కూలులో మూడవ ఉపాధ్యాయులుగా చేరి, ట్రెయినింగు పరీక్షలో ఉత్తీర్ణులు కాక పోవడం వల్ల ఆ స్కూలు ఉద్యోగం నుంచి 1898 లో విరమించవలసి వచ్చినంతవరకు అక్కడే ఉద్యోగం కొనసాగించారు.

1898 లో తమ మిత్రులైన పోలవరం జమీందారుగారు 'సరస్వతి' అన్న మాసపత్రికను స్థాపించి, దానికి సహాయ సంపాదకులుగా చిలకమర్తివారిని నియోగించారు. కాని 1899 లో వారికి, లక్ష్మీనరసింహముగారికి అభిప్రాయ భేదాలు రావడంవల్ల, 1899 లో చిలకమర్తి ఆ పత్రిక నుంచి వైదొలిగారు. ఆ తరువాత పంతులుగారు మరియెవ్వరి క్రిందా ఎట్టి ఉద్యోగమూ చేయులేదు.

## గ్రంథ రచన

చిలకమర్తి బహుళ గ్రంథకర్త. ఆయన గ్రంథాలు సంఖ్యలోనేకాక, గుణంలో కూడా ఎన్నదగినవి. ఆయనను గ్రంథ రచనకు

పురికొల్పిన సంస్థలు రెండు. ఒకటి 1889 లో ఇమ్మానేని హనుమంత రావు నాయుడుగారు స్థాపించిన 'హిందూ నాటక సమాజము'; రెండవది 1891 వ సంవత్సరంలో న్యాపతి సుబ్బారావు పంతులుగారిచే స్థాపించబడి, కందుకూరి వీరేశలింగంగారిచే నిర్వహింపబడిన 'చింతామణి' పత్రిక. మొదటిది ఆయన నాటక రచనకు, రెండవది నవలా రచనకు దోహద మిచ్చిన సంస్థలు.

ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారి ప్రోద్బలంతో చిలకమర్తి వ్రాసిన మొదటి నాటకం 'కీచక వధ'. అది పూర్తి వచన నాటకం. ఆ నాటక రచనకు నాలుగు నెలలకాలం పట్టింది. ఆ నాటక ప్రదర్శనం విజయవంతం కావడంవల్ల నాయుడుగారు చిలకమర్తివారిని మరొక నాటకం వ్రాయడానికి ప్రోత్సహించారు. ఇలా తయారైన రెండవ నాటకం 'ద్రౌపదీ పరిణయము'. తరువాత వచ్చిన నాటకాలు 'గయోపాఖ్యానము', 'శ్రీరామ జననము', 'సీతా కళ్యాణము', 'పారిజాతాపహరణము', 'నల నాటకము' మొదలైనవి.

1893 లో చిలకమర్తి వారికి వివాహం జరిగింది. తణుకు తాలూకాలోని కాకరపఱ్ఱు గ్రామానికి చెందిన పురాణపండ వెంకట దీక్షితులుగారి కుమార్తె వెంకాయమ్మ ఆయన భార్య.

1893 లోనే 'చింతామణి' నవలల పోటీ ప్రారంభించింది. 1894 లో చిలకమర్తి నవలా రచన ప్రారంభించి 'చింతామణి' బహుమానాన్ని స్వీకరించారు. వీరి మొదటి నవల 'రామచంద్ర విజయము'. ఆ తరువాత 'హేమలత', 'అహల్యాబాయి' అన్న నవలలకు కూడా 'చింతామణి' బహుమానాలు లభించాయి.

ఆయన చాలా గ్రంథాలను తన సంపాదకత్వంలో వెలువడిన 'మనోరమ' పత్రికలోను, పోలవరం జమీందారు గారి 'సరస్వతి' లోను ప్రచురించారు.



## పత్రికా నిర్వహణం

1898–99 ల మధ్యకాలంలో 'సరస్వతి'కి ఉప సంపాదకుడుగా ఉన్నప్పుడు ఆ పత్రికలో 'సౌందర్య తిలక' అన్న నవలను, 'పార్వతీ పరిణయము'న్న నాటకానికి ఆంధ్రీకరణాన్ని ప్రచురించారు చిలకమర్తి.

1906 లో చిలకమర్తివారు 'మనోరమ' అన్న పత్రికను ప్రారంభించారు. 1908 లో దానికొక ప్రత్యేక ముద్రాక్షర శాలను కూడా సంపాదించారు. ఈ పత్రికలోనే లక్ష్మీనరసింహముగారి గ్రంథాలలో అధిక భాగం ముద్రింపబడ్డాయి. 'ప్రసన్నయాదవ', 'చతుర చంద్రహాస' నాటకాలు, 'రాజస్థాన కథావళి', 'కర్పూర మంజరి' ప్రథమ భాగం, 'మహా పురుషుల జీవిత చరిత్రలు' వీనిలో ప్రకటింపబడిన కొన్ని గ్రంథాలు.

చిలకమర్తివారు 1910 లో 'మనోరమ'ను చాలించి, 'దేశమాత' అన్న వార పత్రికను ప్రారంభించారు. ఇందులో 'కృష్ణవేణి', 'మణిమంజరి' అన్న నవలలు ప్రకటింపబడ్డాయి.

తిరిగి 1916 లో 'మనోరమ' పత్రికను ప్రారంభించి, రెండు పత్రికలను నడిపారు. ఈ రెండవసారి ప్రారంభమైన 'మనోరమ' లో 'గణపతి', 'రాజరత్నము' అన్న నవలలు, రఘువంశానికి ఆంధ్రానువాదంగా 'రఘుకుల చరిత్ర', 'సిద్ధార్థ చరిత్ర', భాస నాటకాలలో ఐదింటి అనువాదాలు ప్రకటింపబడ్డాయి.

ఇవికాక నేరుగా గ్రంథ రూపాన వచ్చిన వానిలో 'రామకృష్ణ పరమహంస చరిత్ర', 'కాళిదాస చరిత్ర' ముఖ్యమైనవి.

## పాఠశాలల స్థాపన

విద్యాలయాలు తక్కువగా ఉండి విద్యార్జనకు తగిన సదుపాయాలు లేకపోవడం గమనించిన చిలకమర్తి స్వయంగా పాఠశాలల

స్థాపనకు పూనుకొన్నారు. దీనిలో కొంత స్వాభిలాష కూడా లేక పోలేదు. తాను 1898 లో ఉద్యోగ విరమణం చేసిన నాటినుంచి తన కుటుంబ పోషణార్థం ఏదో ఒక పని చేయవలసి వచ్చింది. లక్ష్మీనరసింహముగారు పాఠశాల స్థాపన రెండు విధములుగా లాభదాయకమని దానికి పూనుకొన్నారు. 1899 వ సంవత్సరారంభంలో ''హిందూ లోవర్ సెకండరీ స్కూలు''ను ప్రారంభించి తొమ్మిది సంవత్సరాల పాటు దానిని నడిపారు.

ఆ తరువాత కందుకూరి వీరేశలింగం పంతులుగారు తాము స్వయంగా ఒక ఆస్తిక పాఠశాలను స్థాపించడానికి ఉద్యమించి చిలకమర్తి వారి పాఠశాలను తమకు ఇచ్చి వేయవలసిందిగా కోరారు. లక్ష్మీనరసింహముగారు అందుకు అంగీకరించి 1907 వ సంవత్సరం సెప్టెంబరు 16 వ తేదీన పాఠశాలలో ఉన్న అన్ని పరికరాలతో సహా పంతులుగారికి ఆ పాఠశాలను ఉచితంగా అప్పచెప్పారు. 'ఆస్తిక పాఠశాల'గా ప్రారంభమైన ఆ పాఠశాల తరువాత వీరేశలింగం హైస్కూలుగా మారింది.

1909 వ సంవత్సరంలో నిమ్నజాతుల కోసం ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించి 13 సంవత్సరాల పాటు దానిని జయప్రదంగా నడిపారు. గాంధీజీ హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి దాదాపు 12 సంవత్సరాలకు ముందుగానే చిలకమర్తి-వారి కోసం ఒక పాఠశాలను స్థాపించడంలో భారతదేశం మొత్తంలోనే ఆద్యులైనారు.

## ఇతర కార్యకలాపాలు

గ్రంథ కర్తగా, పత్రికా సంపాదకుడుగా, పాఠశాలల స్థాపకుడుగా మాత్రమే చిలకమర్తి స్మరణీయుడు కాడు. గొప్ప కర్మిష్ఠిని చేయాలన్న తండ్రిగారి అభిలాషను కాదని సంఘ సంస్కర్తగా మారి, వీరేశలింగంగారి అనుయాయిగా ఆయన వితంతూద్వాహాలకు, స్త్రీ



అభ్యుదయానికి చేసిన సేవ కూడా స్మరణీయమే. హితకారిణీ సమాజంలో సభ్యులుగాను, ఉపాధ్యక్షులుగాను ఆయన ఎంతో సేవ చేశారు.

ప్రత్యక్షంగా రాజకీయాలతో ప్రమేయం లేకపోయినా, గోదావరి మండల సభలకు తరుచు పోయి, ఉపన్యసించడం ఆయనకు త్వరలోనే అలవాటయింది. ముందు ముందు బ్రిటిష్ ప్రభుత్వాన్ని పొగిడినా, రాను రాను రాజకీయాలలో మితవాదుల పక్షం వహించి ఎన్నో రాజకీయోపన్యాసాలు ఇచ్చారు. 1914 వ సంవత్సరంలో మద్రాసులో జరిగిన కాంగ్రెసు సమావేశాలలో పాల్గొని దక్షిణాఫ్రికా సమస్యమీద తెలుగులో అనర్గళంగా ఉపన్యసించారు. బ్రహ్మ సమాజ మతంలో చేరి దాని ప్రార్థనా సమావేశాలలో తరుచు పాల్గొన్నారు. 1943 లో వారి సాహిత్య సేవకు ఆంధ్రవిశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదు నిచ్చి సత్కరించింది.

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు 1946 జూన్ 17 వ తేదీన నిర్యాణం చెందారు.

# నాటకేతర రచనలు

చిలకమర్తివారు వ్రాసిన గ్రంథాలలో నాటకాలకన్న నాటకేతర రచనలే ఎక్కువ. ఈ నాటకేతర రచనలను ముఖ్యంగా నాలుగు విభాగాలుగా చేయవచ్చు. నవలలు, పద్యరచనలు, జీవిత చరిత్రలు, ఇతర వచన రచనలు. ఇవి అన్నీ గ్రంథరూపంలో వచ్చినవే. ఇవికాక గ్రంథరూపంలో రాని ఎన్నో పద్యరచనలు, వ్యాసాలు ఉన్నాయి. అవి ఆయా సమయాల్లో చిలకమర్తి 'మనోరమ', 'సరస్వతి', 'దేశమాత' పత్రికలలో వెలువరించినవి; లేదా సభలలో అశువుగా చెప్పినవి. పద్యరచనలలో కొన్ని ఖండికలు చిలకమర్తివారు తమ దగ్గరే లేవని వ్రాసుకొన్నారు. అందువలన ప్రచురింపబడిన రచనలను గురించిమాత్రమే ఇక్కడ ప్రస్తావించబడుతుంది.

## న వ లా ర చ న

చిలకమర్తి నాటకకర్తగా కొత్త పుంతలు తొక్కి దాని ప్రశస్తికి ఎలా తోడుపడ్డారో, అలానే నవలారచనలోకూడా కొత్త దారులు తొక్కి, అప్పటివరకు కేవలం ప్రయోగదశలోనే ఉన్న నవలాసాహిత్యాన్ని వికాస దశకు నడిపించారు. 1894 లో 'రామచంద్ర విజయము' 'చింతామణి' పత్రిక బహుమతి పొందడంతో చిలకమర్తి నవలారంగంలో ప్రవేశించారు, అప్పటినుంచి దాదాపు



పాతిక సంవత్సరాలపాటు ఆయన తెలుగు నవలా సాహిత్యాన్ని విభిన్నమైన ప్రక్రియలతో సుసంపన్నం చేశారు.

'చింతామణి' పత్రిక 1891 లో స్థాపించబడ్డది. 1893 నుంచి తెలుగులో 'వచన ప్రబంధముల' పోటీ ప్రారంభించింది. ఆ రోజులలో నవలలు వ్రాయబడడానికి ఈ పోటీ ఎంతగానో తోడ్పడిందంటే అతిశయోక్తి కాదు. 1893 లో ఖండవిల్లి రామచంద్రుడుగారి 'ధర్మవతీ విలాసము', తల్లాప్రగడ సూర్యనారాయణగారి 'సంజీవరాయ చరిత్రము' ప్రథమ బహుమానాలను అందుకొన్నాయి.

1894 లో చిలకమర్తివారి 'రామచంద్ర విజయము' గోటేటి కనకరాజుగారి 'వివేక విజయము' బహుమానాలు పొందాయి. 1895 లో శేకుమళ్ళ రామగోపాలరావుగారి 'త్రివిక్రమ విలాసము' ఖండవిల్లివారి 'మాలతీ రాఘవము' లకు ప్రథమ, ద్వితీయ బహుమానాలు లభించాయి. 1896, 97 లలో చిలకమర్తి వారికే ప్రథమ బహుమానాలు లభించాయి. వారి 'హేమలత', 'అహల్యాబాయి' బహుమతులు పొందిన నవలలు.

బహుమానాలు పొందిన ఈ మూడు నవలలు కాక, చిలకమర్తివారు ఇంకా పది నవలలవరకు వ్రాశారు. "కర్పూర మంజరి, సౌందర్యతిలక, గణపతి, శాపము, రాజరత్నము, కృష్ణవేణి, సువర్ణగుప్తుడు, సుధాశరశ్చంద్రము, దాసీకన్య" మొదలైనవి. ఇందులో చివరి రెండు అనువాదాలు.

ఈ నవలలన్నీ తరువాతి తరాలవారికి ఎంతో మార్గదర్శకం అయ్యాయంటే అతిశయోక్తి కాదు. ఇందులో 'రామచంద్ర విజయము', 'గణపతి', 'రాజరత్నము' మాత్రమే సాంఘిక నవలలు. మిగిలినవి చారిత్రక—కాల్పనికములు.

## సాంఘిక నవలలు

'రామచంద్ర విజయము' చిలకమర్తివారి నవలలలో మొట్ట మొదటిది. "సుబ్బారావు పంతులుగారి ప్రోత్సాహముచేత నేను క్రొత్త పుంతలు తొక్కితిని. హనుమంతరావునాయుడిగారి ప్రోత్సాహము లేకపోయినయెడల నేను త్వరగ నాటకములు వ్రాయలేక పోదును. సుబ్బారావు పంతులుగారి ప్రోత్సాహము లేకపోయిన యెడల నేను నవల లప్పుడు వ్రాయలేక పోదును"[1] అన్న అభిప్రాయాన్ని చిలకమర్తివారే స్వయంగా వెలువరించారు.

'రామచంద్ర విజయము' కందుకూరి వీరేశలింగం పంతులుగారు వ్రాసిన 'రాజశేఖర చరిత్ర' ను ఆదర్శంగా స్వీకరించి వ్రాయబడిన నవల. కాని 'రాజశేఖర చరిత్ర' కన్న యథార్థంగా, స్వాభావికంగా ఉన్నాయి ఇందులోని పాత్రలు, వర్ణనలు. చిలకమర్తితో కథాసంవిధానానికి, పాత్రపోషణకు ప్రాముఖ్యం వచ్చాయి, తెలుగు నవల రచనా విధానంలో.

'రామచంద్ర విజయము' రామచంద్రుడు అన్న అనాథుని కథ. విద్యా సముపార్జనకోసం, జీవన భృతికోసం అతడు పడినపాట్లు, పొందిన అవమానాలు ఇందులో వివరంగా వర్ణించ బడ్డాయి. తుదకు వీనిని అన్నింటిని జయించి అతడు ధనాన్ని, విద్యను పొందడం - ఇందులోని కథ. అందుకే ఇది రామ చంద్రుని 'విజయము'. ఈ నవలలోని కోనసీమ వర్ణనలు, అక్కడి మనుష్యులను గురించిన వర్ణనలు, ఎంతో సహజంగా ఉన్నాయి.

---

1. స్వీయ చరిత్రము - పుట 113.

ఇందులో పేర్కొన్న సుబ్బారావు పంతులుగారు న్యాపతి సుబ్బారావు పంతులుగారు. ప్రఖ్యాత జాతీయనాయకులు, 'చింతామణి' పత్రిక వ్యవస్థాపకులు.



చిలకమర్తి వ్రాసిన 'గణపతి' మరో సాంఘికనవల. తెలుగులోని హాస్యరస ప్రధానమైన నవలలలో దీనికో స్థానం ఉంది. అంతకు పూర్వంవచ్చిన వీరేశలింగం పంతులుగారి 'సత్యరాజా పూర్వ దేశ యాత్రలు' లో హాస్యం, వ్యంగ్యం మిళితమై ఉన్నాయి. 'గణపతి' తెలుగులో వచ్చిన మొదటి సంపూర్ణమైన హాస్యాత్మక నవల అని చెప్పుకోవచ్చు. ఇది 1917 నాటిరచన కాని ఈ నవలలో కందుకూరివారి నవలికలో ఉన్నట్లు సాంఘిక దురాచారాలను గురించిన విమర్శకూడా కానరాదు.

ఇది మూడు తరాలవారి కథ - బాపయ్య, ఆయన కొడుకు గంగాధరుడు, ఆయన కొడుకు గణపతి - అన్నవారిది. ముఖ్యంగా గణపతిది. గణపతితో వారి వంశం అంతం ఐపోతుంది. ఈ నవలలోని నాయకుడు ఉదరపోషణం కోసం బహువేషాలను వేసిన తిండిపోతు. ఈనాటి విలువలను బట్టి చూస్తే 'గణపతి' విషాదాన్ని కలిగిస్తుందే కాని, హాస్యాన్ని కలిగించదు. కాని ఆనాటి సాంఘిక ఆచార వ్యవహారాలను కొన్నింటిని ఈ నవలద్వారా మనం తెలుసుకోవచ్చు.

చిలకమర్తివారిదే 'దుందుభి' అన్న మరో నవలిక ఉంది. అందులో దుందుభి అన్న ఒక స్త్రీ కథ వర్ణింపబడ్డది. దుందుభి, గణపతికి స్త్రీ రూపం. అతనిలోని లక్షణాలన్నీ మనకు దుందుభిలో కూడా కన్పిస్తాయి.

'రాజరత్నము' సాంఘిక నవల. ఇది రాజరత్నమన్న అమాయకురాలి కథ. కథలో ఆమె ఎక్కడా మనకు కన్పించదు. కాని ఈ కథ అంతా ఆమెను గురించే. ఆమె తండ్రి ఆమె వివాహానికి చేసిన అప్పును వియ్యంకుడు తీర్చవలసివస్తుంది. వియ్యంకుడు అందుకు ఆగ్రహించి కోడలికి విషం ఇచ్చి చంపి, కొడుకుకు తిరిగి వివాహం చేయాలని సంకల్పిస్తాడు. కాని దైవవశాత్తు ఆ విషం తానే తిని

మరణిస్తాడు. ఇలా దుష్టులు శిక్షింప బడడం, శిష్టులు రక్షింపబడడం ఈ నవలలో చూపబడ్డది.

## చారిత్రక నవలలు

చిలకమర్తి వ్రాసిన చారిత్రక నవలలు పూర్తి చారిత్రకాలు కావు. అందులోని కథ ఏదో ఒక చారిత్రక కాలానికి చెందాలన్నదే ముఖ్యమైన నియమంగా కనిపిస్తుంది. ముఖ్యమైన పాత్రలు, సంఘటనలు అన్నీ కల్పితాలే.

'హేమలత'[1] అలాంటి చారిత్రక నవలలలో మొదటిది. ఇది కూడా 'చింతామణి' బహుమానాన్ని పొందినదే! నిజానికి ఆనాడు 'చింతామణి' ఎటువంటి వచన ప్రబంధాలకు బహుమతుల నిస్తామని ప్రకటించిందో, ఆ లక్షణాలన్నీ చిలకమర్తివారి చారిత్రక నవలలలో మనకు కన్పిస్తాయి[2].

హేమలతను ఒక ఖాను మోహిస్తే అతన్ని చంపి, మదనసింగు ఆమెను వివాహం చేసుకోవడం ఇందులో కథ. మేవారురాణా లక్ష్మణసింగు కాలంలో ఈ కథ జరిగినట్లు చూపబడ్డది.

---

1. ఈ నవల కన్నడ, ఒరియా, ఇంగ్లీషు భాషలలో తర్జుమా చేయబడ్డది. దీని ఆంగ్ల అనువాదం "The Golden Creeper" ప్రొద్దుటూరుకు చెందిన శ్రీ అవధానం కృష్ణమూర్తి శ్రోత్రియదారుగారిచే చేయబడి 1910 లో ప్రచురింపబడ్డది.

(బ్రిటిష్ మ్యూజియం కాటలాగు.)

2. 1896 వ సంవత్సరంలో బహుమానాలకు ప్రకటనచేస్తూ 'చింతామణి' పత్రిక ఇలా వ్రాసింది :—

"వయి సం॥ (1896) వ చ న ప్రబంధములను వ్రాయదలంపు గొన్నవారు భూగోళ, హిందూ చరిత్రాంశములతోడ గూడియుండు



'అహల్యాబాయి' హోల్కారులకు సంబంధించిన కథ. శాయాజీహోల్కారుకు, అహల్యాబాయికి మధ్య వచ్చిన వివాదం ఈ కథకు ఆధారం. శాయాజీహోల్కారు చనిపోగా దౌలతరావు అన్న ప్రధాని అతనిస్థానే దుండిరావు అన్న వానిని శాయాజీ హోల్కారుగా చెలామణి చేయించి అహల్యాబాయిని జయించి, వధించడానికి పన్నిన పన్నుగడలు, తుదకు అహల్యాబాయి జయించడం, తనకు వ్యతిరేకంగా పన్నుగడలు పన్నిన వారిని ఖైదుచేయడం ఇందులో వివరంగా వర్ణింపబడ్డాయి. అహల్యాబాయికి సహాయం చేసిన శ్యామసుందరదత్తు, రాణోజీల దేశభక్తి, ఋషిసంకల్పుల మహత్తర శక్తియుక్తులు కూడా ఇందులో వర్ణించబడ్డాయి.

---

నట్లుగా కథను హృద్యముగా కల్పన చేసి వ్రాయవలెను. ఈ యంశములు లేని గ్రంథములకు బహుమానము లీయబడవు".

... ... ...

హిందూ దేశ చరిత్ర విషయము:— "కేవల చరిత్ర వ్రాయగూడదు ...... చరిత్రాంశములును, కాలములును సరియైనవిగా నుండవలెను. చరిత్రలో వచ్చువారు కాక కల్పిత పురుషులును, స్త్రీలును ఉండవచ్చును......"

... ... ...

గ్రంథములను వ్రాయ బ్రయత్నించువారు ముందుగా నింగ్లీషు భాషలో నున్న తార, సీత, అక్బర్, చంద్‌బీబీ, టిప్పుసుల్తాన్ మొదలైన హిందూదేశముతో సంబంధించిన ప్రబంధములను, స్కాట్, జూల్స్ వెర్నె మొదలైనవారు రచించిన ప్రబంధములను జదువుట మంచిదని తలంచుచున్నాము".

ఈ ప్రకటనను అనుసరించే చిలకమర్తి తన చారిత్రక నవలలను వ్రాశారనడం సుస్పష్టం.

'కర్పూర మంజరి' మొట్టమొదట 1906 లో 'మనోరమ' లో ప్రచురించబడినా, 1907 లో దాని ప్రథమ భాగం ప్రకటింపబడ్డది. ఒక రాజకుమారికి కలిగిన అనారోగ్యాన్ని మాన్పడానికి ఎందరో ప్రయత్నించగా తుదకు మరొక రాజకుమారుడు పూనుకొని దానిని మాన్చి ఆమెను వివాహం చేసుకోవడం స్థూలంగా ఇందులో కథ.

చిలకమర్తివారి నవలలన్నింటిలోను 'కర్పూర మంజరి' ఉత్తమమైనదని చాలమంది భావన. ఇందులోని కథావిధానం, పాత్రపోషణ అత్యుత్తమంగా ఉన్నాయి.

'సౌందర్య తిలక' క్లిష్టమైన నవల. ఇందులో నాలుగు కథలు ఇమిడి ఉన్నాయి. ఇది 1901 లో ప్రచురింపబడ్డదని 'ఆంధ్ర వాఙ్మయ సూచి' పేర్కొంటున్నది. ప్రథమ ముద్రణం 1902 లో. 'సౌందర్య తిలక' పౌరాణిక నవల. దీనిలోని ఒక కథ జరాసంధ వధ. శ్రీకృష్ణుని ప్రోద్బలంతో భీముడు జరాసంధుణ్ణి వధించడం వర్ణింపబడిన ఈ భాగం వల్లనే దీనిని పౌరాణికం అనవలసి వస్తున్నది. మిగిలిన మూడు భాగాలు కాల్పనికాలే. ఈ నాలుగు భాగాలలోను అంతస్సూత్రంగా సాగే కథ కళానంద, సౌందర్యతిలక లిద్దరిదీ. ఎన్నో ఇక్కట్లను గడచి వారిరువురూ చివరకు వివాహం చేసుకొంటారు.

కళానంద, సౌందర్య తిలకల వివాహానికి ప్రతినాయకుడైన రణార్ణవుడు అడ్డంకులు కల్పించగా, శ్రీకృష్ణుని సాయంతో ప్రేయసీ ప్రియులిరువురూ వివాహం చేసుకొని సుఖంగా ఉంటారు.

ఈ నవలలోని మిగిలిన రెండు కథలు ఇందుమతి, జయసేనుల కథలు. కళానందుని సాయంతో శిశుపాలుని బారినుంచి తప్పించుకొన్న ఇందుమతి తన ప్రియుడైన యశోధరుణ్ణి పెళ్ళిచేసుకోవడం ఇందుమతి కథ. జయసేనుని ఇంటిలో పడ్డ ఒకపూలచెండునుంచి



ఒక పత్రం వెలువడి ఆ ఇంటిలోని వారందరినీ అనేకమైన కష్టాలకు లోను చేయగా, తుదకు కళానందుడు వచ్చి ఆ పత్రంలోని విషయాలు విప్పి చెప్పగా ఆ సంసారం తిరిగి సుఖశాంతులతో మనగలగడం చూపినది జయసేనుని కథ.

ఇలా నాలుగు కథలు కలిసివున్నా ఏమాత్రమూ క్లిష్టంగా ఉండక అతి లలితంగా, చక్కని వర్ణనలతో సాగినది ఈ నవలా రచన.

'మణిమంజరి' చిన్న చారిత్రక నవల. నిడివికి చిన్నదే అయినా గుణానికి దొడ్డది. విక్రమాదిత్యుని కాలానికి చెందిన ఒక కథ ఆధారంగా ఇది వ్రాయబడ్డది. దేశంలో పతివ్రతలు లేరన్న ఒక వాదం ఇద్దరు రాజుల మధ్య చెలరేగుతుంది. దానికి పణంగా తమతమ ప్రాణాలను ఒడ్డుతారు ఇరువురు రాజులూ-తుదకు మణిమంజరిని అట్టి పాతివ్రత్యానికి, సౌశీల్యానికి ప్రతినిధిగా చూపి లాటరాజైన చంద్రకేతుడు తన పందెం గెలుస్తాడు. స్త్రీల సౌశీల్యాన్ని శంకించే వారిని గురించి చిలకమర్తి ఈ నవలలో చేసిన విమర్శలు ఆనాటి వారికే కాక ఈనాటి వారికి కూడా వర్తిస్తాయి.

ఇవికాక 'కృష్ణవేణి', 'శాపము', 'సువర్ణగుప్తుడు' అన్న చారిత్రక నవలలను కూడా చిలకమర్తి వ్రాశారు. 'కృష్ణవేణి' 1675 లో గోల్కొండ నేలిన అబుల్‌హసన్ తానీషా కాలానికి చెందిన కథ.

'శాపము' ఆంధ్రుల కథ. వేములవాడ భీమకవిని అవమానించి శాపగ్రస్తుడై రాజ్యాన్ని కోల్పోయిన రాజా కళింగగంగు తిరిగి ఆయన అనుగ్రహంవలన రాజ్యాన్ని తిరిగి పొందడం 'శాపము' లో కథ.

ఈ నవలలన్నింటినీ వ్రాయడానికి చిలకమర్తికి ఏ విధమైన మాతృకలు లేవు. చారిత్రక నవలలు వ్రాయడానికి ఆంగ్ల గ్రంథాలు మాత్రమే ఆధారం అయ్యాయి. అందువల్లనే మెడోస్ టేలర్ వ్రాసిన సుల్తాన్, తార, చాంద్ బీబీ అన్న గ్రంథాలను చదివించు కొని తాను మొదటి చారిత్రక నవలను వ్రాసినట్లు చిలకమర్తి చెప్పు కొన్నారు.

## అనువాద నవలలు

ఈ నవలలే కాక చిలకమర్తి రెండు నవలలను అనువదించారు కూడా. రమేశచంద్రదత్తు ఆంగ్లంలో వ్రాసిన 'The Lake of Palms' అన్న నవలకు 'సుధాశరచ్చంద్రము' అనువాదం. ఈ నవలా నువాదం మౌలిక నవలా అన్నంత సహజత్వంతో సాగింది. 'The Maid of Agra' అన్న రమేశ చంద్రదత్తు మరొక నవలకు 'దాసీ కన్య' అనువాదం.

ఈ రెండు అనువాదాలతో పాటు చిలకమర్తి ఒక అనుసరణం కూడా చేశారు. అది 'శ్యామల'. ఇది షేక్స్పియరు వ్రాసిన 'మేక్ బెత్' నాటకానికి అనుసరణ. నిడుబ్రోలు రాజ్యాన్ని పొందడానికి ఒక సన్యాసి చెప్పిన మాటలు విని విజయరాయుడన్న ఒక సైన్యాధి పతి రాజును చంపడం ఆ తరువాత తానే పట్టుబడి చనిపోవడం ఈ నవలలోని కథ.

## కావ్య రచన

నాటక రచనలోను, నవలా రచనలోను సిద్ధహస్తుడైన చిలకమర్తి కొన్ని పద్య కావ్యాలను కూడా రచించినట్లు తెలుస్తున్నది. కాని వానిలో చాలా భాగం గ్రంథ రూపంలో లభ్యం కావడంలేదు.



ఆ యా నాటకాలు అంత వ్యాప్తి చెందడానికి కారణం ఆయన పద్య రచనే నని చాలా మంది అభిప్రాయం. అంత లలితంగా, సుగమంగా పద్య రచన చేయగలిగిన రచయిత - కావ్యాలు ఎక్కువగా వ్రాయక పోవడం చింత్యమే! దొరికినంతలో ఆయన పద్య రచనలను గురించి ఇక్కడ వివరించడం జరుగుతుంది.

పంతులు గారిని కవి గా లోకానికి పరిచయం చేసినవి ఆయన వివిధ సభలలో చదివిన పద్యాలు. ఇందులో చాలా భాగం ప్రశంసా పద్యాలే. తాము కవిత్వాన్ని ప్రారంభించడం గురించి చిలకమర్తి వారే స్వయంగా ఇలా చెప్పుకొన్నారు :

''నా కవిత్వమునుగూర్చి యొక్కమాట నిచ్చట జెప్పవలెను. చిన్ననాడు నేను వీరవాసరములో జదువు కొనుచున్నప్పుడు, నా మిత్రుడు చెన్నాప్రగడ భానుమూర్తిగారు నా కంటె పై తరగతిలో చదువుచు, నప్పుడే కవిత్వము చెప్ప నారంభించెను. 'పులిని చూచి నక్కవాత బెట్టుకొన్నదన్న' సామెతగ, శబ్ద జ్ఞానము లేకపోయినను, లక్షణము రాకపోయినను, నేనుగూడ పద్యములు చెప్పవలెనని కుతూహలపడి, గణములు లేకుండ యతిప్రాసలు లేకుండ నేవో వెఱ్ఱి మొఱ్ఱి పద్యములు కొన్ని యల్లు చుండెడివాడను''.[1]

తరువాత నరసాపురములో ఏలేశ్వరపు వెంకటప్పయ్య శాస్త్రి గారి దగ్గర ఛందో లక్షణాలు నేర్చుకున్నారు. 1887 లో విక్టోరియా రాణికి జూబిలీ సందర్భంలో ఆయన మొట్ట మొదటిసారి పద్య రచన చేశారు. ఆ తరువాత తమ గురువుగారు వేదము వెంకటాచలముగారి వీడ్కోలు సందర్భంగా తమ పద్యాలను సభలో మొదటిసారి చదివి మెప్పు పొందారు.

---

1. స్వీయ చరిత్రము, పుట 63.

ఆ తరువాత వివిధ సందర్భాలలో ఆయన ఎన్నో పద్యాలు ఆశువుగా చెప్పారు. అందులో టంగుటూరి ప్రకాశం పంతులు గారి మీద చెప్పిన పద్యం, పకోడీల మీద చెప్పిన పద్యాలు, చిన్న తిరుపతి లోని ఆ క్షేత్రాన్ని గురించి, అక్కడి స్వామిని గురించి చెప్పిన పద్యాలు, పలువురి ప్రశంసలను పొందాయి.

1895 జూన్ నెలలో కాకినాడలో జరిగిన గోదావరి మండల సభలలో ఆయన చదివిన పద్యాలు చాలా భాగం ఆంగ్లేయుల పరిపాలనను ప్రశంసిస్తూనే వున్నా, చివరి పద్యాలలో కొంత విమర్శ కూడా ఉంది.

తుహినాద్రి మొదలు సేతువు దాక రాజ్యంబు
జరిపె నీ యాంగ్లేయ దొర తనంబె
... ... ... ... ...

అట్టి దొర తనములో

దీప్తి మంతంబైన దీపంబుతోడ గ్రీ
నీడ యొక్కింత గన్పించునట్లు

కొన్ని పొరపాట్లు కూడా ఉన్నాయన్నారు. ఆ తరువాత ఆయన పేర్కొన్న బ్రిటిష్ ప్రభుత్వపు లోపాలు కొద్ది లోపాలు కాదు. ఆనాడు బహుళంగా ప్రచారమైన ఈ పద్యం ఈ లోపాలను ఎంత గట్టిగా చాటినది తెలియ చేస్తుంది !

నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలెనన్న నీటి పన్ను
వాణిజ్య మొనరింప వచ్చుబడికి పన్ను
సరకు లమ్ముదమన్న సంత పన్ను



కఱ్ఱ లమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారి పోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపమ్ముకొన్నచో స్టాంపు పన్ను

ఉన్నమట్టుకు తినకుండ ఉప్పు పన్ను
ననెడు పన్నులె దిగదీసె జనులనెల్ల
... ... ... ... ...

ఈ పద్యాలను న్యాపతి సుబ్బారావు పంతులుగారు గురజాడ అప్పారావు గారిచేత ఆంగ్లంలోకి తర్జుమా చేయించి ఆ సభా విశేషాలను తెలియ చేసే రిపోర్టులో అచ్చు వేయించారట !

1907 వ సంవత్సరంలో బిపిన్ చంద్రపాల్ రాజమహేంద్రవరం వచ్చినప్పుడు ఆ సభలో చిలకమర్తి వారు చదివిన పద్యం జాతీయ కవితలో ప్రప్రథమంగా పేర్కొన తగినది :

భరత ఖండంబు చక్కని పాడి యావు
హిందువులు లేగదూడలై యేడ్చు చుండ,
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియ గట్టి.

ఈ పద్యం ఆంధ్రదేశం నలుమూలలకు ప్రాకింది.

1895 లో ‘ పృథ్వీరాజీయము ’ అన్న ప్రబంధాన్ని ప్రారంభించారట. కాని పూర్తి చేయలేదు. ‘దీనకల్పద్రుమము’ అన్న భక్తి రస ప్రధానమైన శతకంలో అరవై పద్యాలు వ్రాసి ‘మనోరమ’ లో ప్రకటించారు. వీరి పద్య కావ్యాలలో న్యాపతి సుబ్బారావు గారి

ప్రోత్సాహము వలన వ్రాసిన 'వాల్మీకి రామాయణ సంగ్రహము' అముద్రితంగా ఉన్నదట ![1]

ఇవికాక అందుబాటులో ఉన్న పద్య కావ్యాలు రెండు : ఒకటి 'కృపాంభోనిధీ' అన్న భక్తి కావ్యం, రెండవది చిన్న పిల్లలకు నీతి బోధకంగా ఉండేటట్లు వ్రాయబడ్డ 'గీత మంజరి'.

'కృపాంభోనిధీ'లోని పద్యాలు అప్పుడప్పుడు పంతులుగారు భగవంతునికి నివేదించుకొన్న ఆవేదనకు అక్షర రూపాలు.

ఆంగ్లములో మహాకవి అయిన మిల్టన్ వలె చిలకమర్తి కూడా అంధుడై, ఆ అంధత్వం వల్ల నిరాకారుడైన భగవంతుణ్ణి ప్రార్థించడానికి ఎలా వీలుంటుందో తెలియ చేస్తూ వ్రాసిన పద్యం ఎంతో ఆవేదనను, ఆర్తిని సూచిస్తుంది :

అన్నా ! నీ దగుమూర్తి యెట్టిదియొ
జాత్యంధుండు కాలాద్యవ
చ్ఛిన్నంబై జగదేక పూర్ణమగు నీ
చిన్మాత్ర దివ్యాకృతిం

1. ఈ విషయాలు కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు వారు ప్రకటించిన 'భాసనాటకము' అన్న గ్రంథానికి వ్రాయబడిన "జీవితసంగ్రహము" లో పేర్కొనబడ్డాయి.

అంతే కాదు. 'పృధ్వీరాజీయము' లో రెండాశ్వాసాలను 1899 కే పూర్తి చేశామని, కాని అది పొరపాటున తన మేనగోడలి చేత చింపి వేయబడ్డదని పంతులుగారే వ్రాసుకొన్నారు.

'స్వీయ చరిత్రము' — పుట 147.



గన్నారం గను; బుండరీక దళ
సంకాశస్ఫురన్నేత్రుడుఁ
నిన్నుం జూడగలేడు చిత్రమిది తండ్రీ !
సత్కృపాంభో నిధీ !

'గీత మంజరి' (20-6-1931) పాఠశాల విద్యార్థులకు 'సులభ పద్య వాచకములు' లేవన్న భావంతో వ్రాయబడ్డది. ఇందలి ప్రతి పద్యమున నేదో యొక దృష్టాంతము జూపబడినది.

"తేట గీతములను గొన్ని తేట తెలుగు
నందు రచియించి సులభమైనట్టి శైలి
గీతమంజరి యను చిన్న కృతినొనర్తు
బాలకుల కెల్ల నుపయోగపడెడు నట్లు"

అన్నా రాయన.

## జీవిత చరిత్రలు

తెలుగులో జీవిత చరిత్రలు వ్రాయడం కందుకూరి వారితోనే ప్రారంభమైనా, మాస పత్రికలు ప్రారంభం కావడంతో పందొమ్మిదవ శతాబ్దం చివరలోను, ఇరవయ్యవ శతాబ్దం మొదటి భాగంలోను ఎన్నో చిన్నవి, పెద్దవి అయిన జీవిత చరిత్రలు వెలువడ్డాయి.

చిలకమర్తి వ్రాసిన జీవిత చరిత్రలు చాలా ఉన్నాయి. జీవిత చరిత్రలు నీతి దాయకములై ఉండాలన్నది చిలకమర్తి మతం. అందువల్ల అట్టి జీవిత చరిత్రలనే ఆయన వ్రాయడానికి పూనుకున్నారు.

1906 లో ప్రారంభమైన 'మనోరమ' పత్రికలో 'మహా పురుషుల జీవిత చరిత్రములు' అన్నవి కొన్ని మాసముల పాటు వరుసగా

ప్రచురింపబడ్డాయి. ఇవి మూడు భాగాలు: [1]'నానకు', 'గురుగోవింద సింగు'ల చరిత్రములు 'మనోరమ' రెండవసారి ప్రారంభమైనప్పుడు దానిలో ప్రచురింపబడ్డాయి. రఘువంశానికి అనువాదంగా 'రఘుకుల చరిత్ర' కూడా దీనిలో ప్రచురింపబడ్డదే.

'రామకృష్ణ పరమహంస చరిత్ర', 'కాళిదాస చరిత్రములు' తరువాత గ్రంథ రూపాన ప్రకటింపబడ్డాయి.

'రాజా రామమోహన రాయ్', 'వేమన' ఈయన వ్రాసిన ఇతర చరిత్రలు. 'విష్ణువర్ధను'డన్న చిన్న గ్రంథంలో చాళుక్యరాజుల చరిత్రను, వారికి విష్ణువర్ధనులన్న పేరు ఎలా వచ్చినదీ చెప్పారు.

## స్వీయ చరిత్రము

స్వీయ చరిత్ర వ్రాసుకోవడానికి ఆద్యుడు కందుకూరి వీరేశలింగంగారు. ఆయనను అన్నింటిలోను అనుసరించి, కొన్నింటిలో అధిగమించిన చిలకమర్తి వారు కూడా తమ స్వీయ చరిత్రను వ్రాసుకున్నారు. నిజానికి ఇది ఆనాడు ఆంధ్రదేశంలోని సాంఘిక, రాజకీయ విషయాలను తెలుసుకోడానికి ఎంతగానో ఉపకరిస్తుంది. దీనిని పంతులుగారు 18-3-1942 న ప్రారంభించి 12-7-1942 న ముగించారు.

ఈ 'స్వీయ చరిత్రము'లో పంతులుగారు తమ సాహిత్య జీవితంకన్న తమ ఇతర వ్యాపకాలను గురించి ఎక్కువగా వ్రాయడం కొంత విచారింపవలసిన విషయం.

1. ఇందు మొదటి భాగంలో బెంగాల్‌కు, రెండవ భాగంలో 'బొంబాయి రాజధాని'కి, మూడవ భాగంలో చెన్నపురికి చెందిన మహాపురుషుల **'జీవచరిత్రలు'** పొందుపరచబడ్డాయి.

—స్వీయచరిత్రము–పుట 241.



పంతులుగారి స్వీయ చరిత్రలో మెచ్చుకోదగిన విషయాలు రెండు: ఒకటి అందులోని నిష్పక్షపాత బుద్ధి; రెండవది ఆత్మ విమర్శ. తన్ను గురించి ఆయన ఇంత బృహద్గ్రంథంలోనూ ఎక్కడా ఒక్క ఆత్మ ప్రశంసా వాక్యం పలుకలేదు. సభాసదులు తన పద్యాలు మెచ్చుకున్నారనో, తన నాటకం బాగున్నదని ఫలానావారు ఉత్తరం వ్రాశారనో చెప్పుకున్నారు కాని ఎక్కడా తమ్ము గురించి తాము ప్రశంసించుకోలేదు.

ఈ గ్రంథంలో ఎక్కడ చూచినా చిలకమర్తి వారి నిష్పాక్షికత మనకు కానవస్తుంది. తాను వ్రాసిన 'నల నాటకము'ను ఎందుకు అచ్చొత్తించలేదో కారణం చెబుతూ పంతులుగారు ఈ క్రింది మాటలు వ్రాశారు:

"ఈ నాటకము (నల నాటకము) అచ్చు పడలేదు. కారణమేమన, బళ్లారిలో నుండిన బ్రహ్మశ్రీ ధర్మవరము రామకృష్ణమాచార్యుల వారు 'చిత్ర నళీయ'మను పేర నల నాటకమొకటి వ్రాసిరి. ఆయన "సరస వినోదినీ" యనునొక నాటక సమాజము స్థాపించి యా సమాజము నప్పుడప్పుడు చెన్నపురి దీసికొని పోయి, తానే నలుని పాత్ర ధరించి, దానిని, మరికొన్ని నాటకములను చెన్నపురిలో నాడి యా నగరమందలి యాంధ్ర మహాజనుల నద్భుతానంద రసములలో దేల్చెడివారు. వారి 'చిత్ర నళీయ' నాటకమును నేను జదివించుకొని, విని, యది యన్ని విధముల నా 'నల నాటకము' కంటె మిన్నగా నుండుటచేత నా నాటకము దాని ముందర బనికి రాదని భావించి యచ్చు వేయలేదు"[1]

1. స్వీయ చరిత్రము-పుటలు 85,86.

ఈ విధంగా తన గ్రంథాన్ని గురించి వ్రాసుకొన్న రచయిత మనిషిగా ఎంత గొప్పవాడు ![1]

## ఇతర వచన రచనలు

పైన పేర్కొన్న జీవిత చరిత్రలేకాక ఇంకా ఎన్నో వచన గ్రంథాలను స్వతంత్రంగా వ్రాయడమో, లేదా అనువదించడమో చేశారు చిలకమర్తి వారు. ఇందులో ముందు పేర్కొనదగినది 'రాజస్థాన కథావళి' (1906). ఇది కల్నల్ టాడ్ ఆంగ్లములో వ్రాసిన Annals of Rajasthan కు అనువాదం. రాజస్థాన రాజుల చరిత్రలలో జరిగిన ముఖ్యమైన సన్నివేశాలను కొన్నింటిని, రాజస్థాన్‌లో వివిధ రాజ్యాలను ఏలిన మహా రాణాలను గురించి ఇందులో ఎంతో హృద్యంగా చిత్రించబడ్డది. అప్పటికే చారిత్రక నవలలు వ్రాయడంలో సిద్ధహస్తులనిపించుకొన్న చిలకమర్తి వారు దాదాపు నవలలవలెనే ఉండే ఈ రాజస్థాన కథావళిని తెనిగించడంలో ఆశ్చర్యంలేదు. ఇది రెండు భాగాలలో ఉంది.

---

1. 'ప్రసన్న యాదవ నాటకం' ... ప్రస్తావనలో పారిపార్శ్వకుడు మనం సభాసదులను తప్పకుండా రంజింప చేయగలము – అన్నప్పుడు సూత్రధారుడు అతనితో ఇలా అంటాడు :

   ఓ పండిత మన్యా! గర్వోక్తులచే నేమి ప్రయోజనము ;
   తన రూపము, తన విద్యయుఁ
   దన నేర్పును, తన గుణంబు దనగానము, గ
   న్గొని యెవడు సంతసింపడు ?
   తన విషయము నెంచ నొరులె తగువారు సుమీ !



న్యాపతి సుబ్బారావు పంతులుగారి ప్రోత్సాహంతో సంస్కృతంలో ఉన్న 'ఆర్య చరిత్ర' కు స్వేచ్ఛానువాదంగా 'వాల్మీకి రామాయణ సంగ్రహము' ను పద్య కావ్యంగా వెలయించిన సంగతి పూర్వమే పేర్కొనబడ్డది. ఇదిగాక, వారి ప్రోద్బలంతోనే మరి రెండు వచన గ్రంథాలు కూడా వెలువడినట్లు తెలుస్తున్నది. ఒకటి 'భాగవత కథా మంజరి', రెండవది పనప్పాకము ఆనందాచార్యులు గారు ఆంగ్లములో వ్రాసిన 'Virtues Triumph' అన్న గ్రంథానికి 'ధర్మ విజయము' అన్న పేరుతో చేసిన అనువాదం. ఈ రెండవ గ్రంథం ఈ నాటివరకు ప్రచురింపబడలేదు.

ఇవికాక 'దేశమాత'లో ప్రచురితములైన 'భారత కథా మంజరి' కూడా పేర్కొన దగినది.

హాస్యరస ప్రధానములైన కొన్ని వచన రచనలు ఉన్నాయి. వీనిలో 'చమత్కార మంజరి', 'చిత్రకథా గుచ్ఛము', 'నవ్వుల గని', 'హాస్యలత' ముఖ్యమైనవి.

'చమత్కార మంజరి' లో కొందరు ప్రముఖులైన వ్యక్తుల జీవితాల్లోని చమత్కార సన్నివేశాలను పేర్కొన్నారు.

'చిత్రకథా గుచ్ఛము''లోని ఎనిమిది రచనలను చిన్నకథలుగా పేర్కొనవచ్చు. ఇవి అన్నీ ఒక వ్యక్తినో, ఒక సంఘటననో ఆలంబనంగా గ్రహించి వ్రాయబడ్డవి.

'నవ్వులగని', 'హాస్యలత'లు 'మనోరమ', 'దేశమాత' పత్రికలలో వచ్చినప్పుడు ఎంతో ప్రజామోదాన్ని పొందాయి. ఇవి ఈనాడు వస్తున్న కార్టూను చిత్రాలకు ప్రథమ రూపాలని చెప్పవచ్చు.

చిలకమర్తివారి యితర వచన రచనలలో 'మహాపురుష ముక్తావళి', 'సిద్ధార్థచరిత్ర', 'ప్రచ్ఛన్నపాండవము' కూడ పేర్కొనవలసివుంది. ఇందులో మొదటిది పాఠ్యపుస్తకంగాకూడా నిర్ణయింపబడ్డది. ఇవికాక చిలకమర్తి 'కాదంబరి' ని తెనిగించడానికి పూనుకొని వందపుటలవరకు వ్రాసికూడా, కందుకూరివారు అట్టి అనువాదాలు నాటి పాఠకులకు రుచింపవని చెప్పడంవల్ల ఆ అనువాద కార్యం విరమించారు.

చిలకమర్తి రచనలలో వాచక పుస్తకాలుకూడా వున్నాయి. ఇండియన్ పబ్లిషింగు హౌస్‌వారికి 1 నుండి 5 తరగతులవరకు (సదాశివ వాచకములు), 6 నుండి 10 వరకు (వివేకవాచకములు) వ్రాసి యిచ్చారు.

ఇవికాక చిలకమర్తి సంపాదకత్వంలో వెలువడిన 'మనోరమ', 'దేశమాత' పత్రికలలో గ్రంథ సమీక్షలుగా వెలువడిన విమర్శలు కూడా యిక్కడ పేర్కొనదగినవే. సెట్టి లక్ష్మీనరసింహముగారు శ్రీనాథ మహాకవి కృతమని వ్రాసిన 'రసికాభిలాష' మన్న పద్య కావ్యంమీద, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి భారతానువాదంమీద తాము వ్రాసిన విమర్శలు ఆనాటి సాహితీలోకంలో ఎంత సంచలనానికి కారణమయ్యాయో చిలకమర్తివారే తమ 'స్వీయచరిత్రము'లో పేర్కొన్నారు.

# సమకాలీన నాటకరంగం

చిలకమర్తి జననం 1867 లో. ఆయన నాటకరచన ఆరంభం చేసినది 1889 జనవరిలో. అప్పటికి చిలకమర్తికి 21 సంవత్సరాలు. సమకాలీన నాటకకర్తలందరికన్న చిలకమర్తి చిన్నవాడు. వేదం వేంకటరాయశాస్త్రి, కోలాచలం శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు ప్రభృతులకన్న చిన్నవాడైనా, వారికన్న ముందుగా నాటకరచనను ప్రారంభించినవాడు. దీనికి కారణం ఆయన నాటకరచనతోనే గ్రంథరచననుకూడా ఆరంభించడమే! అంతేకాదు. అంత త్వరితగతిలో అన్ని నాటకాలను వ్రాసినవారుకూడా అరుదే. రెండు సంవత్సరాలలో — 1889-90 లలో — ఎనిమిది నాటకాలను వ్రాశారాయన.[1]

ఇంత చిన్నవయసులో నాటకరచనను ఆరంభించినా, చిలకమర్తి నాటకాలు బహుళప్రచారాన్ని పొందాయి. చిలకమర్తితో తెలుగు నాటకరంగంలో కొన్ని కొత్తవిధానాలు రూపొందాయి. మరికొన్ని - పూర్వులే ప్రారంభించినవి — నిలతొక్కుకున్నాయి. ఆనాటి నాటకరంగ స్థితిగతులను సంక్షిప్తంగా సింహావలోకనం చేస్తూ అందులో చిలకమర్తి ప్రత్యేకతను పరిశీలించడం అవసరం.

---

1. ఇవి 'కీచకవధ', 'ద్రౌపదీ పరిణయము', 'గయోపాఖ్యానము', 'శ్రీరామ జననము', 'పారిజాతాపహరణము', 'నల నాటకము', 'సీతాకళ్యాణము' అన్న స్వతంత్రనాటకాలు; ఎనిమిదవది 'పార్వతీ పరిణయ' మన్న సంస్కృత రూపకానువాదం.

తెలుగునాట ఆధునిక పద్ధతికిచెందిన నాటకప్రదర్శన 1880లో ప్రారంభం అయింది. కందుకూరివారి 'వ్యవహార ధర్మబోధిని' అట్టివానిలో ప్రప్రథమమే అయినా, నాటక ప్రదర్శనలయెడ నిజమైన అభినివేశం 1880-81 లలో తెలుగుదేశం పర్యటించిన ధార్వాడ నాటక సమాజంవల్లగాని జనించలేదు. ఆ తరువాతనే పంతులుగారు తమ విద్యార్థులను గూర్చి ఒక నాటక సమాజాన్ని స్థాపించి తమ నాటకాలను ప్రదర్శింపచేశారు. దీనినిబట్టి పంతులుగారు స్థాపించిన నాటక సమాజం కేవలం ఔత్సాహిక సమాజమనే చెప్పవలసి ఉంటుంది.

వేరొకప్రక్క బళ్ళారికిచెందిన ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు 1887 వ సంవత్సరంలో తమ 'చిత్రనళీయము' తో నాటక ప్రదర్శనలను ఆరంభించారు. వీరి "సరసవినోదినీసభ" ఆచార్యులవారి నాటకాలను అటు మద్రాసు, నెల్లూరు ప్రాంతాలలోను, ఇటు రాజమండ్రి ప్రాంతాలలోను ఎంతో విజయవంతంగా ప్రదర్శించింది. వీరి నాటకాలలో ఆచార్యులవారుకూడా పాత్రధారణ చేసేవారు. "సరసవినోదినీసభ"కు ధర్మవరంవారు అధ్యక్షులు కూడా.

1880-84 మధ్యకాలంలోనే కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు గుంటూరు మిషన్ స్కూలులో ఉద్యోగంలో ఉండగా "హిందూ నాటక సమాజము" అనే నాటక సంస్థను స్థాపించి "కొందరు విద్యార్థులను, నాటకమునందు ప్రీతిగలవారిని చేర్చి, సొమ్ము సంపాదింపవలెనను నుద్దేశముతోగాక కేవలము ఆత్మానందము నిమిత్తము ప్రజలనానందింప జేయుటకు నుద్దేశించి" నాటకాలను ప్రదర్శింపచేశారు.

ఈ విషయాలనుచూస్తే మరొకరిచే స్థాపింపబడ్డ నాటక సమాజానికి నాటకాలను వ్రాసియిచ్చి, రానురాను వారి సమాజ నాటకకర్తగా స్థిరపడ్డ మొదటి రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహముగారేనని తెలుస్తున్నది. ఇంతకుపూర్వమే కొద్దిమంది-నుసర్ల అనంతరావు వంటివారు — ఏదోఒక సమాజానికి తాము నాటకాలను వ్రాసి ఇచ్చేవారు. మరికొందరు తామే సమాజాలను స్థాపించి వానికై నాటకాలను వ్రాసేవారు. అలాకాక ఒక సమాజానికి స్థిరంగా నాటక కర్తగా ఉండిపోవడం చిలకమర్తివారితోనే ప్రారంభం అయింది.[1] 1909 లో 'గయోపాఖ్యానము' ముద్రింపబడినతరువాతకాని ఆయన నాటకాలను మరొక సమాజము ప్రదర్శించలేదు.



తరువాతి తరంలోని నాటకరంగ చరిత్రను గమనిస్తే దీనిని చాలా ముఖ్యమైన పరివర్తనగా పేర్కొనవచ్చు. రానురాను సమాజాలు అధికం కావడం, వృత్తి నాటక సమాజాలు ఏర్పాటుకావడం, ప్రతి నాటక సమాజానికి ఒక నాటకకర్త విధిగా ఏర్పడడం జరిగాయి.

చిలకమర్తి ఈ విధంగా ఒకే నాటక సమాజానికి — రాజమహేంద్రవర హిందూ నాటక సమాజానికి — మాత్రమే నాటకాలు వ్రాసి యివ్వడం, వారిచేత ఆ నాటకాలను ప్రదర్శింపచేయడంలో తోడ్పడడం పెక్కు సంవత్సరాలు నడిచింది. 1894 వ సంవత్సరంను వరకు నడిచిన ఈ నాటక సమాజం 1901 వరకు ఎట్టి నాటక ప్రదర్శనలను ఇవ్వలేదు. తిరిగి 1901 లో దీనిని పునరుద్ధరించినప్పుడు చిలకమర్తివారే దీనికి అధ్యక్షులుగాను, మేనేజరుగాను నియోగింపబడ్డారు.

హిందూ నాటక సమాజము రెండవసారి ప్రారంభమైనప్పుడు కేవలం చిలకమర్తివారి నాటకాలనేకాక ఇతరుల నాటకాలనుకూడా ఆ సమాజం ప్రదర్శించేది. వీరి నాటకచక్రం (రిపర్టరీ) లో చిలకమర్తివారి నాటకాలతోపాటు వీరేశలింగముగారి 'శాకుంతలము',

---

1. 1900 ప్రాంతాలలో పిఠాపురంలో రావు చెల్లాయమ్మారావుగారి ఆధ్వర్యాన ప్రారంభమైన హిందూ థియాట్రికల్ నాటక సమాజానికి పానుగంటి లక్ష్మీనరసింహముగారు 'కవులు' గా ఉండేవారు. ఇదికూడా చిలకమర్తివారికి తరువాతనే! ఈ సమాజంవారు ఇతరుల నాటకాలనుకూడా ప్రయోగించేవారు.

'రత్నావళి', 'చమత్కార రత్నావళి', 'సత్య హరిశ్చంద్ర' నాటకాలు; ధర్మవరము రామకృష్ణమాచార్యులవారి 'చిత్రనళీయము', వడ్డాది సుబ్బారాయుడుగారి 'వేణీసంహారము', 'విక్రమోర్వశీయము' కూడా ఉన్నాయి.[1]

ఇంత వైవిధ్యంకల నాటకాలను ప్రదర్శించడాన్నిబట్టి, చిలకమర్తి ఈ సమాజంలోని నటులకు నిర్దేశించిన క్రమశిక్షణనుబట్టి[2] ఈ సమాజం వృత్తి నాటక సమాజాల కోవకు చెందినదనే చెప్పుకోవాలి. ఇందులోని నటులు ఉద్యోగస్థులే. అయినా నాటక సమాజము నడిచిన తీరు మాత్రం తరువాతవచ్చే వృత్తి నాటక సమాజాల శిక్షణకు మూలరూపం అని చెప్పక తప్పదు.

ఈ సమాజం గున్నేశ్వరరావు, నాగేశ్వరరావుగార్ల చేతిలోనికి పోయినతరువాత కేవలం వృత్తి నాటక సమాజమే అయింది. "ఆంధ్రదేశం మొత్తంమీద నాటక సమాజానికి వర్తక మర్యాదను వార్చిపెట్టినవారు మన గున్నేశ్వరరావు, నాగేశ్వరరావుగార్లే. ఎక్కువగా ద్రవ్యాన్ని ఆ విషయంలో ఖర్చుపెట్టినవారుకూడా ఒక విధంగా వీరే......ఇక ఇక్కడినుంచీ ఆంధ్ర నాటక ప్రపంచానికి ఒక క్రొత్తరూపం తటస్థించింది. క్రొత్త పద్ధతులు బయలుదేరాయి."[3]

హిందూ నాటక సమాజము 1893 ప్రాంతాలకే వృత్తి నాటక సమాజ పద్ధతులమీద నడిచిందని, తరువాత వృత్తి నాటక సమాజాలలో ముఖ్యమైనదిగా వెలుగొందినదని అందువల్లనే పేర్కొన్నాను.

1. స్వీయచరిత్రము-పుట 193.
2. స్వీయచరిత్రము-పుటలు 194-95
3. శ్రీ పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రి, 'ఆంధ్ర నట ప్రకాశిక', పుట 323.



పెట్టుట, మునుపున్నభాగములను కొన్నింటిని తీసివేసి క్రొత్తభాగములను చేర్చుట".[1] వీనిలో ముఖ్యమైనది పద్యాలను చేర్చడం. ఇది ఆనాటి నాటకాల, ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా చిలకమర్తివారు చేసిన "సవరణ."

ఈ విధంగా చిలకమర్తి నాటకరచనలోను, నాటకసమాజ నిర్వహణలోను కొత్తపుంతలను తొక్కడంకన్న, తనకు ముందుగానే ఏర్పడిన విధానాలను అనుసరిస్తూ, ఒకప్రక్క ప్రజాబాహుళ్యానికి, వేరొక ప్రక్క నటసమాజాలవారికి వారివారి అవకాశ, అభిరుచులకనుగుణంగా ఉండే విధంగా తమ పద్ధతులను దిద్దుకొన్నారు. అలా అన్నంతమాత్రాన ఆయన సామాన్యమైన నాటకకర్తఅన్న భావం రాకూడదు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాటక సమాజాలు నాటకాలను ప్రదర్శించాలి; నాటకసమాజాలవారికి అట్టి నాటకాలను నాటక కర్తలు వ్రాసియివ్వాలి. ఇది వృత్తినాటక సమాజాలు ఉన్నప్పుడు ఎక్కడనైనా జరిగేపద్ధతే! అట్టి పద్ధతిని ప్రారంభించి ఆంధ్రదేశంలోని ఆబాలగోపాలాన్ని అలరించే నాటకాలను వ్రాసిన ఖ్యాతి చిలకమర్తిదే నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

1. "స్వీయచరిత్ర," పుటలు 236-37

# స్వతంత్ర నాటకాలు

చిలకమర్తి వారు వ్రాసిన స్వతంత్రనాటకాలు మొత్తం పదకొండు. అందులో కీచకవధ, నలనాటకము, శ్రీరామజననము, సీతా కళ్యాణము అముద్రితాలు. గయోపాఖ్యానము, ప్రసన్నయాదవము, పారిజాతాపహరణము, భక్తప్రహ్లాద, చతుర చంద్రహాసము, తిలోత్తమ అన్న ఆరు నాటకాలు, ఇటీవల వచ్చిన ద్రౌపదీపరిణయము ముద్రితములైన నాటకాలు. ఇవికాక అసంపూర్తి రచనలు కొన్ని కనిపిస్తున్నాయి. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన "బమ్మెరపోతన", అముద్రితంగా ఉండిపోయిన "హరిశ్చంద్ర" నాటకం ఇట్టివి. ఇతరులు వ్రాసిన నాటకాలలో కొన్ని ముఖ్యమైన ఘట్టాలను మార్చి, తిరిగి రచించినట్లుగా కూడా పంతులుగారు చెప్పుకొన్నారు. ముడుంబై రామానుజాచార్యులుగారు వ్రాసిన "పాండవాశ్వమేధయాగనాటకము". మరెవరో వ్రాసిన "సారంగధర" నాటకములలో ఇట్టి మార్పులుచేసి యిచ్చినట్లు పంతులుగారు వ్రాసుకొన్నారు.[1] అముద్రితాలు, అసంపూర్తి రచనలుపోను మిగిలిన ఏడు నాటకాలను గురించి ఇక్కడ సంక్షిప్తంగా పరిశీలిస్తాను.

రాజమహేంద్రవరంలో ఉపాధ్యాయులుగా ఉంటూనే, నాటకాలలో ఉన్న ఆసక్తికొద్దీ హిందూనాటక సమాజమును స్థాపించిన ఇమానేని హనుమంతరావు నాయుడుగారు ఒకనాడు చిలకమర్తి

1. "స్వీయచరిత్ర," పుట 98.



వారి ఇంటికివచ్చి 'మేమొక నాటక సమాజమును స్థాపించినాము. శ్రీ తోలేటి వెంకట సుబ్బారావుగారు 'హరిశ్చంద్ర' నాటకమును ఆడుకొనుటకై వ్రాసిఇచ్చిరి. మీరు 'కీచకవధ' నాటకముగ వ్రాసి మాకియ్యవలెను"[1] అని అడిగారట. దానికి సమాధానంగా చిలకమర్తి వారు శ్రీసుసర్ల అనంతరావుగారు "పాండవాజ్ఞాతవాసమన్న" నాటకం వ్రాశారు. అందులో కీచకవధ వృత్తాంతం ఉన్నది. మీరు దానిని ప్రయోగించండి-అన్నారట. అయితే "పాండవాజ్ఞాతవాసచరిత్ర"లో పద్యాలు ఉన్నాయనీ, తమ సమాజ సభ్యులకు పద్యాలు పాడడం రాదని, అందువల్లనే "హరిశ్చంద్ర"ను కూడా వచన నాటకంగానే వ్రాయించుకొన్నామనీ నాయుడుగారు సమాధానం చెప్పారు. చిలకమర్తివారు సరేనన్నారు.

ఇది ఒక చిత్రమైన సన్నివేశం. పద్యాలులేని నాటకాలు కావలసిన హనుమంతరావు నాయుడుగారు అదివరకే తమకు వచననాటకం వ్రాసిఇచ్చిన తోలేటి వారినే "కీచకవధ" నాటకంకూడా వ్రాసియిమ్మని అడిగి ఉండవచ్చు. పైగా చిలకమర్తి రచనలు చేయగలడనడానికి ఆనాటివరకు ఉన్న నిదర్శనం అయిన వేదము వేంకటాచలముగారిమీద వ్రాసిన పద్యాలే! పద్యాలు వ్రాయగలడని, కవిత్వం చెప్పగలడని పేరుపడ్డ చిలకమర్తిదగ్గరకు పోయి తమకు వచననాటకం వ్రాసిపెట్టండని నాయుడుగారు అడగడం, ఆయన సరేననడం ఒక విచిత్రమైన కలయిక. ఆ కలయికే తెలుగువారికి కొన్ని చక్కని నాటకాలను ప్రసాదించింది.

1889 వ సంవత్సరము జనవరి నెలలో "కీచకవధ" రచనకు, దానితోపాటు తమనాటక రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు చిలకమర్తి. ఈ నాటకం అదే సంవత్సరము జూన్ 15 వ తేదీ శనివారం నాడు ప్రదర్శింపబడ్డది. ఈ నాటకంలో భీమునిగా నాయుడుగారు,

1. "స్వీయచరిత్ర", పుట 78.

ద్రౌపదిగా టంగుటూరు ప్రకాశంపంతులుగారు వేషాలు ధరించారు. నాటకం విజయవంతంగా ప్రదర్శింపబడడంతో నాయుడుగారు మరొక నాటకం వ్రాయవలసిందిగా చిలకమర్తిని కోరారు. రెండవనాటకం "ద్రౌపదీ పరిణయము". మూడవనాటకము "గయోపాఖ్యానం". కాని ఆ నాటకం సగంలోవుండగా, నాటక సమాజము వారి కోరిక మీద దానికి బదులుగా, ముందు "శ్రీరామజననము" అనే నాటకాన్ని వ్రాసిఇచ్చి తరవాత "గయోపాఖ్యానా"న్ని పూర్తిచేసి ఇచ్చారు. ఈ నాటక రచనావ్యాసంగమంతా 1889 లో ఒక సంవత్సరకాలంలోనే జరిగింది!

## గయోపాఖ్యానము

చిలకమర్తివారి నాటకాలలో అధిక ప్రచారం కల నాటకం "గయోపాఖ్యానము". దీనిని వ్రాయడానికి కూడా చిలకమర్తిని పురికొల్పింది హనుమంతరావునాయుడుగారే![1] చిలకమర్తి దీనిని 1889 వ సంవత్సరము అక్టోబరులో ప్రారంభించి 1890 జనవరిలో పూర్తిచేశారు. తరువాత అర్ధశతాబ్దంపాటు తెలుగుదేశంలో, తిరుపతి వేంకటకవుల "పాండవోద్యోగవిజయా"లతో పాటు లెక్కలేనన్ని సార్లు ప్రదర్శింపబడ్డది ఈనాటకం. చిలకమర్తివారే అన్నట్లు "తెనుగు దేశములో గయోపాఖ్యానము ప్రదర్శింపని రంగస్థలమేలేదని నా నమ్మకము."[2]

గయోపాఖ్యానంలోని కథ కల్పితం. దీనిని నాదెండ్ల గోపమంత్రి ద్విపదగాను, వెలిచేరు వెంకటరామ ప్రధాని, రామయామాత్యుడు, కస్తూరి రంగకవి, వెల్లంటి సుబ్బయార్యుడు పద్య కావ్యాలుగాను వ్రాశారు. చరికొండ ధర్మన్న వ్రాసిన "చిత్రభారతము"

1. "స్వీయచరిత్ర", పుట 80.
2. "స్వీయచరిత్ర", పుట 290.



అన్నకావ్యంలో ఈ కథఉన్నట్లు దివాకర్ల వేంకటావధానిగారు పేర్కొన్నారు.[1] (ఇటీవల డాక్టర్ అవధానిగారు "నాట్యకళ"లో వ్రాస్తూ కూడా ఇలాగే పేర్కొన్నారు.) అయితే ఈ కథ చిత్రభారతంలో ఉన్నట్లు, గయుడు కృష్ణునిచేతిలోకాక గాలవుడన్న ఋషిచేతిలో ఉమిసినట్లు, అతడు కృష్ణునితో చెప్పగా కృష్ణుడు గయుని సంహరించెదనని ప్రతినపూనినట్లు, గయుడు అర్జునుని శరణు వేడినట్లు, కృష్ణార్జున యుద్ధము జరిగినట్లు-చిలకమర్తి వారే తమ స్వీయచరిత్రలో పేర్కొన్నారు.[2] బహుశః ఇదే దివాకర్లవారు పై విధంగా వ్రాయడానికి కారణం కావచ్చు.

కాని చిత్ర భారతంలోని కథలో గయుడులేడు. ఆతనికి బదులు చతుర్థనుడున్నాడు. తుల్యుడన్నముని శాపంవల్ల రంభ అశ్వమై, చతుర్థనుణ్ణి ఎక్కించుకొని గగనమార్గాన పోతూవుండగా ఆ అశ్వం యొక్కఫేనము అర్ఘ్యం ఇస్తున్న కృష్ణునిచేతిలో పడ్డది. కృష్ణుడు కుపితుడై ఆ అశ్వంమీద పోతున్నవానిని ముప్పదిరోజులలో చంపుతానని శపథం చేశాడు. ఈమాట నారదునిద్వారా విన్న చతుర్థనుడు ఇంద్ర, బ్రహ్మ, శంకరుల నారాధించి విఫలమనోరథుడౌతాడు. ఇంతలో భల్లుడొకడు చెప్పగా అర్జునుడు తమ పొలములకు మృగయ సమితితో వచ్చినాడని విని, కృష్ణుని పేరు చెప్పక వానిని శరణు కోరాడు. ఆదికారణముగా కురుక్షేత్రములో ఘోరరణము జరిగింది. ధర్మరాజు తక్కతక్కిన వారెల్లరు చనిపోగా, కృష్ణుడు ధర్మరాజును మన్నించి, అతని తమ్ములను, చతుర్థనుని బ్రతికించి కాపాడాడు.

ఈ కథకు, గయోపాఖ్యాన కథకు కొంతపోలిక ఉన్నట్లు కనిపించినా, చిలకమర్తివారు తమ "స్వీయచరిత్ర"లో ఈ కథను సరిగా

1. "ఆంధ్ర పత్రిక," మన్మథసంవత్సరాది సంచిక
2. "స్వీయచరిత్ర," పుట 80.

పేర్కొనకపోవడం చూస్తే ఆయన ఈ కావ్యం చూడలేదనిస్పష్టం అవుతున్నది.

కాని చిలకమర్తి చూచిన మూలగ్రంథాలనుగురించి సవిమర్శక పరిశీలనచేసిన శ్రీ కేతవరపు రామకోటి శాస్త్రిగారు "ఇన్నికథలాధారముగా గొని లక్ష్మీనరసింహముగారి నాటకమును రచించిరి. చాల విషయముల ద్విపదగ్రంథమును రామయామాత్యుని గ్రంథమునాధారముగా చేసుకొని ఈ నాటకరచన సాగినది. అని వ్రాశారు.[1] కాని చిలకమర్తి "స్వీయచరిత్ర" లో "రామకవి యను నతడు గయోపాఖ్యానకథను దెనుగులో పద్యకావ్యముగ రచించెను. నేను కథాసంవిధానములో రామకవి పుస్తకమునే యనుసరించితిని"[2] అని స్పష్టంగా చెప్పుకొన్నారు. అందువల్ల డాక్టర్ శాస్త్రిగారు భావించినట్లు రామయామాత్యుని పద్యకావ్యంతోబాటు కస్తూరిరంగకవి ద్విపద గయోపాఖ్యానానికి ఆధారంకాదు. అయితే రామకవి తన పద్యగ్రంథాన్ని కస్తూరిరంగకవి వ్రాసిన "కృష్ణార్జున సంవాదము"న్న ద్విపదకావ్యాన్ని అనుసరించి వ్రాయడంవల్ల, ఆ రెండింటిలోను కథావస్తువు దాదాపు ఒకటేకావడంవల్ల వారు ఈవిధంగా వ్రాసిఉండవచ్చు.

గయోపాఖ్యానంలోని ఇతివృత్తం చాలావరకు చిలకమర్తి అనుసరించిన మూలగ్రంథానికి అనుసరణమే! చిలకమర్తి చేసిన కొద్ది మార్పులు కథాసంవిధానానికి అధికమైన ఔచిత్యాన్ని కల్పిస్తున్నాయనడంలో సంశయంలేదు. రామకవి పద్యకృతిలో కృష్ణుడు ద్వారకానగరానికి సమీపానవున్న కాసారంలో అర్ఘ్యం ఇస్తున్నట్లు చూప

1. "సమీక్షణ," పుట 23

2. "స్వీయచరిత్ర," పుట 80



బడ్డది. నాటకంలో కృష్ణుడు బృందావనసమీపంలో వున్న కాళిందిలో అర్ఘ్యం ఇస్తున్నట్లు చూపబడ్డది. జయంతి రామయ్యగారు ఈ మార్పుకు ఒక ఔచిత్యాన్ని ఊహించారు.[1] పూర్వపరిచిత ప్రదేశాలను చూసినప్పుడు కలిగే భావాలను వర్ణించడానికి ఈ మార్పును చేసిఉండవచ్చునన్నారు. కాని కేవలం వర్ణించడంకోసమే స్థలాన్ని మార్పుచేశాడు-అనడం నాటకరచయిత శక్తిసామర్థ్యాలను తక్కువచేయడమే అవుతుంది. అంతకన్న—కృష్ణుడు తల్లిదండ్రులను చూడడానికి వస్తున్నాడు. త్రోవలోనే ఈ విఘాతం జరిగింది. అందువల్ల ఎంతోకోపోద్రిక్తుడై తేగాని కృష్ణుడు భార్యాపరివార సమేతంగా వచ్చి వారిని చూడకుండానే తిరిగి పంపడు. ఆ పంపివేయడంలో ఆయన కోపంయొక్క పరిమాణం తెలుస్తుంది. అంతేకాక కాళిందిని అధికారికంగా ఆ ఉమిసినవాడెవడో చెప్పమనడంలో తన అధికారం కాళిందికి వెనుకనే తెలిసినదన్న ధ్వని ఉన్నది.

నిష్ఠీవనం చేసినవాడిని కనుగొనలేక విస్మితుడై ఉన్న కృష్ణునకు ఆతడు గయుడని జలదేవత చెప్పినట్లు రామయామాత్యుడు వ్రాశాడు. చిలకమర్తి ఇక్కడ ఎంతో రసవంతమైన మార్పును చేశాడు. ముందు ఈ నిష్ఠీవనం చేసినవాడని చంపుతానని ప్రతినపట్టి ఆ తరువాత కోపముతో జలాధిదేవతను సంభోధించి ఆ దుష్టుని నామధేయాదులను తెలుపవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. ఈ మార్పువల్ల కృష్ణునకు, జలాధిదేవతకు కూడా పాత్ర ఔచిత్యాన్ని కలుగచేశాడు రచయిత.

ఇవికాక నాటకీకరణమునకు అనుకూలంగా ఉండడానికి, నాటకకాలాన్ని కుదించడానికి కూడా చిలకమర్తి తననాటకంలో కొన్ని మార్పులను చేశారు. అందులో ముఖ్యమైనవి శ్రీకృష్ణుడు

1. "ఆధునికాంధ్ర వాఙ్మయ వికాసవైఖరి," పుట 63

పంపిన గరుడుని రాయబారాన్ని తీసివేయడం, అక్రూర సుభద్రలు విడివిడిగాకాక ఒకేసారి రాయబారానికి రావడం, కృష్ణార్జునుల యుద్ధం సంగతివిని దుర్యోధనాదులు పాండవులకు సహాయంగా వచ్చారన్న విషయాన్ని సూచించివదలడం—మొదలైనవి.

నాటకాంతంలో కృష్ణార్జునుల యుద్ధాన్ని శంకరుడు మాన్పే ఘట్టం ఈ కథకు పరాకాష్ఠ. దానిని నిర్వహించడంలో మిగిలిన గ్రంథాలన్నింటికన్న చిలకమర్తి తన నాటకంలో ఎంతో ప్రతిభ చూపాడు. రామయామాత్యుని కావ్యంలో శంకరుడు ప్రత్యక్షమై "వారిజ నాభుడు మేమును శూరుడవని మెచ్చినాము సురపతి తనయా, కోరినవరమడుగుము" అంటాడు అర్జునునితో. అర్జునుడు గయునికాచుటయే నాకు కావలసినవరము—అన్నాడు. అయినచో కృష్ణుని శరణుకోరుకొనుమన్నాడు. అర్జునుడు కృష్ణుణ్ణి శరణు కోరాడు. కృష్ణుడు అర్జునునితోపాటు గయుణ్ణి కూడా కాపాడాడు.

నాటకంలో మరికొంతమార్పుచేయబడ్డది. నరనారాయణుల యుద్ధంవలన ఏర్పడిన జగత్సంక్షోభాన్ని మాన్పడానికి శంకరుడు ప్రత్యక్షమైనాడు. మానవరూపంలోవున్న నారాయణుడు కూడా తొందరపడి తప్పుచేస్తే, దానిని ఎత్తిచూపి పరిహారం చెప్పవలసిన వాడు శంకరుడే. అందువల్లనే "ధరగలవారి జూడకయె తానుమియన్ గయుతప్పు, చూడకీ కరణి నొనర్చు వాని నఱకంగమకించుట నీదు తప్పు" అని ధైర్యంగా చెప్పగలిగాడు. దానికి పరిహారం సంధి అని కూడా చెప్పగలిగాడు. కాని శ్రీకృష్ణుని ప్రతిజ్ఞ వట్టిపోవడం ఎలా? దానికి శంకరుడు ఉక్తివైచిత్రితో సమాధానం చెప్పాడు. "నీవు దేవకీసుతుడవుకాదు, స్వయంభువుడవు; బలభద్రుడు నీఅన్నకాదు. ఫణిదేవత; నీవు నరమాత్రుడవుకావు, ధరణిభారాన్ని తగ్గించడానికి వచ్చిన హరివి; యాదవుడవుకావు, మాధవుడవు" అని శ్రీకృష్ణుని సంశయం తీరుస్తాడు.



ఈవిధంగా నడిపిన కథా నిర్వహణంలో రచయిత నాటకగమనానికి అవసరమైన ఉత్సుకత (Suspense) నే కాక, నాటకీయ వ్యంగాన్ని (Dramatic irony) కూడా ఎంతో నేర్పుగా ప్రయుక్తం చేశాడు. సత్యలోకాన్ని చూచి, వాణీపంకజాసనులను కొలిచి "ఇప్పుడు నిశ్చయముగా నేనుత్కృష్ట జీవనుడనైతి" నని సంతోషిస్తూనే బ్రహ్మదేవుని సందర్శించినది మొదలు తనకు ముక్తిమీదనేగాని జీవితముమీద ఇచ్ఛలేదని గయుడుపలికిన పలుకులకు చిత్రరేఖ భయపడి "అమంగళము అప్రతిహతమగుగాక" అనగా, గయుడునవ్వి "ఆహాహా! యువిదలెంత భీరువులు! ఆనందాతిశయమున బరవశుండనై పలికిన మర్మములేని వాక్యమున కింత వెఱవవలెనా" అని ఓదారుస్తాడు. ఇంతలో పట్టాభిషేకగజము మరణించినదన్న వార్త వినగానే ఆమెను తిరిగి అనునయిస్తూ

"మదపుశేనుంగువడెనంచు మఱుగనేల?
జన్మమెత్తిన పిదప నే జంతువైన
బ్రహ్మకల్పాంతమగుదాక బ్రతుకఁగలదె?
మరణమెపుడైన నున్నదె మనకు నెల్ల"[1]

అంటాడు. ముందు భయంలేదనడం, వెంటనే మరణానికి సిద్ధంగా ఉండాలనడం, వెంటనే తెరలో "నిజము గంధర్వా! నిజము! సర్వజనులును మరణమునకు సిద్ధముగా నుండవలయును. నీవును సిద్ధముగా నుండుము" అని ఆకాశవాణి పల్కడం పరస్పర విరుద్ధమైన భావాలకు ఆలవాలమై ఉన్నాయి.

---

1. "గయోపాఖ్యానము" పుట 29.

అలాగే తాము ఒకటి తలుస్తూ ఉండగా మరొకటి జరగడం రాయబారాల విషయంలో చూడవచ్చు. సాత్యకి—తామువంపిన రాయబారానికి ధర్మరాజు, అర్జునుడు ఒప్పుకొని గయుణ్ణి తమ అధీనం చేస్తారని చెబుతాడు. కృష్ణుడుకూడా "పాండునందనులు మనకు జిరకాల మిత్రులగుటచే మఱియొక లాగున వర్తింపరు......పార్థుడు నాబహిఃప్రాణముగదా?" అంటాడు. కాని వెనువెంటనే అక్రూరుని రాయబారం వినగానే సహజంగానే యాదవవీరులు ఉగ్రులై పోతారు. ఈవిధంగా వ్యంగ్యాన్ని, సూచ్యార్థ సూచనాన్ని నాటకం ఆసాంతం నేర్పుగా నిర్వహించారు చిలకమర్తి.

గయోపాఖ్యానంలోని పాత్రచిత్రణాన్నిగురించి పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలున్నాయి—ముఖ్యంగా శ్రీకృష్ణుని పాత్రను గురించి. శ్రీ జయంతి రామయ్య పంతులుగారు తమ విమర్శనంలో "ఈ సంభాషణములును, దన్నులును సామాన్యులకు సరిపోయిన సరి పోవచ్చుగాని కృష్ణార్జునులవంటి ధీరాగ్రేసరులకు దగనివి యని నా యభిప్రాయము" అన్నారు[1]

శ్రీ పాలకోడేటి వెంకట్రామ శర్మగారు ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో "శ్రీకృష్ణుడు - గయోపాఖ్యానము"[1] అన్న వ్యాసంలో చిలకమర్తివారు "శ్రీకృష్ణుని సామాన్య మానవునిగా దలచినారా? లేక భగవత్స్వరూపుడని భావించినారా? యని ఆలోచింపవలసియున్నది" అని వ్రాస్తూ శ్రీకృష్ణుడు భగవత్స్వరూపుడే యని, ఆయన "అనిర్వాచ్య మహిమచే సకలజనులు తృప్తిపొంది, సంతోషభరితులైనటుల గ్రంథకర్త అన్వయించుటచే ఆ గ్రంథకర్త యుద్దేశమూహ్యంబు"[2] అన్నారు. ఈ వ్యాసంలో శ్రీ శర్మగారు

1. అధునికాంధ్రవాఙ్మయ వికాసవైఖరి, పుట 74
2. ఆంధ్రపత్రిక సం॥ సంచిక, 1926



శ్రీకృష్ణుడు భగవత్స్వరూపుడు కాడని మామూలు మానవుడుగా చిత్రించబడ్డాడు -అనివాదించేవారి అభిప్రాయాలను పరాస్తం చేయడానికి ప్రయత్నించారు. ఇదే అభిప్రాయాన్ని బందా కనకలింగేశ్వర రావుగారు కూడా వెలువరించారు.[1] దీనికి ప్రతిగా శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు, శ్రీశశాంక, శ్రీ కురుమెళ్ళ వెంకట్రావు, ప్రభృతులు శ్రీకృష్ణునిలో మానవలక్షణాలు ఉండటంవల్లనే ఆ నాటకానికి అంత ప్రాముఖ్యం వచ్చిందని పేర్కొన్నారు.[2] "భగవంతుడిగా ఆరాధించబడే శ్రీకృష్ణమూర్తిలో సామాన్య మానవునికి గల సమాజ ప్రవృత్తులను ప్రభావితంచేసి మానవలోకంలోని మనలాంటి లౌకికునిగా చిలకమర్తివారు కృష్ణున్ని చిత్రించారు. అందువల్ల ఆయనా, ఆయనతోవున్న మానవులూ మనలాంటి సామాన్యమానవులకు దగ్గరవారు అయ్యారు. మనకిలాగే ఆయనకీ కోపతాపాలు ఉన్నాయి. మనకిలాగే క్షమాగుణము ఉంది. అందుచేత మన ఆదరణకూ, మన ఆప్యాయతకూ, గౌరవానికి పాత్రమయ్యాడు."[3]

ఈ నాటకంలోని లోపాలను ఎత్తిచూపుతూ "ధీరోధాత్తులైన కృష్ణార్జునులు సామాన్యమానవులవలెనున్నారు ఈ నాటకమున"[4] అని ఆరోపించారు డాక్టరు రామకోటిశాస్త్రిగారు. నిజానికి ఈ అరోపణలన్నీ కొంతవరకుమాత్రమే నిజం. శ్రీకృష్ణునిపాత్ర చిత్రణ ఈ రెంటికి మధ్యమార్గంలో వున్నదని జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుస్తుంది. కృష్ణుని కోపతాపాలు, ప్రతిజ్ఞలు, పంతాలు. పట్టింపులు, విరసభాషణం ఇవిఅన్నీ ఆయనలోని మానవీయగుణాలను చాటి చెప్పు

1. సాహిత్యవ్యాసములు, 8 (సాహిత్యఅకాడెమీ ప్రచురణ), పుట 21
2. "నాట్యకళ", చిలకమర్తి ప్రత్యేకసంచిక (సెప్టెంబరు, 1970), పుట
3. శ్రీ కురుమెళ్ల వెంకట్రావు, "నాట్యకళ". (సెప్టెంబరు, 1970) పుట 20
4. "సమీక్షణ" పుట 35

తున్నాయి. అసలు (ఇదిలోపం అనుకుంటే) కథలోనే ఉంది. బావమరదులమధ్య కలహంరావడం, అది యుద్ధానికి దారితీయడం, మధ్యవర్తి వచ్చి తీర్పుచెప్పడం ఇవి కృష్ణార్జునులు నరనారాయణుల అవతారాలనుకుంటే పొసగని విషయం. అందువల్లనే ఈ సహజమానవ గుణాలు వారు ఈ భూలోకంలో జన్మించడంవల్ల వారి యెడకూడ అనువర్తించబడ్డవి. అవి శంకరునివంటివాడు ప్రత్యక్షమై జ్ఞాపకంచేస్తేనే గాని కృష్ణునకు కూడ జ్ఞాపకంరాలేదు. అందువల్లనే ఆయన గయుణ్ణి చంపకపోతే "దేవకీదేవికి పుణ్యమూర్తి వసుదేవునకుం దనయుండగాని కన్" అనే అనగలిగాడు.

అయితే కృష్ణుడిలా మానవలక్షణాలు కలవాడిలా ప్రవర్తిస్తూ ఉంటే వేరొక వంక నాటకంలోని మిగిలిన పాత్రలన్ని ఆయనను భగవదాంశ సంభూతుడనే భావించి, ప్రస్తుతిస్తాయి. "త్రిలోక పూజ్యుండగు దేవకీ తనయుడని" (7) సాత్యకి, వైతాళికులు "కృష్ణ! జగన్నాయకా!" (8) అని సంభావిస్తారు. "సకలలోకారాధ్యుడ వగు నీయెడ నెవ్వడేమి యపచారము గావించెను?'' అని బలరాముడే కృష్ణుణ్ణి ప్రశ్నిస్తాడు. ''నీసందర్శనంబుకంటే సత్యలోకావలోకన మెక్కువ ఫలదాయకమే?'' అని వాపోతాడు గయుడు. ''జగద్భద్ర సంధాయకుడ"ని, "అవతారంబులు దాల్చినాడు పది, బ్రహ్మాండంబు నిర్మించినాడవనీభారము మాన్పినాడు.........'' అని అక్రూరుడు మెచ్చుకుంటాడు. సరే! ఇక యుధిష్టరాది పాండవులమాట చెప్పనే అక్కరలేదు. ఈవిధంగా శ్రీకృష్ణునిపాత్ర మానవ, దేవ లక్షణాల సమన్వయం. మిగిలిన వారి కందరకు ఆయన ఏవిధంగా దేవుడో, తనకుతాను అంతమానవుడు. ప్రేక్షకులకు దేవ, మానవుల లక్షణాలు సమంగా తనలో నిక్షిప్తంగా చేసుకున్నవాడు. దైవమేఅయినా మానవుడు. కృష్ణునిపాత్రను చిలకమర్తి తన "పారిజాతపహారణం"లో కూడా ఇదేవిధంగా చిత్రించాడు. తెలుగుదేశంలో ఈపాత్ర, దానితో



పాటు ఈ నాటకం ఇంతప్రసిద్ధికిరావడానికి కృష్ణునిపాత్ర చిత్రణంలో ఈదేవమానవుల లక్షణాల సమన్వయం అంటే అతిశయోక్తికాదు. తెలుగుదేశంలో రామునిపాత్ర ప్రసిద్ధికి చెందడానికి కూడ ఇదే కారణమని మనం గ్రహించాలి. దేవునిఅవతారమే అయినా మానవులలో పుట్టాడు. ఆ కష్టాలను అనుభవించాడు. ఇలా తమలో జన్మించిన భగవంతుడు తమ నిత్యజీవితంలో తాము అనుభవించే సుఖదుఃఖాలను ఆయనకూడా అనుభవిస్తున్నాడని భావిస్తే ఆ పాత్రతో ఒక విధమైన తాదాత్మ్యం చెందుతారు ప్రేక్షకులు. ఇది కృష్ణునిపాత్ర చిత్రణం లోని అంతర్యం.

ఇక్కడే మరొక్క ఆరోపణను గురించి కొంచెం వ్రాయాలి. కృష్ణునిపాత్ర చిత్రణం గురించి వ్రాస్తూ డా॥ రామకోటిశాస్త్రిగారు ఈవిధంగాఅన్నారు: "పంచమాంకమున యుద్ధానంతరము శ్రీకృష్ణుడు చదువు ''కుటిలాచారులు'' అనుపద్యముతో నాటకమంతయు చెడిపోయినది. ధార్తరాష్ట్రులను గెలుచుటకు తగిన పటుశస్త్రములు పాండవులు సంపాదించిరో లేదో అని తెలుసుకొనగోరి యుద్ధము చేసినాడట కృష్ణుడు. ఇంతకంటే అసందర్భమైన వాక్యము ఈ నాటకమున మరియొకటిలేదు. నాటకప్రాణమునే హరించినది...''[1]. కాని ఇది ఎందువలన అసందర్భమైన వాక్యమో శాస్త్రిగారు వివరించలేదు. పాత్రపోషణలో ఉదాత్తత లోపించడం కారణంగా వారిమాట అన్నారనుకోవచ్చు.

నాటకం ఆసాంతం ఇంత పట్టుదలపట్టి గయుణ్ణి విడవవలసిందిగా ఇందరిని రాయబారం పంపి చివరకు నీచేవ తెలుసుకుందామని ఈ తతంగం జరిపించాననడం పైకిచూస్తే ఏమాత్రమూ సహేతుకంగా

1. "సమీక్షణ" 34, 35

కన్పించనిమాట నిజం. అయితే శాస్త్రిగారు నాటకాన్ని సవిమర్శకంగా చదివినట్లు కన్పించదు. నాటకంలో కృష్ణుడు గయుణ్ణి సంహరిస్తారనడం అర్జునుణ్ణి పరీక్షించడం కోసమని మనకు తెలియచెప్పాడా రచయిత? కృష్ణుడు తానుగా ఈ మాటను ఎప్పుడూ చెప్పలేదు. నిజమే! కాని ఈ మాట అవతారతత్త్వం తెలిసిన ధర్మరాజు అంతకు ముందే చెప్పి, తన తమ్ముల్ని అప్రమత్తులుగా ఉండవలసిందిగా హెచ్చరించాడు.

ధర్మరాజు గయుణ్ణి రక్షించవలసిందేనని ఒప్పుకుంటూ “మీకొక్క రహస్యంబెఱిగించెద వినుడు” అని తమ్ములకు ఈవిధంగా చెబుతాడు:

“దివిజులొక్కొక్క వేళ శోధించుచుంద్రు
జనుల సత్యనిత్యత గడుశ్రమము పఱచి
దివిజనాథుండు శిబిని శోధింపలేదె?
అల హరిశ్చంద్రు గాధేయు డరయలేదె?”[1]

“అందుచేత మన నిత్యసత్యత శోధింపదలచి వాసుదేవుండింత పట్టుపట్టియున్నవాడేమో యని తోచుచున్నది” ఈ మాటలను బట్టి శ్రీకృష్ణుడు వారి సత్యసంధతను పరిశోధిస్తాడనేకాని, చివరలో పేర్కొనట్లు వారి శౌర్య పరాక్రమాలను కాదుగదా అనవచ్చు. కాని పై మాటలు చెప్పినవెంటనే ధర్మరాజు తిరిగి ఈవిధంగా అంటాడు:

“కమలనాభుని సాయంబుకలుగబట్టి
యలరుచున్నారు పాండవులంతెగాని
సహజముగ వారు దుర్బలుల్ శౌర్యహీను
లనుచు జగతిలో మన కపఖ్యాతిగలదు”.[2]

1. “గయోపాఖ్యానము”, 68
2. “గయోపాఖ్యానము”, పుట 69



“ఇప్పుడు వాసుదేవునకు బ్రత్యర్థులమై సంగరమందునిల్చితిమేని మన కాయపఖ్యాతి మాను”. పై “రెండు” పరమార్థాలను పరిశీలిస్తే చివరిలో కృష్ణుడామాట అనడంలో సందేహం ఉండకూడదు. ఈవిధంగా శ్రీకృష్ణుడనడం బహుశః రామయామాత్యుని పద్యకావ్య ప్రభావం కావచ్చు. అక్కడ శంకరుడే “వారిజ నాభుడు నేనును శూరుడవని మెచ్చినాము సురపతితనయా, కోరిన వరమడుగుము” అంటాడు. ఈ శౌర్యాన్నే తాను పరీక్షించానంటాడు నాటకంలో కృష్ణుడు. అందువల్ల ఇక్కడ ఉదాత్తతకూడా లోపించలేదు. ఎందువల్లనంటే ఇంతవరకు మానవుడుగా మాత్రమే ప్రవర్తించిన శ్రీకృష్ణుడు, శంకరుడు తనమహిమను గురించి చెప్పి, దివ్యదృష్టితో క్షీరసాగరమును చూపినవెంటనే “మహేశ్వరా! ఇప్పుడు నా సంశయముతీరినది” అంటాడు. అప్పటికికాని మానవ జన్మమెత్తిన శ్రీకృష్ణునకు తన మూలరూపం అర్థంకాదు. అది అర్థమైన వెంటనే ఇది తన లీలయేగాని మరొకటికాదని, తానుజన్మమెత్తిన పనిదగ్గరలో ఉన్నదని, కౌరవపాండవ యుద్ధం త్వరలో జరుగనున్నదని, దానికి తాను సారథ్యం వహించగా, అర్జునుడు గాండీవం ధరించాలని, అందువల్లనే తానుఅర్జునుణ్ణి ఇందుమూలంగా పరీక్షించదలిచానని చెప్పడంలో తనభగవత్స్వరూపాన్ని తెలుసుకొన్న శ్రీకృష్ణుని పాత్ర కనిపిస్తుందే కాని అనుదాత్తత కనిపించదు.

పరస్పర విరుద్ధమైన ఇన్ని పండితాభిప్రాయాలకు నెలవైన ఈ నాటకం పండిత పామరజన లోకంలో ఎంతో ప్రచారాన్ని పొందిందనడం నిర్వివాదం. దీనికి ఏ ఒక్క కారణాన్ని పేర్కొనలేము. మానవస్వభావానికి అతిదగ్గరగావచ్చే పాత్రచిత్రణం, సరళమూ సులభమూ అయి వచనానికి అతి చేరువగా ఉండే పద్యరచన–దీని ప్రచారానికి కారణాలుగా చెప్పుకోవచ్చు. రంగస్థలంమీద రక్తికట్టడానికి అనువైన లక్షణాలనన్నింటిని పుణికి పుచ్చుకొన్నదీనాటకం. “లక్ష

ప్రతులు ఆంధ్రదేశమున నమ్ముడుబోవుట నాటకముయొక్క గొప్పతనమును బట్టిగాదు. అది నాటకములులేని కాలమగుటనుబట్టి. నేటికిని జనాదరణ పాత్ర మయియేయున్నదిగదా యన, ఆ నాటకమును ఆదరించుటకు, ఆనందించుటకు, మాత్రమే తగినసంస్కారము జనులలో నున్నదన్నమాట" అన్న డా॥ రామకోటిశాస్త్రిగారి అభిప్రాయం సాహసంతోకూడుకున్నది. ఈ అభిప్రాయం అసమంజసంకూడా.

ఈ నాటకం తెలుగుదేశంలో నాటకాలులేనిరోజుల్లో రాలేదు. నాటకాలు విరివిగా ఆడబడుతూ, అటు రచనలోను, ఇటు ప్రదర్శనములోను ఒక సంప్రదాయం అంటూ నెలకొన్న తరువాత వచ్చినది. ప్రబంధశైలినుంచి నాటకపద్యాలను నాటకశైలికి మళ్ళించి రంగస్థలానికి అనువైన పద్యాలను వ్రాయడంలో తిరుపతి వెంకటకవులతో పాటు చిలకమర్తికికూడా పట్టం కట్టవలసిందన్న విషయం నాటక చరిత్ర తెలిసినవారందరూ అంగీకరించే విషయం. తిరుపతి వెంకట కవుల నాటకాలకన్న ఈయన నాటకాలు ముందు రావడంవల్ల అగ్రతాంబూలం ఈయనదేనంటే అంగీకరించని వారుండరు.

### పారిజాతాపహరణము

చిలకమర్తివారు హిందూనాటక సమాజంకోసం మరుసటి సంవత్సరం (1890 లో) వ్రాసిన నాటకం "పారిజాతాపహరణము." అదే పేరుగల ముక్కు తిమ్మనవ్రాసిన ప్రసిద్ధప్రబంధం దీనికి మూలం. ఇందులోకూడా చిలకమర్తి కొంత స్వాతంత్ర్యాన్ని తీసుకున్నారు. మూలంలోవలెకాక, నాటకం పారిజాతాపహరణంతో ముగుస్తుంది.

చిలకమర్తివారి రచనలన్నింటిలోను గుణందృష్ట్యా ఇది చిట్టచివరకు చేర్చవలసిన నాటకం. అసలు పారిజాతాపహరణమన్న పేరే దీనికి అనుచితం. ఎందువల్లనంటే ఈ నాటకంలో కృష్ణుడు పారిజాత

13290



వృక్షాన్ని అపహరించడానికి ప్రయత్నిస్తాడేకాని, అపహరించి తీసుకొనిపోడు. ఇంద్రుడే - ఎటువంటి ఆర్భాటంలేకుండా - ఆ వృక్షాన్ని కృష్ణుడు ఆ అవతారంలో భూమిమీద ఉన్నంతకాలం తమవద్ద ఉంచుకోవలసిందిగా కోరుతాడు. అందువల్ల అసలుకథకు బిగువైన ఇంద్రాదుల యుద్ధం ఇందులో ఉండే ఆస్కారం లేకపోయింది. అందువల్లనే వీరం ప్రధానరసం కావలసిఉన్నా హాస్యశృంగారాలు దాని స్థానాన్ని ఆక్రమించుకొన్నాయి.

మొదటి రెండు అంకాలలో ఉన్న రుక్మిణీ సత్యభామల సవతుల కయ్యాన్ని మించి ఈ నాటకంలో ఉత్సుకతను కలిగించే మరో సన్నివేశమేలేదు. చిలకమర్తితానుగా కల్పించిన సన్నివేశాలు రెండు. అందులో ఒకటి చిత్రరథుని రాయబారం. రెండోది కేవలం వినోదాన్ని కల్పించేది: అది నాటకంలో రంభాసంభోగాన్ని గురించి విప్రుడు-రాజు సాగించిన సంవాదం. ఇది హాస్యాన్ని కలిగించదు సరికదా, జుగుప్సకలిగించేదిగా కూడా వుంది. అయితే, ఇక్కడ సమకాలీన జీవితంలోను, అంతకుపూర్వమూ రాజ్యాధికారంపేర, బ్రాహ్మణత్వంపేర జరిగిన అత్యాచారాన్ని రచయిత పేర్కొన్నాడనుకోవలసి వస్తున్నది.

ఇందులోని పాత్ర చిత్రణంకూడా ఉదాత్తంగాలేదు. పారిజాతాపహరణ ప్రబంధంలో రుక్మిణి సత్త్వగుణ సంపన్నురాలు. నాటకంలో ఆమెకూడా కొంతవరకు సత్యభామవలెనే ఈర్ష్యా సంజాతగా కనిపిస్తుంది.

ఇతివృత్తంలోను. పాత్రపోషణంలోనూకూడా ఇన్నిలోపాలు ఉన్నా, ఈ నాటకం కూడ ఎంతో ప్రజాదరణ పొందడానికి కారణం ఈ నాటకంలోని పద్యరచన. గయోపాఖ్యానంలోని పద్యాలవలె ఇందులోని పద్యాలుకూడ ఎంతో సరళంగా, పామరులకుకూడా అర్థమయ్యే భాషలో వ్రాయబడ్డాయి.

ఉవిద నీకపరాధ మొనరించితిన యేని
మొలనూలుతో నన్ను మోదరాదె?

..............................

వంటిపద్యాలు పండిత పామర జనరంజకాలు.

దీనికి మరొక కారణం, ఇందులోని సవతులకయ్యము, బహుభార్యాత్వంలో ఉండే అగచాట్లు—ఇట్టి విషయాలు సమకాలీన సమస్యలు కనుక ప్రజలు ఈ నాటకంలో వాటిని వర్ణించిన విధానాన్ని, అపహాస్యంచేసిన పద్ధతిని మెచ్చి ఈ నాటకాన్ని ఆదరించిఉండవచ్చు.

## ప్రసన్న యాదవము

1890 లో వ్రాసిన పారిజాతాపహరణానికి, 1905 లో వ్రాసిన ప్రసన్నయాదవనాటకానికి మధ్య చిలకమర్తి మూడు నాటకాలు వ్రాసినట్లు కన్పిస్తున్నది. అవి "శ్రీరామజననము" (1890), 'సీతాకళ్యాణము'(?)'నలనాటకము'. 'నలనాటకం' లో నలునిపాత్రను దుర్గి గోపాలకృష్ణరావుగారు, దమయంతివేషమును టంగుటూరి ప్రకాశంగారు ఎంతో రమ్యంగా ప్రదర్శించేవారని చిలకమర్తి వారే పేర్కొన్నారు. కాని దానిని ప్రచురించవలసివచ్చినప్పుడు మాత్రం తమ నాటకంకన్న ధర్మవరంవారి నాటకం ఉత్తమంగా ఉన్నదని ఒప్పుకొని తమ విశాలహృదయాన్ని వెల్లడిచేశారు. శ్రీరామజనన, సీతాకళ్యాణ నాటకాలుకూడా జనరంజకాలైనాయని చిలకమర్తి వ్రాసుకున్నారు.

"ప్రసన్నయాదవము" తానువ్రాసిన నాటకాలన్నింటిలో శ్రేష్ఠమైనదని చిలకమర్తి అభిప్రాయం. విమర్శకుల అభిప్రాయం కూడా అదేఅనవచ్చు. శ్రీకృష్ణనరకాసురుల యుద్ధాన్ని గురించిన ఈ నాటకం ఒకరకంగా స్వతంత్రనాటకం. గయోపాఖ్యానంవలె వీరరస ప్రధానమైనది.



ప్రసన్నయాదవం చిలకమర్తి తన నాటకాలలో ఉత్తమమైనదని భావించడానికి ఒక కారణం-ఇది సంస్కృత నాటకలక్షణాలకు అనుగుణంగా వ్రాయడం కావచ్చు. నరకాసుర విజయ వృత్తాంతం హరివంశ, భాగవతాదులలో ప్రసిద్ధికెక్కినదే! మాణిభద్రుణ్ణి శ్రీకృష్ణుని దగ్గరకు రాయబారం పంపడం ఒక్కటే రచయిత కల్పితం. అదే సమయంలో బదరికావాస మునులు కూడా వచ్చి శ్రీకృష్ణునితో నరకుని దుండగాలను వర్ణించడం, అదివిన్న శ్రీకృష్ణుడు కోపానలుడు కావడం సహజసిద్ధంగా నాటకీకరించబడ్డది.

ఊర్వశీనరకుల ఉక్తిప్రత్యుక్తులు, వజ్రకంఠుని హాస్యోక్తులు హాస్యప్రధానాలే అయినా చాలవరకు మితిమీరినవనే చెప్పవచ్చు. అలాగే రంభా సంభోగాసక్తుడైన మందపాలునితో వజ్రకంఠుడు సంభాషించడం కూడా (విష్కంభంలో) మోతాదుమించే ఉన్నదనిపిస్తుంది. నరకుని సంభాషణ, ఊర్వశిప్రత్యుక్తి, తుదకామె ఆతనిని మెచ్చినట్లు మార్చిన ప్రసంగధోరణి ఇవన్నీ ఈ శతాబ్దం మొదటి రెండు, మూడు దశాబ్దాలలో ప్రఖ్యాతమైన వేశ్యావిటుల సంభాషణలను తలపుకు తెస్తున్నవి.

సంస్కృతనాటక పద్ధతులననుసరించి రంగస్థలంమీద యుద్ధాన్ని చూపకూడదన్న నియమాన్ని పంతులుగారు కూడా ఆమోదించి నరక శ్రీకృష్ణుల యుద్ధాన్ని, నరక సత్యభామల యుద్ధాన్ని విష్కంభంలో సూచించారు.

పంచమాంక పరిమితమైన ఈ నాటకంలో మొదటి అంకంలో నరకుడు దేవరాజ్యపదవిని స్వీకరించడం; రెండవ అంకంలో ఊర్వశిపై విరహం, బదరికావనయాగంలో హవిస్సులో భాగం గ్రహించవలసిందిగా నరకుణ్ణి అడగడం, మూడవ అంకంలో మణిభద్రుడు, తాపసులు నరకుని దుండగాలు శ్రీకృష్ణునకు తెలియచెప్పడం, నాలుగవ

అంకంలో యుద్ధం, అయిదవ అంకంలో శ్రీకృష్ణుడు నరకుని కుమారుడైన భగదత్తుని చంపడం — ఇవి అన్నీ సంస్కృత నాటక లక్షణాలను జాగ్రత్తగా అమలు పరచినట్లు రూఢి చేస్తున్నాయి. విష్కంభాలు, ప్రవేశకాలు చిలకమర్తి కల్పితాలు. అవి హాస్య జనకాలు; అందువల్ల సామాన్యజన రంజకాలు.

పాత్రచిత్రణం దృష్ట్యా చూచినా ఈ నాటకం మిగిలిన రెండు నాటకాలకన్న ఉత్తమంగా ఉన్నదనడానికి సందేహంలేదు. ముఖ్యంగా శ్రీకృష్ణసత్యభామల పాత్రలు వెనుకటి నాటకాలలోని అవే పాత్రల కన్న ఉదాత్తంగా ఉన్నాయని చెప్పకతప్పదు. అలాగే హాస్యం విషయంలో కూడా-మిగిలిన వానిలో కలిగించే జుగుప్స ఈ నాటకంలోని హాస్యంలో కనిపించదు. పైగా చిలకమర్తి కాలంనాటి ప్రేక్షకులకు ఈ సంభాషణలలో కొంత వర్తమాన ధోరణుల సూచనకూడా ఉండడంవల్ల వారికి ఇది మరింత ఆమోదయోగ్యంగా ఉండి ఉండవచ్చు.

## ప్రహ్లాద చరిత్రము

ఈ నాటకానికి భాగవత కథ మూలం. చిలకమర్తివారు దీనిని కేవలం ప్రహ్లాదుని కథగానే వ్రాయలేదు. దీనిని "ప్రహ్లాదచరిత్రము" అనడంకన్న "హిరణ్యకశపుని వధ" అనడం ఉత్తమం. ఎందువల్లనంటే హిరణ్యాక్షుని మరణంనుంచి మొదలైన కథ హరిపై పగ తీర్చుకోవడానికి హిరణ్యకశిపుడు తపస్సుచేయడం, ఇంద్రుడు లీలావతిని ఎత్తుకొనిపోతూ ఉండగా నారదుడామెను రక్షించడం, హిరణ్యకశిపుడు తిరిగివచ్చి ఇంద్రునిదండించడం, కుమారుని చండామార్కుల వద్దకు పంపడం, కుమారునిదండించడం, చివరకు నరసింహస్వామి చేతిలో మరణించడం — ఈ నాటకం ఆసాంతం అతడే నాయకుడుగా



కనిపిస్తాడు. చివరి రెండంకాలలో మాత్రమే ప్రహ్లాదునికథ. "రస నాయక దృష్టితో చూచిన నీ నాటకమును రెండు భాగములుగా విభజింపవచ్చును"[1] అన్న దివాకర్ల వారి అభిప్రాయము సవిమర్శకము. నాందిలోనే నాటక కథను సూచించడం మిగిలిన నాటకాలలో కన్న ఈ నాటకంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఆనందాత్మకమై యమేయమయి వేదాంతైక సంవేద్యమై
మౌనీంద్రాశ్రయమై యనంతమయి బ్రహ్మాస్తంబ పర్యంతమున్
దానై యెల్లెడ భక్తసంతతులకున్ బ్రహ్లాద సంధాయకం
బై నిత్యంబయి నిర్వికల్పమగు బ్రహ్మంబేలు మిమ్ముంగృపన్[2]

భక్తిరస ప్రధానమైన ఘట్టాలలో చిలకమర్తి పద్యరచన పోతన భాగవతాన్ని, ముఖ్యంగా ప్రహ్లాదచరిత్ర ఘట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సాగినట్లు తెలుస్తుంది:

శ్రీహరి పాదాబ్ధిసేవ జేయని మేను
మేనుగాదది మేటి మ్రానుగాని[3]

..........................

సనకాది ముని జనంబునకు నందనివాడు
నవలీల దీనుల కందువాడు[4]

వంటిపద్యాలు ఇందుకు నిదర్శనం.

మిగిలిన నాటకాలలోవలె ఇందులోకూడా అనవసరమైన హాస్య సన్నివేశాలను ఇమిడ్చారు రచయిత. చతుర్థాంకంలో దేవాంతక

1. నాట్యకళ, చిలకమర్తి ప్రత్యేకసంచిక (సెప్టెంబరు 1970), పుట 11.
2. ప్రహ్లాదచరిత్రము, నాంది
3. ప్రహ్లాదచరిత్రము, పుట 87
4. ప్రహ్లాదచరిత్రము, పుట 100

నరాంతకుల సంభాషణ నాటకేతి వృత్తానికి సంబంధించనిదే కాక, నాటక గమనాన్ని కుంటు పరుస్తున్నది కూడా. అలాగే చండామార్కుల గురుకుల ఘట్టం ఏమాత్రమూ ఉదాత్తంగా చిత్రించబడలేదు.

## చతుర చంద్రహాసము

"చతుర చంద్రహాసము" ముఖ్యంగా బాదరాయణుడనే దుష్టబుద్ధి కథ. ప్రసన్నయాదవంలో నరకాసురుడిలాగా, ప్రహ్లాదలో హిరణ్యకశిపుడిలాగా బాదరాయణుడే ఈ నాటకానికి నాయకుడనవచ్చు. మొదటి రెండు నాటకాలలో నాటకం చిట్టచివరికైనా శ్రీకృష్ణుడు, ప్రహ్లాదుడు రంగంమీదకు ప్రవేశిస్తారు. వారు ఆలంబనంగా నాటకకథ కొంత పోషింపబడుతుంది. కాని ఈ నాటకంలో చంద్రహాసుని చతురగుణము కన్పట్టదు. అతడు నాయకుడు కావడానికి వీలులేదు. ఒక రకంగా ఇది పాశ్చాత్య విషాద నాటకాలను పోలివుంది. అందులో నాయకునిలో ఏదో ఒక లోపం ఉన్నట్లే ఇక్కడ కూడా నాయకుడు అధికార వ్యామోహంలోను, రాకుమార్తె తనకోడలు కావాలన్న ఆశతోను తన ప్రాణానికి తానే హాని కొని తెచ్చుకుంటాడు. తన పతనానికి తానే కారకుడవుతాడు. ఒక భేదం కూడా ఉన్నది. పాశ్చాత్య విషాదనాటకాలలో నాయకుడు-తనలో ఉన్న ఒక్క లోపం తప్పిస్తే-బహు ఉదాత్తుడు. బాదరాయణునిలో ప్రతి నాయకుని లక్షణాలే ఎక్కువగా కన్పిస్తాయి కాని నాయకుని లక్షణాలు కనిపించవు. అతడు స్వార్థపరుడు, రాజద్రోహి, క్రూరుడు. అందువల్లనే ప్రేక్షకులకు అతనియెడ వైముఖ్యము, అసహ్యమే కలుగుతుందికాని పాశ్చాత్య విషాదనాటకాలలోని నాయకుని యెడ కలిగే సానుభూతి కలుగదు.



ఈ నాటకం చిలకమర్తి వ్రాసిన నాటకాలన్నింటిలోను క్లిష్టమైన ఇతివృత్తం కలది. దీనిని నిర్వహించడానికి విష్కంభాలను ఉపయోగించడమేకాక, అంకవిభజన కూడ చేయవలసివచ్చింది. చిలకమర్తి నాటకాలలో ఎక్కడోకాని గీర్వాణ రూపక మర్యాదలను అతిక్రమించిన ఉదాహరణాలులేవు. అందులో ఇదిఒకటి.

ఈ నాటకంలో దుష్టబుద్ధి, మదనుల పాత్రచిత్రణంలో చక్కని నేర్పు కనపరచారు రచయిత. ఈరెండు పాత్రలు పరస్పరవిరుద్ధమైనవి. తండ్రి, కుమారుల లక్షణాలలో, భావనలో ఎంత వైవిధ్యమున్నదో ఈ చిత్రణము మనకు తెలియచేస్తుంది. ఒకప్రక్క ఎన్ని అవాంతరాలు వచ్చినా చలించక కొత్త పథకాలను నిర్మించుకొంటూ పోతాడు దుష్టబుద్ధి. వేరొకవంక తనకు తెలియకుండానే ఆ దుష్ట కార్యాలను విఘ్నంచేయడానికి కారకుడౌతాడు కుమారుడు. ఈవిధంగా స్వయంకృతం అయిన దుష్టకార్యాలు, స్వయంకృతంకాని, అన్యప్రేరితములైన మంచికార్యాలు పరంపరగా జరుగడం చూస్తే మనిషి పురుషకారానికి ఇచ్చినంత విలువ, విధికి కూడా ఇవ్వాలని, అది మంచిపని అయితే భగవంతుడే అందుకు స్వయంగా ఆమోదిస్తాడని, అలా కాక పోవడంవల్లనే బాదరాయణుడు తన నేరాలకు తానే ఆహుతి అయి పోయినాడని చెప్పవలసివస్తుంది.

## తిలోత్తమ

ఈ నాటకమును రచయిత ''సుందోపసుందుల కథ'' లేక ''తిలోత్తమ'' అన్నారు. ఇది 1929–39 మధ్యకాలంలో వ్రాయబడ్డది. ఏదో ఒక నీతిని తమ రచనలద్వారా వెలువరించడానికి తాము పూనుకొన్నామని, అట్టిది ఈకథలో తమకు కన్పించిందని పంతులుగారు పేర్కొన్నారు. ''మహాపరాక్రమవంతులు, పరస్పర

ప్రేమానుబంధులు నయిన సుందోపసుందులను రాక్షసులు దేవ వేశ్యయైన తిలోత్తమను చూచి వలచి పరవశులయి సహజమైన భ్రాతృప్రేమనువిడనాడి, లోకాపవాదములను లక్ష్యముచేయక, మాత్సర్యము పెచ్చుపెరగ దానికై యుద్ధముచేసి యన్యోన్య ఘాతములచేత నన్నదమ్ములిరువురు నొక్కసారి మరణించిరి. కథాచమత్కృతి యటుండగా మహోన్నతమైన యానీతిని మన యాంధ్రమహాజనులకు వ్యక్తము చేయుటకే ముఖ్యముగా నీనాటకము రచియించితి"[1] నని నొక్కి చెప్పారు రచయిత.

బృహస్పతి విశ్వకర్మతో సుందోపసుందుల వృత్తాంతం చెప్పి వారిని తపస్సునుండి మరలించడానికి రంభ, ఊర్వశి, మేనకవంటి వారిని పంపామని, వారుకూడా కృతకృత్యులు కాలేకపోయారని అన్నప్పుడు విశ్వకర్మ "వారి ప్రయత్నములు నిరర్థకమగుటకు, గారణము లేకపోలేదు. ఆ వేశ్యలు వృద్ధులగుటచే "మదనదేవుండు వసియింప మానినట్టి పాడుదేవాలయంబు లా వనజముఖులు"[2] అంటాడు. అందువల్ల తాను తిలోత్తమను సృష్టించానని, ఆమె అందచందాలతో ఆపనిచేయగలదని విశ్వకర్మ చెప్పడం, దానికి మహేంద్రాదులు ఆమోదించడం జరుగుతుంది.

భారతంలోని ఆదిపర్వంలోవున్న కథలో సుందోపసుందులు తపస్సుచేసుకుంటూ ఉండగా తిలోత్తమనుచూచి, తపస్సును ఆపి పోట్లాడుకుంటారు. కాని ఇక్కడ వారు తపస్సంపన్నులై తమ రాజ్యానికి తిరిగివచ్చినతరవాత ఇది జరుగుతుంది. ఈ నాటకంలో సుందోపసుందులతోపాటు వారి చెలికాళ్ళయిన శంబర జంబుకులు

1. "తిలోత్తమ", ఉపోద్ఘాతము.
2. పుట 5.



కూడా వాగ్యుద్ధం ప్రారంభించడం చూస్తే, ఇద్దరు పెద్దవారికి కలహంవస్తే అనుయాయులు కూడ అందులో ఏవిధంగా పాలుపంచుకుంటారో తెలుస్తుంది.

ఇందులోని చివరి అంకంలో ముష్టిఘాతాలకన్న, వాగ్యుద్ధం ఎక్కువగా కనిపిస్తుంది. అదికూడా పద్యాలలో. గయోపాఖ్యానం వంటి నాటకాలలో పద్యాలలో వాగ్యుద్ధం జరపడంచూచేవున్నాము. కాని దానిలో రెండు పంక్తులు ఒక పాత్ర, మిగిలిన రెండు పంక్తులు వేరొకపాత్ర చెప్పడం కనిపిస్తుంది. కాని ఈ నాటకంలో తేటగీతిలోని ఒక్కొక్కపాదం ఒక్కొక్కరికి ప్రత్యేకించబడ్డది.

సుందు; మాననీయు మహాతపోమహిమవాడ!
ఉపసుం: పద్మసంభవ వర్ణిత ప్రతిభవాడ!
సుందు: భువన వందిత నిత్యవై భవమువాడ!
ఉపసుందు: అష్టదిక్పాల భయద సాహసమువాడ.[1]

## ద్రౌపదీ పరిణయము

"ద్రౌపదీపరిణయము" చిలకమర్తి వ్రాసిన నాటకాలలో రెండవది. ఆయన మరణానంతరము ప్రచురింపబడ్డది. ఈనాటకాన్ని గురించి చిలకమర్తివారే ఈవిధంగా వ్రాశారు:

"హనుమంతరావునాయుడుగారు కూడ మిక్కిలి సంతోషించి మరొక నాటకము వ్రాయుటకు నన్ను ప్రోత్సాహపరిచిరి. నేనప్పుడు ద్రౌపదీపరిణయ నాటకమును వ్రాయనారంభించితిని. అది

1. "తిలోత్తమ", 96

ఐదంకముల నాటకము. అక్కడక్కడ కొన్ని పద్యములున్నను, మొత్తముమీద నదికూడ వచన నాటకమే.''[1]

ముద్రితమైన నాటకంలో నాంది మరెవరో వ్రాసినట్లున్నది. అది చిలకమర్తి కృతముకాదు. చిలకమర్తినాటకాలలో సూత్రధారుడు, పారిపార్శ్వకుడు వచ్చి నాందీప్రస్తావన చేయడం ఆచారం. కాని ఈ నాటకంలో సూత్రధారుడు. నటి—వీరిచే నాందీ ప్రస్తావన జరుపబడ్డది. అంతేకాక వీరి సంవాదముకూడ దీనికి బలాన్ని ఇస్తున్నది:

సూత్ర: ...... అది (ఈనాటకము) పాతదేకాని, క్రొత్తది.

నటి: మీరన్నమాట నాకర్థమగుటలేదు. ప్రాతదైనను గ్రొత్తదగుట ఏమి?

సూత్ర: ఇదివఱకీది పలుసార్లు రంగమున బ్రదర్శితమౌటచేఁ బాతది. ఇప్పుడే ముద్రితమగుటచేఁ గ్రొత్తది.[2]

ధృతరాష్ట్రుడుపాండవాగ్రజుడైన ధర్మరాజును యువరాజును చేయతలంచడం, దుర్యోధనుడు తండ్రిని బెదిరించడం, లక్కయింటిని కాల్చడం, బ్రాహ్మణుల వేషంలోవున్న పాండవులు ఏకచక్రపురంలో బకాసురుణ్ణి చంపడం, చివరకు పాంచాలదేశంలో మత్స్యయంత్రాన్ని కొట్టి, ద్రౌపదిని చేపట్టడం ఇందులో కథ.

మిగిలిన నాటకాలలోవలెకాక ఈనాటకంలో వచనం ఎక్కువ. ఆ వచనంకూడా ఆలంకారికమైన కఠిన సమాసభూయిష్టం మరే

1. ''స్వీయచరిత్ర'', పుట 78
2. ''ద్రౌపదీ పరిణయము'', నాంది.



నాటకంలోనూ (కీచకవధ, శ్రీరామజననం వంటి నాటకాలు దొరికితే తప్ప) ఇంతటి కఠిన, సమాస భూయిష్టమైన వచనం కన్పట్టదు. అర్జునుడు ద్రౌపదిని చూచి ఆమె అందాన్ని శ్లాఘిస్తాడు:

''ఈ నారీరత్నము బాహు ద్వంద్వము మందారకల్ప మహీరుహ శాఖల తెఱఁగున వెలుగుచున్నది. ఈ మానిని మోము మదీయ హృదయ సంతాపార్ణవవర్ధని యగుటచే సుధాకర మండలమునియు, నీప్సితార్థదాయి యగుటచే కల్పమహీరుహమునియు, సధర మధుర సుధారసధారా సమన్వితమగుటఁ జేసి యమృత కలశమని యును, శ్లాఘింపఁదగును...''[1]

హిడింబాభీముల సంభాషణలు కొంచెం దీర్ఘములేకాక కఠినతరమైన శబ్దసమన్వితాలు.

ఈ నాటకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఇది చిలకమర్తి మొదటి నాటకాల లక్షణాలను ఎక్కువగా కలిగివున్నదని తెలుస్తుంది. తరువాతి నాటకాలలో చేయితిరిగిన రచయిత చూపే సంభాషణా చాతురి కాని, పదలాలిత్యంకాని, పడికట్టురాళ్ళవంటి పద్యములుకాని ఈ నాటకంలో మనకు కన్పించవు. ఈ నాటకంతో గయోపాఖ్యాన, ప్రసన్న యాదవనాటకాలను పోల్చిచూస్తే చిలకమర్తి ఎంతత్వరలో ఎంతటి ప్రయోగ సౌలభ్యానికి అవసరమైన నాటక లక్షణాలను సంతరించుకున్నాడా- అని ఆశ్చర్యం వేయక మానదు.

1. ''ద్రౌపదీపరిణయము'', పుట 117.

# అనువాద నాటకాలు

క్రీడాభిరామము, ప్రసన్న రాఘవ నాట్యప్రబంధము తప్పించి పందొమ్మిదవ శతాబ్దం పూర్వార్ధం వరకు తెలుగులో నాటకాలుగాని నాటకానువాదాలుకాని లేవు. తెలుగు కవులు సంస్కృత నాటకాలను కూడా ప్రబంధాలుగానే ఆంధ్రీకరించారు. నాటక అనువాదాలు కూడా మౌలిక రచనలకువలెనే క్రిందటిశతాబ్దం ఉత్తరార్థంలో కాని ప్రారంభంకాలేదు. లభ్యమౌతున్న అనువాదాలలో కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి "నరకాసుర విజయవ్యాయోగము" మొదటిదని చెప్పవచ్చు. ఆతరువాత సంస్కృతంనుంచి అనువదించిన నాటకకర్తలలో పేర్కొనదగినవారు పరవస్తు రంగాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు, వావిలాల వాసుదేవశాస్త్రి, వడ్డాది సుబ్బారాయకవి, వేదం వేంకటరాయ శాస్త్రి ప్రభృతులు. కొక్కొండవారు తమ అనువాదంలో మూలంలోని శ్లోకానికి తెలుగులో పద్యాన్ని, మూలంలోని గద్యానికి తెలుగులోకూడా గద్యాన్ని ఉపయోగించారు. ఇదేపద్ధతిని దాదాపు మిగిలిన అందరు అనువాదకర్తలు అనుసరించారనే చెప్పవచ్చు. సంస్కృతనాటకాలలో ప్రయోగింపబడిన సంస్కృత, ప్రాకృత భాషల భేదాన్ని కొక్కొండ అనుసరించక అన్ని పాత్రలకు గ్రాంధికాన్నే వాడారు. పరవస్తువారు ప్రాకృతం స్థానంలో అచ్చతెనుగు వాడారు. నాదెళ్ళ పురుషోత్తమ కవిగారు "పాత్రోచిత భాషను" ప్రవేశపెట్టారు. వేదం వేంకటరాయ శాస్త్రిగారు తమ మౌలిక రచనలలోవలెనే అనువాదాలలో కూడా పాత్రోచితంగా వ్యావహారిక భాషను వాడారు. చిలకమర్తి



వారు అనువాదపద్ధతిలోనేమి, భాషాప్రయోగ విషయంలోనేమి కొక్కొండవారి పద్ధతినే అనుసరించారు.

చిలకమర్తివారు భాసనాటక చక్రంలోని పన్నెండు రూపకాలను, "పార్వతీపరిణయ" నాటకాన్ని ఆంధ్రీకరించారు. 1912 లో పి. గణపతిశాస్త్రిగారు భాసనాటకచక్రంలోని నాటకాలుగా పదమూడు రూపకాలను ప్రచురించడానికి ముందు ఆధునికులకు భాసుని పేరు కాళిదాసాదుల ప్రస్తుతులద్వారామాత్రమే పరిచయం. ఆనాటకాలలో కొన్నింటిని ప్రచురించబడ్డ వెంటనే మానవల్లి రామకృష్ణ కవిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తెలుగులోనికి అనువదించారు. కాని ఆనాటకాలలో ఒక్క 'అభిషేక నాటకము' తప్పించి మిగిలిన అన్నింటిని, మొట్టమొదట అనువదించినది శ్రీ చిలకమర్తివారే! ఇవి స్వప్నవాసవదత్త, అవిమారకము, బాలచరితము, మధ్యమవ్యాయోగము, దూతవాక్యము, దూత ఘటోత్కచము, ఊరుభంగము, పంచరాత్రము, ప్రతిమానాటకము, చారుదత్తనాటకము, ప్రతిజ్ఞాయౌగంధరాయణము, కర్ణభారము — అనునవి.

ఈ అనువాదాలన్నింటిలోను చిలకమర్తివారు మూలంలోని శ్లోకానికి తెలుగులో పద్యాన్ని, మూలంలో ఉన్న గద్యానికి తెలుగులో గద్యాన్ని వాడారని, ఇది కొక్కొండవారి అనువాదపద్ధతికి అనుసరణమని చెప్పాను. చిలకమర్తి వారు సాధ్యమైనంతవరకు మూలంలోని ఒక శ్లోకార్ధాన్ని తెలుగులోకూడా ఒకే పద్యంలో ఇమిడ్చేపద్ధతిని అనుసరించారు. అందుకుగాను అనుష్టుప్పులకు తేటగీతి, అటవెలదులలోను, వృత్తాలను సీసపద్యాలలోనికి లేదా వృత్తాలలోనికి అనువదించారు. సీసపద్యాలలోనికి అనువదించినప్పుడు మాత్రం చివరి గీతపద్యాన్ని - మూలంలో లేకున్నా పంతులుగారే పూరించారు: 'స్వప్నవాసవదత్తము' లోని

ఋజ్వాయతాం చ విరలాంచ నతోన్నతాంచ
సప్తర్షి వంశకుటిలాంచ నివర్తనేషు
నిర్ముచ్యమాన భుజగోదర నిర్మలస్య
సీమామి వా మ్బరతలస్య విభజ్యమానామ్ ॥

అన్న శ్లోకానికి చిలకమర్తి

సూటిగా నిడుదయై చూపట్టు నొకమారు
　　పలుచనై యొకమారు పరిధవిల్లు
నిమ్నోన్నతంబయి నెగడు వేరొకమారు
　　గుంపుగా నొకమారు గూడియుండు
మఱలుచో సప్తర్షి మండలికైవడి
　　యెగుడును దిగుడునై యొసఁగుచుండుఁ
గుప్పసంబూడ్చిన సర్పంబు కడుపట్లు
　　నిర్మలంబైనట్టి నింగినిపుడు
రెండు పాయలుగా గత్తిరించునట్టి
విమలరేఖనా నొప్పు నీ విహంగపంక్తి
మనుజ నేత్రైక పర్వాయమాణమగుచు
గగన లక్ష్మికి నొక యలంకారమగుచు.

(భాసనాటకములు, పుట 37)

అన్న సీసపద్యంలోకి అనువదించారు. కాని చివరి రెండు పాదాలలో అర్థంచెడకుండా, పైపంక్తుల కన్నింటికి అన్వయించేరీతిగా అదే భావాన్ని మరికొంత విశదీకరించారు. ఈ వ్యాఖ్యానంవల్ల పద్యానికి నిండుతనం రావడం నిజమే అయినా, ఒక్కొక్కప్పుడు ఇది అనవసరమై, చర్వితచర్వణం చేయవలసిరావడంవల్లనే పంతులుగారు రాను రాను ఈ పద్ధతికి స్వస్తిచెప్పి సీసపద్యంలోని నాలుగుపాదాలలోనే శ్లోకంలోని నాలుగుపాదాల అర్థాన్ని చక్కగా ఇమిడ్చి, చివర ఉండవలసిన గీతపద్యాన్ని తీసివేశారు. ఈ పద్ధతినిగురించి మధ్యమ వ్యాయోగానువాద పీఠికలో చిలకమర్తే స్వయంగా వివరించారు:



"ఈ యాంధ్రీకరణములో నేనొక క్రొత్తపుంత ద్రొక్కితిని. సంస్కృతగ్రంథములలోని కొన్ని శ్లోకముల భావము తెలిఁగింపఁబడు నప్పుడు వృత్తములలో నిముడక పెద్దదయి సీసమునకుఁజిన్నదై యాంధ్రీకరించువానికి గొప్ప మనస్సంకటమును గల్గించుచుండును. తెనిఁగించువాడట్టిసమయమున సీసపద్యమెత్తికొని భావము మొదటి నాల్గుపాదముల నిమిడిపోవుటచేత నెత్తు గీతమునకు భావమభావమగుటచేత నహంభావము కొంత బూని తన సొంతకవిత్వమును జెప్పియో పదములనవసరముగా దీర్ఘములుచేసియో కవిత్వకన్యను లాగి లాగి యీడ్చి యీడ్చి పూర్తిచేయును. అట్టిచిక్కు నాకును సంభవించినది. ఈవఱకు నేను నట్లు చేసినాడను కాని యిప్పుడట్టిపని సమంజసముగా లేదని తోఁచినందున శ్లోకభావము పెద్దదైనప్పుడు దానిని సీసపద్యములో నిమిడ్చి క్రింద నాటవెలఁది గాని, తేట గీతిని గాని చేర్చుట మానితిని. ఇందువల్ల కవిభావము వ్యక్తపఱచుటకెంత పద్యమవసరమో అంతపద్యమే యల్లబడుచున్నది."

చిలకమర్తి 'అవిమారకము' లోని "అత్యుష్ణా జ్వరితేవ భాస్కరకరై రాపీతసారామహీ" అనే శ్లోకాన్ని ఈ పద్ధతిలోనే అనువదించారు.

ఆపీతసారమై యవనీతలంబెల్ల
　　వేఁడి సోకినయట్లు వెచ్చనయ్యె
దావాగ్ని గవయుటఁ దరులనీడలులేక
　　క్షయరోగమున గుందుగరణిదోఁచె
గాడ్పుచే గొండలు ఘన గుహాముఖములఁ
　　దెఱచి యాక్రోశించు తెఱఁగుదోఁచె
నీలోకమంతయు నినపాతనష్టమై
　　మూర్ఛిల్లినటులుండె ముమ్మరముగ.

(భాసనాటకములు, పుట 111)

ఈవిధంగా సీసపద్యాన్ని విరగకొట్టడంతో ఈ అనువాదానికి ఏపాదాని కాపాడం ప్రత్యేకంగా, అంతటితో ఒక భావాన్ని పూర్తిచేసేవిగా కన్పిస్తాయి. ఇదే పద్ధతిని అనవసరపదజాలం లేకుండా తెనిగించాలంటే సీసపద్యమే చక్కనిది. అందువల్ల సీసపద్యాన్ని స్వీకరిస్తూనే చివర తానుగా పూరించవలసిన అవసరంలేకుండా అనువాదకర్త ఒక చక్కని పద్ధతిని అనుసరించాడని చెప్పవచ్చు.

పైన పేర్కొన్న అనువాదాన్ని పరిశీలిస్తే చిలకమర్తి మూలాన్ని ఎంతజాగ్రత్తగా అనుసరించాడో స్పష్టం అవుతుంది. చాలచోట్ల మూలంలో పదాలను యధాతథంగా వాడుకున్నాడు. కాని రచయిత భావాన్ని విప్పిచెప్పడంతోపాటు తెలుగు నుడికారాన్ని కూడా దానికి జోడించాడు చిలకమర్తి.

పతత్యుత్థాయ చోత్థాయ
హాహేంత్యుచ్చైర్భ్లపన్ ముహుః
దిశంపశ్యతి తామేవ యయాయస్తో
రఘూద్వహః

అన్నశ్లోకాన్ని

పడును లేచును వెండియు బడును లేచు
హా! తనయ! హా! యనుచు మాటి కఱచు చుండు.
రఘుకులోద్వహుడగు కుమారకుడు చన్న
యాదెసనె జూచుచుండు నత్యాదరమున.

అని తెనిగించారు. అలాగే

బహూనాం సమవేతానామేకస్మిన్ నిర్ఘృణానామ్
బాలే పుత్రే ప్రహరతాం కథం న పతితా భుజాః

అన్నశ్లోకాన్ని



దండి మగలైన పలువురు దయదొలంగి
శూరు బసివాని నొక్కని జుట్టుముట్టి
కటకటా! కొట్టి చంపి రాకలుషమతుల
పాడు చేతులు పడిపోవ వలదె చెపుమ!

అంటూ అనువదించి తెలుగు నుడికారాన్ని చక్కగా చొప్పించారు.

ఈ విధంగా మూలంలోని భావాన్ని అనుసరిస్తూనే తన చేర్పులు మార్పులు లేకుండా యధాతథంగా భాసుని నాటకచక్రంలోని పన్నెండింటి అనువాదాలను తెలుగు పలుకుబడికి దగ్గరగా అనువదించారు చిలకమర్తి.

చిలకమర్తిచేసిన మరొక సంస్కృతానువాదం అభినవ బాణభట్టు వ్రాసిన "పార్వతీ పరిణయము." కాని వ్రాసిన తరువాత కాని ఈ బాణుడు శ్రీహర్షుని ఆస్థానంలోని బాణుడుకాదని, అద్దంకి రాజధానిగాచేసి పాకనాడును పాలించిన వేమారెడ్డి ఆస్థాన కవి అని చిలకమర్తికి తెలియలేదు. బాణుడు 'హర్ష చరిత'ను వ్రాసినట్లే ఈయన కూడా తన పోషకుడైన వేమరాజును గురించి వేమభూపాలీయమనే వచనకావ్యాన్ని సంస్కృతంలో వ్రాశాడు. ఈ నాటకాన్ని కూడా బాణుడే వ్రాశాడన్న "భ్రమతో నేను దీని నాంధ్రీకరించితినిగాని అభినవబాణభట్టుండే రచయితయని మొదటనే తెలిసినపక్షమున నీ ప్రయత్నమునుండి మరలియుందును" అని పంతులుగారే చెప్పుకొన్నారు.

ఈ నాటకానువాదంలోకూడా పంతులుగారు వెనుకటి అనువాద పద్ధతినే అనుసరించారు. ఈపద్ధతిని అనుసరించి శ్లోకాలకు పద్యానువాదాలే చేశారు. కాని ఈ నాటకంలో ఆపద్ధతి అంత సమర్థనీయంగా కనిపించదు. పంచమాంకంలో కాశికి హిమవంతునికి పార్వతీ 'పరికర్మ ప్రకారం' చెబుతూ వరుసగా ఒకపద్యం తరవాత

మరొకదానిలో ఆ వివరాలు అందిస్తూ పన్నెండు పద్యాలు చెబు తుంది. మధ్య మధ్య హిమవంతుడు "తరువాత తరువాత" అనడం తప్పించి మరొక సంభాషణ లేదు. అందువల్ల ఇటువంటిచోట్ల అనువాద విధానాన్ని మార్చి దానినంతటినీ గద్యంలో చెప్పి ఉంటే నాటక గమనానికి అభ్యంతరం ఉండేదికాదు.

ఈనాటకానువాదంలోమాత్రమే చిలకమర్తి కొన్ని మార్పులు చేసి అనువాదకునికి ఉండవలసిన నేర్పును ప్రదర్శించారు. ఈ నాటకం మొదట హిమవంతుడు నారదునితో తన రెండవకుమార్తె అయిన గౌరిని గురించి ముచ్చటిస్తూ అశ్లీలాలైన శ్లోకాలలో ఆమెను వర్ణిస్తాడు. పంతులుగారే అన్నట్లు అవి "తండ్రి కూతురునెడ నుప యోగింపదగనివిగానున్నవి." వాని నన్నింటినీ పరిహరించి ఆ రంగాన్ని సంక్షిప్తీకరించారు చిలకమర్తి.

ఈ అనువాద నాటకాలలోకూడా మౌలికనాటకాలలోవలె పద్య రచన లలితమూ, సుకుమారమూ అయిన పదజాలంతోనిండి ఉన్నది. మూలాన్ని తు. చ. తప్పకుండా అర్థంచేసుకోవడానికి భావగంభీరాలై కూడా లలితములైన పద్యాలతో నిండిన ఈ అనువాద నాటకాలు ఎంతగానో దోహదంచేస్తాయి.

# ప్రహసనాలు

పరిహాస ప్రధానాలైన సంభాషణలు అధికంగా కలది ప్రహసనం. "భగవత్-తాపస-విప్ర-శాక్యాదులను గూర్చిన హాస్యవాదములతో కూడినదియును, కుత్సితపురుషులతో కూడినదియును, పరిహాసభాషణ ములతో నిండినదియును, వారిభాషా-ఆచారములను యథాతథ ముగా ప్రదర్శించునదియును, విశిష్టభావద్యోతకములగు కథాఖండ ములను, నియతగతికల ఇతివృత్తమును (ఒకేఒకచరిత్రము) కలది యును శుద్ధప్రహసన మన బడును. అనిభృతములైన వేశ్యా-చేట నపుంసక-విట-ధూర్త-బంధకీ సంకుల మగునది సంకీర్ణ ప్రహసన మన బడును. లోకవ్యవహారసిద్ధమగు వార్తయును, దంభమును, ధూర్తుల ప్రతివాదములును ప్రహసనమందు ఉండవలెను"[1] అన్నది నాట్య శాస్త్రవివరణము. పాశ్చాత్య సిద్ధాంతం ప్రకారం ప్రహసనం (farce) అన్నది తక్కువ తరగతికి చెందిన ఆహ్లాద రూపకం (Comedy) గా పరిగణించబడ్డది.

> "Farce may be defined as exaggerated Comedy; its problem is unlikely and absurd, its action ludicrous and one-sided, its manner entirely laughable.[2]

---

1. డాక్టర్ పి. యస్. ఆర్ అపారావు, "నాట్యశాస్త్రము", పుట. 527.
2. Norwood G., "Greek Comedy", P. 1.

అసంబద్ధమైన ఇతివృత్తము, పరిహాస ప్రధానమైన కార్యగతి కలిగినది ప్రహసనము అంటున్నాడు నార్ ఉడ్. ప్రఖ్యాత ఆంగ్లనాటక విమర్శకుడు ఎల్లార్డిస్ నికోల్ ప్రహసన లక్షణాలను ఈ విధంగా పేర్కొన్నాడు.

> "The main characterestics of farce......are the dependence in it of character and dialogue upon mere situation. This stituation, moreover, is of the most exaggerated and impossible kind, depending upon the coarsest and Mudest of improbable incongruities."[1]

పాశ్చాత్యుల అభిప్రాయంలో-ప్రహసనం పాత్ర చిత్రణమీద కన్న రచయిత స్వీకరించిన సంఘటనలమీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఆ సంఘటనలు సామాన్యంగా అసంబద్ధమైనవి, పరిహాస పాత్రమైనవిగా ఉంటాయి. దీనిని బట్టి ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలు రెండింటిలోను గల ప్రహసనలక్షణాలను ఈ విధంగా క్రోడీకరించవచ్చు.

ప్రహసనంలో గంభీరమైన ఇతివృత్త నిర్మాణము, పాత్రపోషణము వంటి లక్షణాలకన్న ఆ యా పాత్రల వాక్కుల, చేష్టల వికారములను చూపే సంఘటనలే ప్రాధాన్యమును కలిగిఉంటాయి. ఆ పాత్రలు కూడా ధూర్తపాత్రలు. లోకస్వభావసిద్ధమైన ఆచారవ్యవహారాలు ఇందులో ప్రతిబింబించబడతవి అని ప్రాచ్యమతం. అలాకాక, యథాతథంగా ఉండే ఆచారవ్యవహారాలకన్న అతిశయోక్తులకే ప్రాధాన్యమని పాశ్చాత్యమతం. మొత్తంమీద ధూర్తుల

1. A. Nicoll "Dramatic Theory", P. 176.



వివాదాలు, దంభసమన్వితమైన లోకవ్యవహారం ప్రహసనానికి ముఖ్యం అనడంలో ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలు ఏకీభవిస్తున్నాయి. ఈ లక్షణాలను, ప్రహసనరచనకు గల లక్ష్యాన్ని సమన్వయించి చూస్తే సమకాలీన సంఘంలోని చెడుగును, ధూర్తత్వాన్ని వెలికిచూపి, దానిని చూచినవ్వడం ద్వారా ఆ చెడుగును మార్చి, వ్యక్తులలో మార్పుకు, సత్ప్రవర్తనకు మార్గదర్శకం కాగలిగినది ప్రహసనం అని చెప్పవచ్చు. ఈ దృష్ట్యా చూస్తే తెలుగులో వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారల ప్రహసనాలు తమధ్యేయాన్ని నెరవేర్చుకోగలిగాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో చాలా వాటిని తెలుగునాట ప్రారంభించిన ఘనత కందుకూరి వీరేశలింగం గారిది. అన్ని ప్రక్రియలకు సాహిత్య గౌరవం కలుగచేసి ప్రచారంచేసిన ఘనతకూడా ఆయనదే. ప్రహసనాల విషయంలో కూడా ఇది నిజం. అయితే, సంఘంలోని దురాచారాలను ఎత్తిపొడుస్తూ విమర్శలతో కూడిన అపహాస్యాన్ని పాత్రల ద్వారా చెప్పించడం మన వీధినాటకాలకు, యక్షగానాలకు, తోలుబొమ్మలాటలకు కొత్తకాదు. సాంఘికవ్యవస్థలోని లోపాలను ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడా కథ మధ్యలో హాస్య పాత్రల చేత చెప్పించి, విమర్శించడం యక్షగానాలలోను, వీధినాటకాలలోను సుస్పష్టంగా ఉన్న సంప్రదాయం. అటువంటి హాస్య, వ్యంగ్య విమర్శనాత్మక ఘట్టాలే రాను రాను నాటకాలనుంచి విడివడి ప్రత్యేకతను సంతరించుకొని పగటివేషధారుల అభినయపద్ధతికి మూలమై ఉండవచ్చు. అందువల్ల దేశి సంప్రదాయంలో ఇటువంటి విమర్శలు, నాటకాంతర్భాగాలుగానో, విడిగానో దేశంలో ప్రచారంలో ఉండనే ఉన్నాయి. దేశిసంప్రదాయంలో కానవస్తున్న వ్యంగ్య భాషణాన్ని, పాశ్చాత్యులు అందుకోసమే అదేవిధంగా ఉద్దేశించిన ప్రహసన పద్ధతిని స్వీకరించి కందుకూరివారు తమసమకాలిక సమా

జంలో కరుడు కట్టుకుపోయిన మూఢ విశ్వాసాలను కరిగించి సంఘాన్ని సంస్కరించడానికి ఉపయోగించారు.

తెలుగు ప్రహసనకర్తలలో కందుకూరి, చిలకమర్తి, పానుగంటి ప్రభృతులు ప్రముఖులు. వీరందరూ సంఘసంస్కరణే తమ ధ్యేయంగా భావించి ప్రహసనాలు వ్రాసినా, వారివారి విధానాలలో ఎంతో భిన్నత్వం గోచరిస్తుంది. కందుకూరి ఏ సాహిత్యప్రక్రియనయినా తన సంఘసంస్కరణోద్యమానికి దోహదంగా ఉండే విధంగా మలుచుకున్నవాడు. అందువల్ల తన ధ్యేయాన్ని సాధించడానికి ఆయన ఒక్కొక్కప్పుడు అతినిశితమైన, వ్యక్తినిష్టమైనవ్యంగ్యాన్ని వాడాడు. ఆయన ప్రహసనాలు సంఘంలోని అవినీతిని ఎంతకర్కశంగా విమర్శిస్తాయో, వానిని పాటించి, ఆదరించే వ్యక్తులను కూడా అంతనిశితంగా విమర్శిస్తాయి. కందుకూరి పాశ్చాత్యప్రహసనానువాదాలను కూడా పెక్కింటిని ప్రచురించాడు. ఆ అనువాదాలను కూడా తెలుగు దేశానికి, తెలుగు వాతావరణానికి అనువుగా మలచుకొని తెలుగు దేశంలో ఆనాడు నిలదొక్కుకొని ఉన్న దురన్యాయాలను కూకటి వేళ్ళతో పెకలించి వేయడానికి సంకల్పించాడు. నవలా రచనలో వలెనే ప్రహసనరచనలో కూడా కందుకూరి చిలకమర్తికి గురువు అని చెప్పవచ్చు. చిలకమర్తి ఏనాడు ఆంగ్ల నాటకాలను కాని, ప్రహసనాలను కాని అనువదించలేదు. కాని ప్రహసన రచనలో వారిద్దరి ధ్యేయం మాత్రం ఒక్కటే. పానుగంటి ప్రహసన రచనలో సంఘ విమర్శకన్న, చెడును వ్యంగ్యంగా ఎత్తిచూపడం కన్న, ఆ యా దురన్యాయాలకు పాల్పడ్డ వ్యక్తుల విమర్శే ఎక్కువగా కానవస్తుంది. ఆ విమర్శ కూడా అతి నిశితమూ, వ్యంగ్యనిష్టమూ అయి అవతల వారి గుండెలలో పొడిచే సమ్మెట పోటుల్లా కఠినంగా ఉంటుంది. కందుకూరి ప్రహసనాలలోని పాత్రలు కూడా కొందరు సమకాలీన వ్యక్తులను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడ్డవన్న విమర్శఉంది.



కాని చిలకమర్తి ప్రహసనాలలో అటువంటి వ్యక్తి దూషణ మచ్చుకైనా కనిపించదు. అంతేకాదు. కందుకూరి. పానుగంటి ప్రభృతులలో కనిపించే నైశిత్యం కూడా చిలకమర్తిలో లేదు. ఆయన వెక్కిరింతలలో వేళాకోళాలలో అవతలివాడిని కించపరుద్దామన్న దురుద్దేశం ఏకోశాన ఉండదు. అవిఅన్నీ లలితంగా హాస్యప్రధానంగా, ఒక ఆప్తమిత్రుడు అవతలి మిత్రుడి తప్పుల్ని హేళన చేసే పద్ధతిలోనే ఉంటాయి. పైగా చిలకమర్తి వ్యక్తులకన్న వారు ప్రాతినిధ్యం వహించే సంఘదురన్యాయాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి చూపి, వానిని విమర్శిస్తాడు. సంఘంలో ఆనాడు ఎక్కువగా కన్పట్టిన దంభము, దుర్నీతి, వేశ్యాలోలత్వము, మిథ్యాగౌరవము, మోసము వంటి సార్వకాలిక, సార్వజన సమస్యలనే ముఖ్యంగాస్వీకరించి, ఆయన విమర్శించాడని చెప్పవచ్చు. అందువల్లనే చిలకమర్తి ప్రహసనాలు మిగిలిన తెలుగు ప్రహసనకర్తల రచనలకన్న ఆ ప్రక్రియా నిర్వచనానికి అతిసన్నిహితంగా ఉంటాయి.

చిలకమర్తి ప్రహసనాలన్నింటిని రెండు భాగాలుగా విభజించవచ్చు. కొన్ని కేవలం హాస్యప్రధానాలు. ఇవిచాలా కొద్ది. మిగిలినవి వ్యంగ్య, విమర్శనాత్మకాలు. చిలకమర్తి వ్రాసిన దాదాపు 85 ప్రహసనాలలో ఇరవైయైదింటిని మాత్రమే ప్రహసనాలుగా పేర్కొనవచ్చు. ఇరవై వరకు కేవలం సంభాషణాత్మకాలు. వాని నిడివి కూడా స్వల్పం. మిలిగినవి వ్యాసాలు. అవి కేవలం వాఖ్యానాత్మకాలు. నిజానికి వీనిని 'ప్రహసనాలు' అనడానికి వీలులేదు. ఇందులో పాత్రలంటూ ఉండవు. కొన్ని విషయాలమీద హాస్యప్రధానమైన వాఖ్యమాత్రమే ఇందులో ముఖ్యం. ఉదాహరణకు ''సాధారణసంవత్సర పంచాంగ శ్రవణము'' వంటి వానిని వాఖ్యానాత్మకమైన, హాస్య ప్రధానమైన వ్యాసాలనవచ్చు

కేవలహాస్యప్రధానాలను మినహాయిస్తే మిగిలిన ప్రహసనాలలో చిలకమర్తి నిశితమైన వ్యంగ్యంతో హాస్యాన్ని మేళవించి, ఎవరిని

గురించి ఈ వ్యంగ్యాన్ని ఉద్దేశించారో ఆవ్యక్తులకు బాధకలుగకుండా, వారిని అపహాస్యంచేయడం ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నట్లు గోచరిస్తుంది. ముఖ్యంగా ఛాందసులమీద, దాంభికులమీద ఆయన ఎక్కువ ప్రహసనాలు వ్రాశారు. అలాగే ఆడంబరాలకు పోయేవారి మీద, మతంపేరుతో అస్తవ్యస్తంగా ప్రదర్శించేవారిపైన, మూఢ విశ్వాసాలమీద, వరశుల్క- కన్యాశుల్కాలపైన, మద్యపాన వ్యభిచారాలపైన ఆయన నిశితమైన విమర్శలు చేశారు. అందువల్లనే ఈ ప్రహసనాలను అన్నింటినీ ఆయన తమ సంఘ సంస్కరణోద్యమానికి ఆలంబనంగా స్వీకరించారు.

చిలకమర్తి వ్రాసిన కేవలహాస్యాత్మకమైన ప్రహసనాలు సంఖ్యలో అతికొద్దివే అయినా, అవి కథాసంధానంలోను, పాత్రల మనోభావాల వ్యక్తీకరణంలోను ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నవని చెప్పవచ్చు. "బధిర చతుష్టయ ప్రహసనము" ఇట్టి "శుద్ధ ప్రహసనాల"లో ముఖ్యమైనది ఇందులో నలుగురు బధిరులు ఒకరిమాటలొకరికి అర్థంకాకుండా మాట్లాడడాన్ని ఎంతో నేర్పుగా చూపారు పంతులుగారు. ఇందులో కేవల ప్రహసనానికి కావలసిన కథావస్తువుంది. అందువల్లనే ఈ ప్రహసనం రంగస్థలంమీద ఔత్సాహికులచేత పలుమార్లు ప్రదర్శింపబడ్డది. చెవిటిశంకరప్ప, ఆయనభార్య చెవిటి సింగమ్మమీద అలిగి ఊరుబయట రావిచెట్టువద్ద కూర్చుంటే గంగన్న, నల్లసామి రావడం, ఈముగ్గురు చెవిటివాళ్లు ఒకరికి అర్థంకానివిషయాలను మరొకరు మాట్లాడుకుంటూ పోవడం ఇందులోముఖ్యం. కథలేదు. కేవలం సంభాషణలమీదనే ఆధారపడివుంది ఈ ప్రహసనం. ఇంతహాస్యప్రధానమైన ప్రహసనంలోను చివర పంతులుగారి వ్యంగ్య పద్ధతి ద్యోతకం అవుతూనే ఉన్నది. ప్రహసనం చివరలో నారాయణరావు అనే బ్రాహ్మణుడు ప్రవేశించి, శంకరప్ప-దొరికిన ఆవుదూడ కాలు నేను విరగకొట్టలేదని, నల్లసామి కాలువిరిగినా దూడమంచిదని,



దానిని ఆయనకు దానమిస్తానంటే తీసుకోడేమని వాపోవడం చూచి, వారిద్దరికీ మంచిమాటలుచెప్పి పంపివేసి ఆ దూడను తాను అపహరిస్తాడు. ఈ విధంగా అమాయకులను తమస్వలాభంకోసం వాడుకొనే మనుష్యులను విమర్శించారు పంతులుగారు. "భూలోకనారదుడని వచ్చినపేరు రానేవచ్చింది. నాకువచ్చినపేరు చచ్చినాపోదు. వాళ్లజుట్లువీళ్లజుట్లు ముడివేసి వీలైతే కోర్టులోకి లాక్కుపోయి యేదో విధంగా నాలుగుడబ్బులు సొమ్ముచేసుకోవడమే ప్రయోజకత్వము" అనినారాయణరావు తనలోతాను చెప్పుకొనే మాటలతోనే ఆపాత్ర స్వభావాన్నిచూపి ఆ మాటలతోనే ఆ పాత్రను అపహాస్యం చేశారు పంతులుగారు.

"గయ్యాళిగంగమ్మ ప్రహసనం"లో గయ్యాళిభార్యతో అమాయకుడైన భర్తపడేకష్టాలు, ఆగయ్యాళి తనమాటలు చెల్లించుకోవడానికి తనమాటలు నెగ్గడానికి చేసే అఘాయిత్యపుపనులు వర్ణించబడ్డాయి. ఎన్నాళ్లకోకనిపించిన స్నేహితుణ్ణి భర్తఇంటికితీసుకొని వస్తే ఆ భర్త లేకుండాచూచి, అతనిని అమ్మవారికి బలియివ్వడానికే ఇంటికి అప్యాయంగా ఆహ్వానించాడని ఆమెచెప్పినమాటలునమ్మి ఆ స్నేహితుడు వెనుదిరగకుండా పారిపోతాడు. కాని భర్తతో మాత్రం తానుపూజచేసుకొనే పాత్రాలను అడిగినాడని ఇవ్వనంటే కోపంవచ్చి వెళ్ళిపోయినాడని కల్పించి చెబుతుంది. భర్త ఆపాత్రాలను తీసుకొని స్నేహితుని కివ్వడానికి పరుగెత్తుతాడు. తన్నుచంపడానికే అతడు వస్తున్నాడని భయపడిన స్నేహితుడు అతడికి అందకుండా పరుగెత్తుతాడు. భార్య గయ్యాళితనంలో రెండుమలుపులు చూపాడు చిలకమర్తి. ఒకటి స్నేహితుడికి భోజనంపెట్టకుండా పంపడం; రెండవది భర్తదగ్గర తన అమాయకత్వాన్ని ప్రదర్శించడం.

"జనాభానాటకము" చిలకమర్తి వ్రాసిన ప్రహసనాలన్నింటిలోను పెద్దది. దీనిని నాలుగంకాలుగా విభజించి, నాంది విష్కంభా

లను కూర్చి దీనిలో నాటకలక్షణాలనుకూడా జొప్పించారు పంతులుగారు. దేశంలోజనాభలెక్కలు వ్రాయడంప్రారంభించిన కొత్తలలో ఇంటింటికీ తిరిగి జనాభాలెక్కలు వ్రాసుకొనే ఎన్యూమరేటర్ల బాధలు ఇందులో వివరంగా వర్ణించబడ్డాయి.

ప్రస్తావనలోకూడా హాస్య చతురతను చూపారు పంతులుగారు. పారిపార్శ్వకుడు ఈ జనాభానాటక కర్త యెవరని అడిగినప్పుడు సూత్రధారుడు నీవు అయననే యెఱుగవా? ఆయనకీర్తి

ముగ్గువలె బాతువలె మజ్జిబుగ్గివలెను
సీమసున్నమువలె చల్ల చెలువమునను
నెరసినట్టి వెంట్రుకలట్లు యెముకలట్లు
గూడకొంగలవలెనొప్పు గొప్పగాను.

అయనపేరు వెలవెలపాటి విస్సన్న మహాకవి సార్వభౌముడు'' అని పరిచయం చేస్తాడు.

ఈ నాటకంలో వివిధమతస్థులను వారివారి వెర్రిమతవిశ్వాసాలనుకూడా మెత్తగావిమర్శిస్తాడు చిలకమర్తి.

తిరుకచ్చినంబి అయ్యగార్లనుగురించి ఆయన 'బ్రాహ్మణుడు' అని వ్రాస్తే అయ్యవార్లకు కోపంవచ్చి పదిమందినిపిలిచి ''చూశారా! నేను బ్రాహ్మణుణ్ణిట'' అంటాడు. ''శ్రీవైష్ణవుడు'' అని వ్రాయాలంటాడు. పేర్లు వ్రాసుకుపోయిన మూడోనాడే పిల్లచనిపోయిందని, ఆమెచావుకు ఆ పేర్లు వ్రాసుకుపోవడమే కారణమని ఎన్యూమరేటరును తిడుతుంది ఒక ముసలమ్మ. భోగమురంగసాని ఇంటిలో కనిపించిన తిరుపతిని గురించి వ్రాసుకొనే ఎన్యూమరేటరును తిరుపతి బ్రతిమాలి భంగపడడం చూపడంలో రాత్రిపూట సానులఇండ్లలో దూరే పెద్దమనుషుల చేష్టలను దుయ్యబటారు పంతులుగారు. రహీమ్



ఖాన్ అనే ఎన్యూమరేటరు బొట్టులేనిపిల్లనుచూచి భర్తపేరు అడిగితే పక్కనున్న ముసలమ్మ ఆమె విధవఅనిచెప్పి ఏడుస్తుంది. అప్పుడే తలనిండాస్నానంచేసి వస్తున్న ఒక ఆవిడమొహంమీద బొటులేకపోవడం చూచి ఆమెకూడా విధవయేనా అని అడుగుతాడు రహీమ్ ఖాన్. ఈవిధంగా పరస్పర విరుద్ధాలైనమత, ఆచారభేదాలున్నవ్యక్తులు తటస్థపడితే రాగల హాస్యసన్నివేశాలను సృష్టించారు పంతులుగారు ఈ నాటకంలో.

"అద్భుత కవిత్వము" అన్నది కూడా శుద్ధప్రహసనంగా చెప్పుకోవచ్చు. పూర్వ కవిత్వం పాషాణాలవంటి అర్థంకాని పదాలతో కూడుకొని వున్నదని, ఇంగ్లీషుకవిత్వం తేలికగా అర్థం అవుతుందని అటువంటి కవిత్వమే కవిత్వమని నమ్మిన కొందరు ఆధునికులకు సమాధానంగా ఈ ప్రహసనం వ్రాసివుండాలి పంతులుగారు. సంస్కృతాంధ్రాలు బాగా చదువుకొన్న ఒక శాస్త్రిలవారి దగ్గరకు ఇద్దరు శిష్యులు వచ్చి 'పాతకవిత్వమంతా నాన్సెన్సుగా వుంది అనీ, ఈ నన్నయ భట్టు తిక్కన అల్లసాని పెద్దన్న యిల్లాటివాళ్ళు పుట్టకపోతే మన భాషెంతో బాగుపడును, అంటారు. దానిమీదఆయనవాళ్ళువ్రాసిన పద్యాలు చదువమంటాడు. అందులో ఒకడు—

తోటకూర దెచ్చి దొడ్డిలోన తరిగి
కుండలోన బెట్టి కుదురుగాను
క్రింద మంటబెట్ట వుడకకేంజేస్తుంది?
దానికడుపు కాల ధరణిలోన.

అనే పద్యం చదివి దానిని గొప్పనేచరు పొయిట్రీ అంటాడు. గురుశిష్యుల సంవాదం, చివరకు శిష్యులిద్దరూ కొన్ని శ్లోకపద్యాలు చదవగా ఇక భరించలేని చాదస్తపు శాస్త్రిలవారు

వినుక్కుంటూ వుంటే రెండవ వాడు మూడు పాదాలు మాత్రమే వ్రాయగలిగిన తన పద్యాన్ని వినిపిస్తాడు.

పొలములో నక్కలు కూసెగా
మనసులో భయమెంతో వేసెగా
పాలేరు ఇట్టట్టె చూసెగా
దానికి గురువుగారు "గంగన్న నీ ముండమోసెగా"

అంటూ పూరిస్తారు. దానితో శిష్యులిద్దరూ ఆగ్రహంతో నిష్క్రమిస్తారు. శిష్యుల దీర్ఘమైన సంభాషణలు, పురాతనకవులను వారు వెక్కిరించడం, ఆంగ్ల కవిత్వాన్ని పొగడడం ఇవిఅన్నీ పంతులుగారి కాలంలో అప్పుడప్పుడే తలయెత్తుతున్న కొన్ని అపహాస్య కవిత్వ ధోరణులు. వానిని ఒక్క కటువు మాట కూడా లేకుండా మెత్తగా అపహసించారు పంతులు గారు.

ఈ విధంగా ఈ శుద్ధ ప్రహసనాలలో విమర్శను దరికి చేరనీయక కేవలం హాస్యాన్ని కలుగ చేయడమే ధ్యేయంగా ఉంచుకున్నారు పంతులు గారు. దానికి గాను ఆయా వ్యక్తులను, పరిస్థితులను హాస్యాత్మకంగా సృష్టించారు. వారివారి మాటల ద్వారా ఆయా పాత్రల స్వభావాలను వెల్లడి చేశారు పంతులుగారు. ఇదే శుద్ధ ప్రహసనంలోని ముఖ్యమైన లక్షణం. అలాకాక విమర్శనాత్మకమైన, వ్యంగ్యాత్మకమైన ప్రహసనాలలో రచయిత తానుగా ప్రవేశించి విమర్శించకపోయినా, తనకు నచ్చిన పాత్రచేత కావలసిన విమర్శను చేయిస్తాడు. తద్వారా రచయిత పరోక్షంగానైనా తన వ్యక్తిగతమైన భావాలను అందులో చొప్పించక తప్పదు. శుద్ధ ప్రహసనాలలో రచయిత అంటూ కనిపించాడు. పాత్రల స్వభావాలే, సన్నివేశాలే హాస్యాన్ని సృష్టిస్తాయి.



ఈ హాస్యాత్మకమైన ప్రహసనాలను మినహాయిస్తే, మిగిలినవన్నీ విమర్శనాత్మకాలుగానే చెప్పవచ్చు. ఈ విమర్శనలన్నీ సంఘంలోని మతాచారాలను గురించి, మిథ్యాగౌరవం గురించి, సంఘంలో జరుగుతున్న అసమంజసమైన వివాహాలను గురించి, అందువల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలను గురించి చేయబడ్డాయి. ఇందులో "వరదక్షిణ ప్రహసనం" లో వలె కటు విమర్శ మొదలుకొని "బలవంత బ్రాహ్మణార్థము" వంటి మెత్తని విమర్శ వరకు అన్ని రకాల హాస్యాన్ని విమర్శనూ చిలకమర్తి ప్రయుక్తం చేశాడు.

చిలకమర్తి సంఘసంస్కరణమే ప్రధానధ్యేయంగా ప్రహసనాలను వ్రాశాడు. అందువల్లనే ఈ విమర్శనాత్మకమైన రచనలన్నీ తన చుట్టూ ఉన్న సంఘంలోని దురాచారాలను, దుర్నీతిని ఆధారం చేసుకొని వ్రాశాడు. పందొమ్మిదవ శతాబ్దం చివరిభాగంలోను, ఇరవయ్యోశతాబ్దం మొదటి రెండు దశాబ్దాలలోను తెలుగు దేశంలో— ముఖ్యంగా సర్కారు జిల్లాలలో — ఏర్పడి పోయిన కొన్ని ఆచారాలను పుయ్యబట్టారు పంతులుగారు. ఇందులో ముఖ్యమైనవి మతాచారాలకు సంబంధించినవి. పంతులుగారు బ్రాహ్మమతస్థులు. ఆయనకు పురోహితుల ఆచారాలు, మతాచారాలకు సంబంధించిన నియోగుల నిరాదరణ, శాస్త్రం చదివి అమాయకులైన ప్రజలను ప్రతారణ చేయడం వంటివి కంటగింపు కావడంలో ఆశ్చర్యంలేదు. అవిఅన్నీ పంతులుగారి నిశిత విమర్శకు గురి అయ్యాయి.

బ్రాహ్మణుల ఆచారవ్యవహారాలు పూర్వకాలపు నియమనిష్టలకు ఎంతమారంగా ఉన్నాయో చూపుతూ పంతులుగారు ఎన్నో ప్రహసనాలు వ్రాశారు. అందులోనూ ముఖ్యంగా బ్రాహ్మణులు శ్రాద్ధాల విషయంలోచూపే అవకతవకలనుఎంతగానో పరిహసించారు. "బలవంతపు బ్రాహ్మణార్థము" లో ఒక నియోగి ప్రభువుకు తనతల్లి శ్రాద్ధమన్నవిషయమే జ్ఞాపకం లేదు. ఆయన పురోహితుడు అయనకు

ఆ విషయం జ్ఞాపకం చేస్తే దారిన పోయే ఏ బ్రాహ్మణుడయినా సరే తీసుకొనిరావలసిందిగా వెట్టివాణ్ణి పంపుతాడు వాడొక అవధానం చేసిన కర్మిష్టిని తీసుకొనివస్తాడు. ఆయన తాను అలా బ్రహ్మణార్థాలు చేయనని మొత్తుకొన్నా వినక ఆయనను బెదిరిస్తారు. ఆ బ్రాహ్మణుడు పురోహితుని మెళ్ళో యజ్ఞోపవీతం లేకపోవడం చూచి ఏమైనదని అడుగుతాడు. ఆ పురోహితుడు తెల్లబోయి "ఎంత ప్రమాదం జరిగింది. రాత్రి నల్లమందువాడికి డబ్బులియ్యకుండా వస్తుంటే బోగంపాపి తల్లి ముసలిముండ జంఝంపట్టుకులాగి తెంపివేసింది. ఆ మాట నేను మరచే పోయినాను" అనుకొని లాఘవంతో ఆ ప్రమాదాన్ని దాటుతాడు. "ఈ తద్దినం ఆ బ్రాహ్మణుడి తల్లిది కనుక, ఆమెకు జంఝంలేదు కనుక అమ్మ తద్దినానికి జంఝమక్కర లేదు" అంటూ పైగా ఆ అవధాని మెళ్ళో జంఝంకూడా తీసివేయమంటాడు.

"అద్భుతశ్రాద్ధప్రహసనము" ఒక రకంగా "బలవంత బ్రాహ్మణార్థ' ప్రహసనా"నికి పూరకమైనదనవచ్చు. రెంటిలోను తద్దినాలప్పుడు బ్రాహ్మణులు చేసేదురాగతాలనే అపహసించారు చిలకమర్తి. రెండవ ప్రహసనం తద్దినాలకు ముందు జరిగే అవకతవకలను చూపితే, మొదటి ప్రహసనం తద్దినాలలో భోజనాలలో, పిండతర్పణంలో జరిగే అవకతవకలను విమర్శించింది. సదాశివుడి తండ్రి చనిపోతే పిండాలు కాకులు ముట్టవు. అప్పుడు అతని మేనమామకు పూనకం వచ్చి, అందులో సదాశివుని తండ్రి ఆపూనకంలో తాను బ్రతికివుండగా ఉప్మా, కాఫీలు తనకు అలవాటని శిలోదక, తిలోదక, వాసోదకములకు బదులు ఉప్మా, కాఫీలతో తర్పణాలు విడవ వలసిందంటాడు. దానికి పురోహితుడు ఉప్మా, కాఫీ అలవాట్లమీద పెద్ద ఉపన్యాసం ఇస్తాడు. "ఈ కాఫీలు కాఫీ కొట్లు వచ్చినతర్వాతనే రోగాలు యెక్కువవుతూయున్నవి" అంటూ వాపోతాడు. అయినా తండ్రి, మేనమామల ఆజ్ఞ



మేరకు సదాశివుడు "మా తండ్రి పేరు చెప్పి, ఉప్పుమా, కాఫీ, టీలు పంచిపెట్టాను. అదే శ్రాద్ధము" అంటాడు. ఈ విధంగా బ్రాహ్మణుల అలవాట్లను విమర్శించాడు చిలకమర్తి. సంఘంలో దుర్నీతికి వ్యక్తుల మధ్య ఉండే ఈర్ష్యకారణమన్న విషయాన్ని చిలకమర్తి ఎన్నో ప్రహసనాలలో వెలిబుచ్చాడు. బ్రాహ్మణులలో పరస్పరం ఉండే వృత్తివైరుధ్యాన్ని గురించి "కనక శునక ప్రహసనం"లో ఆయన అవహేళన చేశాడు. ఎందరు తనను సందేహనివృత్తికై సంప్రదించినా రామదీక్షితులు తన్ను గౌరవించడం లేదని అతనికి తగిన బుద్ధిచెప్పాలని కాంక్షించిన కామశాస్త్రులు ఈర్ష్య "కనకశునక ప్రహసనం" లో వ్యంగ్యంగా చిత్రీకరించబడ్డది. తన కుర్రవాడు కుక్కపాలు తాగాడని, దానికి ప్రాయశ్చిత్తం చెప్పవలసిందని అడిగిన రామశాస్త్రికి, "శాకటాయన" శాస్త్రం పేరు చెప్పి "త్రాగిన" వాని నాలుక కోసివేయవలెననీ, లేదా భాండాయనులు వారు చెప్పినట్లు ఎర్రగా కాలిన ఇనుప ముక్కతో నాలుక కాల్చి వేయవలసినదని, ధర్మశాస్త్రాల ప్రతినిధిగా కామశాస్త్రి పేర్కొంటాడు. రామదీక్షితులు ఎంత బ్రతిమిలాడినా దానికి తిరుగులేదంటాడు. చివరకు తన కొడుకు కూడా ఆ కుక్కపాలు తాగిన వారిలో ఉన్నాడని తెలిసినప్పుడు, చెప్పిన ధర్మపన్నాలన్నీ మరిచి "గండాయన స్మృతి"లో "ఆదివారం నాడు నాల్గుగడియల ప్రొద్దువేళ ఎనిమిదేండ్ల పిల్లవాడు నల్లకుక్క పాలు త్రాగినట్లయితే అది తప్పు కాదని" ఉన్నదనీ, దానికై కనకశునక దానములు ఇవ్వనక్కరలేదని శాస్త్రం చెపుతాడు. ఈ విధంగా తన వరకు వస్తే ధర్మశాస్త్రాలు తలక్రిందులు కావచ్చునన్న లోకధర్మాన్ని అపహసిస్తూనే వ్యక్తులలో ఈర్ష్య, మిథ్యా గౌరవాల మీదఉండే అభిమానంవల్ల వారు ఎంత నైచ్యానికి దిగగలరో కూడా వివరంగా రచయిత చూపాడు.

మిథ్యాగౌరవాలను, అందుకోసం కొందరు వ్యక్తులు పడే తపననూ హేళనచేస్తూ చిలకమర్తి మూడు నాలుగు చక్కని ప్రహసనాలను వ్రాశారు.

"ఆత్మగౌరవ ప్రహసనం" లో ఇంటికి వస్తున్న పెద్దమనిషి కోసం భోగరాజు తల్లిదండ్రుల్ని సావిడి ప్రక్కన గదిలో ఉంచి వారిని మాట్లాడవద్దని శాసిస్తాడు. కాని తేలుకుట్టి తల్లి బయటకు రాగా ఆమెను, ఆమెభర్తను వంటలవారుగా పరిచయం చేస్తాడు. తల్లిదండ్రులునిజం చెప్పడంతో భోగరాజుఆత్మగౌరవం కోసం ఆడిన నాటకం అంతా బయట పడుతుంది.

అలాగే "స్వగౌరవరక్షణము" అన్న ప్రహసనంలో ఆంజనేయులన్న వ్యక్తి కూలి ఇచ్చి లాంతరు వేయించుకొని భోజనానికి పోవడానికి నిశ్చయిస్తాడు. చాకిరేవుకు వెళ్ళి కూలిని మాట్లాడటం, ఆ కూలి ఆలస్యంగా రావడం, ఆ ఆలస్యం వల్ల భోజనాలవేళకు వెళ్ళలేకపోవడం చివరకు ఈ మిథ్యాగౌరవం వల్ల అభాసు పాలు కావడం చూపబడ్డది. చిలకమర్తి తాను చేయవలసిన విమర్శను ఆంజనేయులు భార్యచేత ఈ విధంగా చెప్పిస్తాడు:

> "ఏమి రోజులో? పెళ్ళివారిల్లు మన ఇంటికి పట్టుమని పది బారలు లేదు. ఇక్కడకు లాంతరు కావాల? చాకిరేవులోకి వెళ్ళి చాకలి పేటలోకి వెళ్ళి వచ్చేటప్పటికి పుణ్యకాలముకాస్తా వెళ్ళిపోయినది. ఎవరైనా వింటే తల వంపులు. ఇద్దరు చాకలాళ్ళకి కూలిదండగ ఈ రాత్రి యుపవాసము ఇన్ని వచ్చాయి. ఏమయనా అంటే మీరు కోపపడతారు."

'అపూర్వయజ్ఞము' అన్న ప్రహసనంలో ఇద్దరు బ్రాహ్మణులు తమ స్నేహితుడైన విస్సన్నను మోసంచేసిడబ్బులాగాలని పన్నాగం పన్ని అతడిని యజ్ఞంచేస్తే డబ్బుబాగా వస్తుందని అందుకు పురికొల్పుతారు. అప్పటి దాకా వంటలు చేసిన విస్సన్న ముందు కాస్త సంశయించినా, చివరకు ధైర్యంగా, ఉన్న కొంప్రను తాకట్టుపెట్టి భార్యకు కంటె చేయించి యజ్ఞంచేస్తాడు. దానికి వచ్చిన డబ్బు



కాస్తా స్నేహితులు పంచుకుంటారు. భార్య తన కంటెను ససేమిరా ఇవ్వనంటుంది. చివరకు తాకట్టు పెట్టిన పొలం అమ్ముకోక తప్పదు విస్సన్నకు. "ఎప్పుడు యిల్లాంటి తలమీరిన పనుల కెళ్ళకుండా బుద్ధొచ్చింది. ఈ జన్మ కిదిచాలు" అనుకుంటాడు విస్సన్న.

చిలకమర్తి ప్రహసనాలన్నిటిలో ఈ విధమైన నీతిబోధ, దానితోబాటు తాను ప్రత్యేకించి ఎంచుకొన్న సంఘదురన్యాయం మీద విమర్శ తప్పక ఉండితీరుతుంది. ఈ విషయంలో చిలకమర్తి కందుకూరికి భిన్నంగా కనిపిస్తాడు. కందుకూరి కఠోరమైన సంస్కరణాభిలాషతో వ్యక్తులకన్న సంస్కరణకు ప్రాముఖ్యం ఇస్తాడు. చిలకమర్తి వ్యక్తులను అతిసున్నితంగా మందలించడం ద్వారా, వారివ్యక్తిత్వానికి అభిమానానికి దెబ్బ తగలనివ్వడు.

వృత్తిస్పర్థలను, ఆ వృత్తులను చేపట్టే వారిలో ఉండే ఈర్ష్యను చిలకమర్తి అపహసించాడని పైన పేర్కొన్నాను. దానికి ఉదాహరణగా వైదిక బ్రాహ్మణుల మధ్య ఉండే ఈర్ష్యను గురించి కూడా పేర్కొన్నాను. అటువంటిదే మరొక ప్రహసనం "ప్లీడర్ తమాషా". అందులో పైకి రావడానికి ప్లీడర్లు చేసే అవినీతికరమైన పనులు ఎన్నో విధాల హేళన చేయబడ్డవి. ఇదే విషయాన్ని "కనకయ్య పంతులు కంతి" అనే ప్రహసనంలో కూడా చిన్న విషయాలమీద, పెద్దపెద్ద వివాదాలు ప్రారంభమై అవి కోర్టు వరకు పోవడం, అక్కడ ప్లీడర్ చేసే పనులు, పైనుంచి క్రిందివారి వరకు అందరూ లంచాలు పట్టడం వివరంగా చిత్రించబడ్డది.

ఆనాటి సంఘంలో అతి విస్తృతంగా అలవాటులో ఉన్న దురాచారం భోగంమేళాలు. ఒకప్పుడు కేవలం దైవ కైంకర్యానికై తమ సర్వస్వాన్ని అర్పించిన దేవదాసీలు, అందుకై ప్రత్యేకంగా ఆరాధననృత్యాలను ప్రదర్శించే దేవదాసీలు, రానురాను భృతికోసం,

పెద్దవారి ప్రాపకంకోసం అవినీతిపాలై బోగంమేళాలు కట్టడంప్రారంభించారు. దైవకార్యాలలో కూడా బోగంమేళాలు పెట్టడం ఘనత అని భావించిన రోజులవి. ఆ బోగం మేళాలను, వానిని ప్రోత్సహించే వారిని విమర్శిస్తూ చిలకమర్తి చాలా ప్రహసనాలు వ్రాశాడు. 'శ్రీరామనవమి పందిరి' అనే ప్రహసనంలో గంగరాజు అనే ఆయన తాను చేస్తున్న శ్రీరామనవమి పండుగ సందర్భంలో రామశాస్త్రి గారి రామాయణ పఠన కార్యక్రమానికి ఎక్కువ మంది జనం ఎందుకు రాలేదని మంగరాజుగారిని అడుగుతాడు. దానికి మంగరాజు "నీ పందిట్లోకి జనం ఏలా వస్తారు. అప్పో సొప్పో చేసి బోగంమేళాలు పెట్టమంటే విన్నావా. పెండ్లి కేమిటి శ్రీరామనవమి కేమిటి మహోత్సవమున కేమిటి బోగం మేళము లేనిదే నిండేలేదు. వాళ్ళు శోభనదేవతలు. వాళ్ళతో పందిరికి కళాకాంతులు వస్తాయి" అని ఉపన్యాసం ఇస్తాడు. ఇంతలో గంగరాజు గారి తమ్మునికి రాముల వారే పూని 'ఓరీ దుర్మార్గుడా నాస్తికుడా యింతలోనే యింత ఒళ్ళు పొగరెక్కినదిరా? నేనెవరినను కొన్నావు. ఎరుగవు కాబోలు. జాగ్రత్త, భద్రాది రాముల వారికి, నాకు బోగము మేళము అక్కర లేదటరా?' అంటాడు. గంగరాజు లెంపలు వేసుకొని తప్పక పెట్టిస్తానంటాడు. దానిని ఏర్పాటు చేయడానికి డబ్బులేదు. భార్యను కంటె ఇవ్వమంటాడు, తాకట్టు పెట్టి డబ్బుతీసుకొని రావడానికి. భార్య ఆ మాటలకు కోపగించి "మీతమ్ముడికి రాములవారు పూని బోగము మేళము పెట్టమన్నారా?......ముండల ముటాకోరు వాళ్ళు మీతమ్ముడు, మంగరాజు పన్నిన పన్నాగమది......"అంటూ వడ్డిస్తుంది. చివరకు అప్పు దొరకక పోవడంతో మరుసటి సంవత్సరం పెట్టగల మని మొక్కుకొని ఆనాటికి ఊరుకొంటారు. "పడకగది ముచ్చట్లు" అనే ప్రహసనంలో ఇందుకువిరుద్ధంగా భార్యే తమపిల్లవాని పెండ్లికి బోగము మేళము పెట్టించి తీరవలెనంటుంది. దానికి భర్త



ససేమిరా కూడదంటాడు. ఆ వీధిలో ఆడవాళ్ళు, చుట్టాలు అందరూ ఏలూరు మేళం చూడాలని ఉన్నదంటే మా అబ్బాయి పెళ్ళికి పెట్టిస్తానని ఆమె మాట ఇచ్చిందట! అందుకోసమైనా పెట్టించాలంటుంది ఆమె. చివరకు పెళ్ళి కొడుకుకు వదిలిపెడతారు దీనినిశ్చయం. అతడు మాత్రం ఖచ్చితంగా బోగం మేళాలు పెట్టడానికి వీలులేదంటాడు.

శుభానికి, అశుభానికి భోగం మేళాలను పెట్టించాలనే వారి స్వార్థాన్ని విమర్శించడంతో పాటు చిలకమర్తి వర దక్షిణను గురించి, ముసలివారు తిరిగి తిరిగి పెళ్ళి చేసుకోవడాన్ని గురించి కూడా ఎంతో నిశితంగా విమర్శించారు. "వరదక్షిణ ప్రహసనం" నిజానికి ప్రహసనం కాదు. అందులో కటు విమర్శ ఉంది; అసహ్యం ఉంది. ఇంతటి నిష్కర్షతో చిలకమర్తి మరే విషయాన్ని విమర్శించి ఉండలేదు. తనకొడుకుకుమంచి కట్నాలు వచ్చే సంబంధం చూడడం, అమ్మాయికి దీక్షైన జాతకాన్ని బనాయించడం, ఆడపెళ్ళివారు సంబంధాని కొస్తే వారి యెదుట గొప్పలు చెప్పుకోవడం - ఇవి మామూలుగా జరిగేవే. కాని ఈ ప్రహసనంలో రాఘవరావు అనే తండ్రి తన కొడుకుకు బంగారంలా ఉండే అమ్మాయిని, సంగీతం పాడే అమ్మాయిని, చదువుకొన్న అమ్మాయిని కాదని, కట్నం ఎక్కువగా ఇస్తారని క్షయ జబ్బు ఉన్న పిల్లను నిశ్చయంచేస్తాడు. తానూ నలుగురిలో కట్నాలు కూడదని గొంతెత్తి అరచినవాడే. కాని ముసలితల్లి, మూర్ఖురాలైన భార్య పట్టుబడుతున్నారని, తాను వాళ్ళను కాదనలేనని మిషచెప్పి కట్నాలు కోరతాడు. ఆ ఉపాయాలు విన్న పురోహితుడు "మీరుచెప్పినది చాలా బాగున్నదండి ఇది తోలు వ్యాపారం వంటిది. చచ్చిన జంతువుల తోళ్ళతో వ్యాపారం చేసే వాళ్లు కొందరు, బ్రతికిన తోళ్ళతో వ్యాపారం చేసే వారు కొందరు" అంటాడు.

ఇంత నిశితమైన వ్యంగ్యం ఈ ప్రహసనాలలో మరి యెక్కడా కనుపించదు. దానికి కారణం చిలకమర్తికి ఇట్టి వివాహాలంటే ఉన్న జుగుప్స, అసహ్యాలే. దీనికి పరాకాష్టగా ఆ పిల్ల చనిపోగానే ఆమె ఒంటిమీది నగలన్నీ అప్పగించి పోవలసిందిగా కబురు పెడతాడా తండ్రి. ఒకవంక తాము పెద్ద మనుష్యులమని, తమకిటువంటి పద్ధతులు నచ్చవని ఉపన్యాసాలిస్తూనే, చాటుగా ఇటువంటి పనులు చేసే మనుష్యులకు తగిన బదులు చెప్పారు పంతులుగారు.

ఇదేవిషయంమీద వ్రాయబడిన మరొక ప్రహసనం "కాండూరి జానకరామయ్యగారి పెండ్లి." అరవై ఐదేళ్ల జానకిరామయ్యగారు పదిహేనేళ్ళు తగ్గించి జాతకం వ్రాసి కన్యాశుల్కం ఇస్తామని ఆశ చూపించి పదేళ్ల పిల్లను పెళ్లిచేసుకోవడానికి సమకట్టడం ఇందులో కథ. మధ్యలో పురోహితులు తమ స్వలాభంకోసం ఇటువంటివారికి పెండ్లి చేయించడానికి ఎంత తహతహలాడతారో ఈ ప్రహసనంలో చూపబడ్డది. ఇందులోని భైరవసిద్ధాంతి పిల్లతండ్రితో మాట్లాడుతూ "ఒక్కమాట చెబుతాను విను. నేను అమంగళం పలికినానని నన్ను తిట్టకు. ఈ ముండాకొడుకునకు అతిమూత్రము రోగమున్నది. మహా బ్రతికితే అయిదేళ్లు బ్రతికేను, ఆరేళ్లు బ్రతికేను. పరాచపుండో వేసి చస్తాడు. నీకు అమాంబాపతు పాతికవేల రూపాయల ఆస్తి కలుస్తుంది. ఇంతకూ నీ పిల్ల జాతకం మంచిది." చివరకు పెండ్లి జరుగుతుంది. ఇటువంటి పెళ్ళిలో జరిగిన అభాసు పనుల నన్నింటిని కామయ్య, భీమయ్య అనే ఇద్దరు బ్రాహ్మణుల సంభాషణలో చెప్పిస్తాడు రచయిత. వారిద్దరిలో కామయ్యచేత ఆ ముసలాయన పోతే ఆమె వితంతు శరణాలయంలోనికి వెళ్ళి హాయిగా పెండ్లి చేసుకోవచ్చునని జోస్యం కూడా చెప్పిస్తాడు.

ఇదే విషయంమీద వ్రాసిన మరొక ప్రహసనం "అపూర్వ స్వయంవరము." అందులో [illegible]ల్లిదండ్రులే నాగరాజనే ముసలి భాగ్య



వంతుణ్ని అల్లుణ్ని చేసుకోవాలని తమ పిల్ల ఆయననే వరించిందని అబద్ధాలాడతారు. ఆ పిల్ల ఈ ముసలి మొగుడు తనకు వద్దని ఎంత మొత్తుకున్నా వినక, ఆమెను భయపెట్టి పెళ్ళికి ఒప్పిస్తారు. ఆ ప్రహసనంలోని ఒక పాత్ర అన్నట్లు ఇది అపూర్వ స్వయంవర ప్రహసనం కాదు. బలాత్కార వివాహ ప్రహసనము. క్రిందటి ప్రహసనంలో ఇద్దరు బ్రాహ్మణులచేత విమర్శను నడిపించిన రచయిత ఈ ప్రహసనంలో నీలాటిరేవులోని అమ్మలక్కల చేత ఈ స్వార్థపరులందరిని విమర్శింప చేస్తారు. ఆ విమర్శకు పరకాష్ఠ:

శరభమ్మ: అవుతే ఊరేగింపుందిటో, అడగటం మరచిపోయినాను.

గవరమ్మ: ఇక ఒకటె ఊరేగింపు మధ్య మధ్య ఇన్ని ఊరేగింపులు లేవు. పోదాంపద.

ఈ విధంగా సంఘసంస్కార దృష్టితో రచన చేసిన ప్రహసనాలను కూడా కొన్ని హాస్యం పాలు ఎక్కువైనవిగాను, మరి కొన్ని విమర్శ అధికంగా కలవిగాను విభజించవచ్చు. ఈ దృక్పథం రచయిత చూపినదే కావడంవల్ల ఆ యా సమస్యలమీద ఆయన అభిప్రాయాలు కూడా దీని వలన మనకు వ్యక్తం అవుతున్నాయి.

చిలకమర్తి అపహాసించిన ఆచారాల్లో ఓట్లకోసం ఎన్నికలలో నిలబడిన అభ్యర్థులు పడేపాట్లు, ఓటువేసే వారికి చేసే అన్యాయాలు కూడా ముఖ్యమైనవి. "వోట్లకై తిరుగుట" అన్న ప్రహసనంలో అమాయకులైన వోటర్లను గురించి జంబుకేశ్వర రావు ఈ విధంగా అంటాడు: "ఈ వోటర్ల సంగతి మీకు తెలియదు. వీళ్లు మాయలెఱుగని వాళ్ళు. మనము వీళ్ళను మాటలు చెప్పి టోపీవేసి ఓట్లు సంపాదింపవలెను." ఆ తరవాత ఆరావుగారు వెళ్ళినచోటనల్లా అడిగిన వాళ్ళకు అడిగిన కోరికలనల్లా తీరుస్తానని వాగ్దానం చేస్తాడు. మరొక

ప్రహసనం "యమధర్మరాజు కచ్చేరి" లో చిత్రగుప్తుడు యమధర్మరాజుకు వోటర్లను గురించి, వారు చేసే ప్రమాణాలను గురించి తెలియచేస్తూ "ఈఘోరమైన ప్రమాణములుచేసి తప్పిన యీమహానుభావులకు యేమి నరక మేర్పరచినారో నాకు తెలియకున్నది." అంటాడు. వరుసగా ఒక్కొక్క వోటరు వచ్చి తాము వోట్లు వేయడానికై చేసిన ప్రమాణాలు, ఆ ప్రమాణాలు చేయవలసిన పరిస్థితులు పేర్కొంటారు. వారికి తగిన శిక్షలు విధిస్తాడు యమధర్మరాజు.[1]

బ్రతుకుతెరువుకోసం మనుష్యులు చేసే చాలా రకాల మోసాలను పంతులుగారు దుయ్యబట్టారు. "అద్భుతసంతర్పణ ప్రహసనం"లో బ్రాహ్మణులు సంతర్పణచేశామనిచెప్పి ఒక హైదరాబాదు మార్వాడి వద్ద నుంచి డబ్బులు లాగి మోసంచేయడం విమర్శించబడ్డది. ఇద్దరు హోటలువ్యక్తులు ఒకరిమీద ఒకరు పోటీపడి ఒక మోసగాణ్ణి మా హోటలుకు రమ్మంటే మా హోటలుకు రమ్మని పిలిచి చివరకు అతడు డబ్బులివ్వకుండా, మీరు పిలిచారు కనుక వచ్చానని చెప్పి వెడుతూంటే మేము దెబ్బలాడుకొన్నందుకు తగినశాస్తి జరిగినదనుకుంటారు "వింతవిందు"లో. "పిశాచవిలాసము"లో పిశాచములున్నవని, వానిని బాగుచేయగలనని ప్రగల్భాలు పలికే దయ్యాలదాసుతో సత్యసూరి పంతంపట్టి, అతనినే దయ్యాలంటే భయపెట్టించి, తద్వారా అతడు ఆ పేరుతో ప్రజలను మోసంచేసి డబ్బులాగుతున్నాడని ప్రపంచానికి చాటుతాడు. "దంభసన్యాసిప్రహసనం"లో దొంగసన్యా

1. మునిసిపల్ వ్యవహారాలను గురించిన ప్రహసనాలు వ్రాసినందుకుగాను తన "దేశమాత" పత్రిక ఎంతటి అగచాట్లకు గురిఅయిందో చిలకమర్తి తన "స్వీయచరిత్ర" లో విపులంగా పేర్కొన్నారు. (పుట 331)



సుల మోసం ఎంతో చమత్కారంగా చిత్రించబడ్డది. కలియుగ నారదుడని బిరుదు నందిన "నరసింహాభారతి" అనే స్వాములవారు భార్యమీద కోపంవచ్చి, జందెంతెంపుకొని సన్యాసియై వరదరాజుఇంటచేరి ఆ భార్యాభర్తల అమాయకత్వం ఆధారంగా వారిద్దరికీ తగవులుపెట్టి అతని ఆస్తినంతనూ తనపేర వ్రాయించుకోవడం చూపబడ్డది. పూర్వజన్మలో తనభర్త ఉప్పరివాడని, కావలెనంటే ఆ రాత్రి అతడు పడుకొని ఉన్నప్పుడు నాలుకతో అతనివీపు నాకి చూడవలసినదని, అది తప్పక ఉప్పగా ఉండగలదని సన్యాసి భార్యతో చెబుతాడు. అలాగే భర్తతో తనభార్య క్రిందటిజన్మలో కుక్క అని, ఆ విషయమై నిర్ధారణ చేసుకోవలెనంటే ఆ రాత్రి జాగ్రత్తగాఆమెను గమనించవలసినదని, ఒకరాత్రివేళ ఆమె అతనివీపును నాలుకతో నాకుతుందని భర్తకు చెబుతాడు. దానితో ఆ రాత్రి భార్యాభర్త లిద్దరు పోట్లాడుకోగా, భర్తకోపంతో "ఈ కుక్కతో నేను కాపురంచేయను. ఇదుగో! నా ఆస్తి మీకు ధారదత్తము చేస్తున్నాను" అంటాడు. ఆదంభసన్యాసి తెల్లవారిన తరువాత మరి అక్కడ కనుపించడు.

దొంగసన్యాసులను గురించివ్రాసిన మరొక ప్రహసనం "కైలాసదూతప్రహసనము." వాసుదేవరావు అనేవ్యక్తి హస్తలాఘవంచేసి రోజులు వెళ్లబుచ్చుకుంటూ ఉంటాడు. శివభక్తురాలైన మంగమ్మ దగ్గరకువచ్చి తాను నందికేశ్వరుడనని, కైలాసంనుంచి వచ్చానని, అక్కడ మంగమ్మ అత్తమామలు చాలా కష్టాలలో ఉన్నారని, వారు పంపితేనే వచ్చానని, వారికి బటలకు, ఇల్లుకట్టుకోవడానికి కొంతడబ్బు కావాలని అంటాడు. ఆమె డబ్బులేదనగా ఆమె మెడలోని నగలు తీసుకొని పరారి అవుతాడు. ఇంటికి వచ్చిన భర్త తన భార్య కాసులపేరును కాస్తా ఆ టోపీదాసుకు ఇచ్చివేసిందని తెలుసుకొని "ఈ యాడవాళ్ల మూర్ఖత చేతనే మోసగాళ్ల ఆటలు సాగుతున్నాయ"ని వాపోతాడు.

ఈ విధంగా దొంగసన్యాసులు చేసే మోసాలను గురించి ఎన్నో చిన్నచిన్న సంవాదాలతో కూడా పంతులుగారు చమత్కరించారు.

పంతులుగారు పరిహసించిన మరొక లక్షణం మనుష్యులలో ఉండే లోభగుణం. కాండూరి జానకిరామయ్యగారు రెండోపెళ్ళి చేసుకుంటూ వాకిలికి పసుపురాయరాదని, తోరణం కట్టరాదని అంటే దానికి ప్రక్కవారివిమర్శ ఏమంటే-అలాచేస్తే ఎవరైనా సదస్యానికి వస్తారేమోనని ఆయనకు భయమని. ముసలివారు రెండవపెళ్ళి చేసుకోవడానికి, కన్యాశుల్కం ఎంతైనా ఇవ్వడానికి ఇష్టపడతారుకాని అవసరమైనదానికి చిల్లిగవ్వ ఖర్చుపెట్టరని పంతులుగారు చూపారు. ఆయన ఈలోభత్వంమీద వ్రాసిన ప్రహసనాలలో "అపూర్వనరకము", "విచిత్రగోదానప్రహసనము" ముఖ్యమైనవి. ఒక లోభిని యమధర్మరాజువద్దకు ప్రవేశపెట్టగా, చిత్రగుప్తుడు అతడు భూలోకంలో ఉండగా చూపినలోభమును వర్ణించి చెబుతాడు. అతనిని పిసినిగొట్టులలో మహాచక్రవర్తి అంటాడు. చివరకు అతడు వ్రాసిన విల్లును చదువుతాడు. తన్ను డబ్బుతీసుకొన్న శవవాహకులు మోయరాదని, అలా మోస్తే వారికిచ్చే డబ్బు దండుగ అవుతుందని, తాను జాగ్రత్తపరచిన పోట్లఅవునే దానమివ్వాలని-ఇలాంటివే ఖర్చులేని ఎన్నో విషయాలు అందులో వ్రాస్తాడు. ఇటువంటి పిసినిగొట్టును ఎటువంటి నరకంలో పడవెయ్యాలా అని యముడు ఆలోచస్తూ ఉంటాడు. తుదకు చిత్రగుప్తుని సలహానుసరించి ఆ లోభి ఆత్మను కుమారులున్న తన ఇంటికే పంపి కొంతకాలం అక్కడ ఉండమంటాడు. కొడుకులు డబ్బు ఖర్చుపెట్టడం, తాను వెనుకచెప్పిన మాటలు పట్టించుకోకపోవడం చూచి ఆ లోభివాని ఆత్మ తల్లడిల్లిపోతుంది. అదే భరించరాని నరకం అయిపోయింది. తనను అక్కడనుంచి తీసుకొని వెళ్ళిపొమ్మని, యమకింకరులను బ్రతిమాలతాడు ఆ లోభి. అతని అవస్థను



చూచి కింకరుడొకడు "లోభి వానికి తన సొమ్ము ఖర్చగుచుండగా చూచుటయే నరకమనుభవించుట" అంటాడు.

"విచిత్రగోదానప్రహసనం" లోని రామనాథుడనే గ్రామాధికారికూడా లోభే! కాని తెలివిగలలోభి. నోరున్నలోభి. తనఇంట్లో ఆవుచనిపోతే, ఊరురివాజు ప్రకారం గోవు ఎవరియింటచనిపోతే వారు అ గోవునుతీయించడానికి గ్రామాధికారికి ఒక్కరూపాయి యివ్వవలసి ఉంటుంది. తమ గోవు తనయింట్లో చనిపోవడం వలన ఆ రావలసిన రూపాయి రాకుండా పోతున్నదని ఆయన చింతపడి, నరసింహాదీక్షితులనే సాధువైన బ్రాహ్మణునకు తనగోవును దానమిచ్చి అది ఆయనఇల్లు చేరీ చేరకమునుపే చనిపోగా ఆయనదగ్గరనుంచి రూపాయి వసూలుచేస్తాడు. ఇది యేమని దీక్షితులుగారు అడగవస్తే మామూలు ఇవ్వకతప్పదంటాడు. అటువంటి లోభి యమలోకానికి పోయినప్పుడు తానే ముందుగా యముణ్ణి ప్రశ్నిస్తాడు-నీవు పాతయముడివా, కొత్తయముడివా-అని. నీవేనిజమైన యమధర్మరాజువని నిరూపించుకొన్న తరువాతనే నీవునన్ను శిక్షించవలసిందంటాడు లోభి. దానిని బ్రహ్మవిష్ణు మహేశ్వరులే నిరూపించాలంటాడు. తీరా వారు కనిపించగానే మీలో ఏ ఒక్కరో కనిపిస్తేనే మహాపాపాలు నశిస్తాయంటారే, మరి ముగ్గురూ కనిపిస్తే నాకు నరకం ఎలావుంటుంది - అని వారినే ప్రశ్నిస్తాడు. మహేశ్వరుడు "దొంగలకు టక్కరులకు ఈ విధమైన యుక్తులు సహజమే" నని అన్నా చివరకు ఆ యుక్తితోనే అతడు తప్పించుకొంటాడు.

"లోభి పిశాచము" అన్న ప్రహసనంలోకూడా ఒక లోభి తన కొడుకు ముప్పయిరూపాయలు పెట్టికొన్న గోవును ఒక బ్రాహ్మణునకు దానంఇస్తే, అతడు దానిని ఇంటికితోలుకొని రాగానే అతని భార్యకు పూనకంలో ఆ లోభి పిశాచం వచ్చి ఆ బ్రాహ్మణుడు

ఆ గోవును కొన్నధనం తనకొడుకుకు యిస్తేగాని వదిలిపోనంటుంది. ఆ బ్రాహ్మణుడు డబ్బు పుచ్చుకొనగానే పూనకం వదిలి భార్య మామూలుమనిషి అవుతుంది.

ఈ ప్రహసనం చదివితే చిలకమర్తి కూడా పిశాచాలున్నాయని నమ్మి ఈవిధంగా అన్నాడా అన్న అనుమానం వచ్చేటంత సహజంగా కనిపిస్తుంది. ఆ లోభివాడు అంతడబ్బుపెట్టి గోదానం చేయడాన్ని తన మరణం తరువాత కూడా సహించలేడన్న విషయాన్ని ఈవిధంగా చూపారు పంతులుగారు.

ఇవికాక పంతులుగారు ఇంకా చాలా ప్రహసనాలు వ్రాశారు. ముష్టివేయడం మంచిదా, కాదా అన్న విషయాన్ని చర్చించి వేయడం మంచిది కాదన్న వారివాదాన్ని అపహసిస్తూ 'ముష్టిప్రహసనం' వ్రాశారు అయన. 'శవవహనము' నకు వచ్చిన వాహకులు డబ్బుకు బేరం ఆడుతూ, 'ఇప్పటికి ఈ విధంగా కానివ్వండి. ఈ సారికి తక్కువ తీసుకొంటామని' అనడం ఆ వృత్తిలో ఉండి పోవడంవల్ల వారికి ఎంత సహజంగా ఉన్నా, వినేవారికి వారి మాటలు కలిగించే శ్లేషార్థాన్ని ఆధారం చేసుకొని 'శవవహనము' అన్న ప్రహసనం వ్రాశారు.

భార్య ఉండగా పొరిగింటి ఆవిడ పొందుకోరిన భర్త ఆట కట్టించడానికి భార్యే ఆ పొరిగింటి ఆమెగా వచ్చి నాటకమాడి భర్తకు బుద్ధితెప్పిస్తుంది "మనోరసిక ప్రహసనం"లో.

ఇవేకాక ఇంకా ఎన్నో చిన్నచిన్న సంవాదాలలోను, ఇతర హాస్యాత్మక వ్యాసాలలోను కూడా పంతులు గారు ఆనాడు తమ చుట్టూ ఉన్న సంఘంలోని దురాచారాలను విమర్శిస్తూ వచ్చారు. పంతులుగారి ప్రహసన రచనా విధానాన్ని పరిశీలిస్తే రెండుమూడు



ప్రత్యేకతలు తెలియవస్తాయి. ఇందులోని చాలా ప్రహసనాలు ప్రదర్శనకు యోగ్యాలు కావు. ఇందులో చాలా ప్రహసనాల విస్తృతి చిన్నది. ఈ అవిస్తృతమైన ప్రహసనాలలో కూడా మూడు నాలుగు రంగాలు ఉంటాయి. ఈ ప్రహసనాలు ప్రదర్శనకు యోగ్యం కాకపోవడానికి ఈ రెండు లక్షణాలే ప్రముఖ కారణాలని చెప్పవచ్చు. పైగా ఈ ప్రహసనాలను. హాస్య సంభాషణలను ఆయన ఎక్కువగా తన 'మనోరమ', 'దేశమాత' పత్రికలలో ప్రచురణ కోసమే వ్రాశారు కాని, ప్రదర్శనకు కాదు.

ఈ ప్రహసనాలలో ఎన్నో దురన్యాయాలను పంతులుగారు విమర్శించారు. కాని దాదాపు అన్నింటిలోను ప్రహసనాంతంలో ఆ దురన్యాయాలకు పాల్పడిన వ్యక్తి పశ్చాత్తాపం చూపి, బుద్ధి తెచ్చుకొన్నట్లే చూపబడ్డది. దీనివలన చిలకమర్తిలో విమర్శనా గుణం ఉన్నా, దానికన్న సంస్కరణాభిలాష ఎక్కువగా గోచరిస్తుంది. ఇందుకు భిన్నంగా ఉన్న ప్రహసనాలన్నీ మనుష్యులలో ఉండేలోభం, మోహం మొదలయిన గుణాలను పరిహసిస్తూ వ్రాయబడినవే.

చిలకమర్తివారి ప్రహసనాలు, ఆయన నాటకాలకు ఎంతో భిన్నంగా కనిపిస్తాయి. ఆయన వ్రాసిన నాటకాలన్నీ ఎవరి పనుపునో వ్రాయబడ్డాయి. అవి అన్నీ పౌరాణికాలు. అన్నీ గ్రాంధికమైనశైలిలో ఆనాటి పౌరాణిక నాటకాలు వ్రాయబడిన పద్ధతిలో వ్రాయబడినవే. కాని ప్రహసనాలు అన్నీ సాంఘికాలు, సమస్యాత్మకాలు. ఆనాడు తన చుట్టూవున్న దురన్యాయాలను అవహేళన చేయడానికి వ్రాసినవే. అవిఅన్నీ చక్కని వ్యావహారికంతో వ్రాయబడినవి. ఈ రెండుభిన్నమైన నాటక శైలులను దాదాపు ఒకే కాలంలో వ్రాయగలగడం చిలకమర్తి సృజనాత్మక శక్తికి తార్కాణంగా చెప్పుకోవచ్చు.

# తెలుగు నాటక రంగానికి చిలకమర్తి చేసిన సేవ

ఆధునికాంధ్రసాహిత్యానికి పితామహుడనదగిన కందుకూరి తన జీవితాన్ని కేవలం సాహిత్య వ్యాసంగానికే అంకితం చేయలేదు. ఆయన సంఘసంస్కరణంలో సాహిత్యం ఒకభాగం. ఆ గమ్యానికి ఇది ఒక మార్గం. ఆయనను అటు సాహిత్యరంగంలోను, ఇటు సంస్కరణరంగంలోను అనుసరించి, గురువుగారికి దీటైన శిష్యుడనిపించుకొన్నవాడు చిలకమర్తి. వ్యావృత్తులలో ఆయనకన్న రెండాకులు ఎక్కువే చదివాడు చిలకమర్తి. మొదటిది నిమ్నజాతుల కోసం ప్రత్యేకంగా పాఠశాలను స్థాపించి నడపడం, రెండవది ఒక నాటకసమాజానికి నాటకాలు వ్రాసియిస్తూ కొంతకాలం దానిని నిర్వహించడం. కందుకూరి నాటకాలు వ్రాశాడు; తన విద్యార్థులచేత ఆ నాటకాలను ప్రదర్శింపచేశాడు కూడా. కాని చిలకమర్తి తాను ఏ నాటక సమాజంకోసం నాటకాలు వ్రాశాడో, దానికే అధ్యక్షుడై ఆ నాటక సమాజనిర్వహణ బాధ్యతను ఎంతో సక్రమంగా నిర్వర్తించినవాడు.

తెలుగు నాటక రంగానికి చిలకమర్తి చేసినసేవను గురించి ప్రస్తావించవలసి రావడం కొంత ఇబ్బందే! ఆయన కోరాడ రామచంద్ర శాస్త్రి, కొక్కొండ, కందుకూరి, వావిలాల-ప్రభృతుల వలె ఏ ఒక్క నాటక విధానానికి ఆద్యుడుకాడు. ఆయన ప్రత్యేకత ఏనాడూ ఒక



విధానానికిమార్గదర్శిగాకాదు. ఒకవిధానానికిఆయన కల్పించిన ఒరవడి, ఖ్యాతి—ఇవీ ఆయన ప్రత్యేకత. అయినా తెలుగునాట నాటక పద్యం (ప్రబంధపద్యానికి భిన్నంగా) లలితంగా ఉంటే దానికి ప్రేక్షకుల నుండి రాగల మెప్పుదలను ముందుగా అనుభవించిన వాడు చిలకమర్తే! ఆ తరువాత దానిని స్వయంభుక్తం చేసుకొన్నవారు తిరుపతి వేంకటకవులు. అటువంటి పద్యాలుగల నాటకాల ప్రతులు లక్షవరకు అమ్ముడు పోవడంలో కూడా చిలకమర్తిదే ప్రథమ తాంబులం.

చిలకమర్తి గురజాడలాగా, వేదంవారిలాగా గొప్పనాటకాలు వ్రాయలేదు. కాని మంచి నాటకాలు వ్రాశాడు. కాని వారికన్న ఎక్కువగా రంగస్థలం పరిధులెరిగినవాడు. ప్రేక్షకుల మనసెరిగినవాడు. నాటకరచనలో శాస్త్రపాఠాలు చదివినవాడుకాదు. కాని నాటకోత్కర్షను క్రమంగా ఉద్దీపించుకుంటూ ఎలా రావాలో, ఏ రంగం తరవాత ఏ రంగాన్ని నిర్మించాలో అన్న నాటక మర్మం తెలిసినవాడు. నటకుల పరిధుల మేరకు మాత్రమే నాటకాలు వ్రాసినవాడు. ఈ పరిధులను గమనించి అందులో ఇమిడే చక్కని నాటకాలు వ్రాయడం వల్లనే నాటక కర్తగా చిలకమర్తి కీర్తి ఈ నాటికీ మొక్కపోలేదు.

చిలకమర్తి వ్రాసిన మౌలికనాటకాలన్నీ పౌరాణికాలే! అందువల్ల ఆయన పాత్ర సృష్టి, పోషణల కోసం శ్రమపడనక్కరలేకపోయింది. అయినా పౌరాణిక పాత్రలయిన కృష్ణార్జునులను, సత్యభామా, నరకులను తన సమాజంలోని వ్యక్తులకు దగ్గరగా తీసుకొని వచ్చి వారిని పౌరాణిక చట్రంలో బిగించబడ్డ వర్తమానమానవులుగా చిత్రించాడు. ప్రాచీన పాత్రల నడవడికను ఒకవంక పురాణాలకు అనుగుణంగా నడుపుతూనే, వేరొకవంక మామూలు మానవుల నడవడికకు, మనస్తత్వానికి అతి సమీపంగా ఉండేలా చిత్రించాడు. ఈ విషయం ముఖ్యంగా శ్రీకృష్ణుని పాత్ర చిత్రణంలో మనకు ద్యోతకం అవు

తుంది. కధకు అవసరమైనంత మేరకు కృష్ణుడు భగవంతుడే. కాని
బావమరదితో మాట్లాడడంలోను, పరస్పరం నిందలు మోపుకోవడం
లోను ఆయన మానవుడే! అందులోనూ ఈనాటి తెలుగువాడు! ఈ
సామంజస్యాన్ని బట్టి ఆయన చిత్రించిన శ్రీకృష్ణ పాత్రకు, దాని
వలన ఆ పాత్ర ఉన్న నాటకాలకు అంత ప్రఖ్యాతి కలిగిందని
చెప్పవచ్చు.

చిలకమర్తి ఈ నాటకాలన్నింటిలోను తనకు ముందు నియ
మితమైపోయిన నాటకపద్ధతినే వాడుకొన్నాడు. సంస్కృతనాటక
లక్షణాలను ఈ నాటకాలలకు సమన్వయిస్తూ విష్కంభ ప్రవేశాలను,
నాందిప్రస్తావనలను, పాత్రల ప్రవేశ నిష్క్రమణలను ఏ విధంగా
ఆయన ప్రయుక్తంచేశాడో ఇక్కడ వివరించడం అప్రస్తుతం. ఆయన
వాడిన భాషకూడా గ్రాంధికం. కాని తన నటులకు, సామాజికులకు
అనువుగా అతి సరళమైన గ్రాంధికాన్ని వాడాడు చిలకమర్తి.
ఈ పౌరాణిక-గ్రాంధిక నాటకాలకు భిన్నంగా తానే ప్రహసనాలు
వ్రాశాడు. ఇందులో కొన్ని సంభాషణప్రాయాలు. కొన్ని చిన్న
ప్రహసనాలు. మరికొన్ని పెద్దవి. కాని ఇవిఅన్నీ చక్కని వ్యావ
హారికంలో వ్రాయబడ్డాయి. అన్నింటి కథావస్తువు తనచుట్టూ ఉన్న
సంఘంలో నుంచి తీసుకోబడ్డదే! అందులోని పాత్రలన్నీ ఆనాటి
సమాజంలో నిత్యమూ ఎదురయ్యేవారి ప్రతిబింబాలే! ఈ విధంగా
చిలకమర్తి పాతకొత్తలకు ఒక మేలు కలయికను కూర్చాడు! ఒకవంక
నాటకలక్షణాలను అనుసరిస్తూ పాతపద్ధతిలో, పద్యాలతో కూడిన
పౌరాణిక నాటకాలను గ్రాంధికంలో వ్రాశాడు. వేరొకవంక ఏనాటక
లక్షణాలకూ కట్టుపడక, కొత్తపద్ధతిలో, కేవలం వ్యావహారిక వచనంలో
సాగిన సాంఘిక ప్రహసనాలనూ వ్రాశాడు. ఆ పౌరాణిక నాట
కాలను వ్రాసిన వ్యక్తే ఈ ప్రహసనాలను కూడా వ్రాశాడంటే
నమ్మడం ఒకంత సాధ్యపడదు. ఈ విధంగా తనను పెద్దచేసిన నాటక



సంఘం కోరికలమేరకు, ఆనాటి ప్రేక్షకుల మన్ననలను పొందగల
నాటకాలను వ్రాస్తూనే, తనకు మార్గదర్శిఅయిన కందుకూరివలె
సంఘసంస్కరణానికి మూలములైన ప్రహసనాలనుకూడా ఆయన
వ్రాశాడు. అటు పద్యనాటక-గ్రాంధిక శైలిని, ఇటు వచననాటక-
వ్యావహారికశైలిని సమంగా ఆదరించినవాడు చిలకమర్తి.

ఆనాడు నాటకరంగంలో ఎక్కువగా సమాదరణీయాలైన
అనువాదనాటకాల జోలికి చిలకమర్తి పోలేదు. పార్వతీపరిణయం
చివరిదశలో వ్రాసిన నాటకం. భాసనాటకాలలో ఉన్న కొత్తదనం
వల్ల వానిని తెనిగించారాయన. ఈ అనువాదనాటలకాన్నింటిని ప్రద
ర్శనకోసం వ్రాయలేదు. అందువల్లనే ప్రదర్శనయోగ్యాలైన ఇతర
సంస్కృత, ఆంగ్ల నాటకాలను ఆయన తెనిగించక, కేవలం మౌలిక
నాటకాలనే రంగస్థల ప్రయోగంకోసం వ్రాయడం ఆనాటి నాటక
రచనా పద్ధతులను పరిశీలించిన వారికి ఆశ్చర్యం కలగచేయకమానదు.
అదేవిధంగా ఆయనవ్రాసిన ప్రహసనాలన్నీ మౌలికాలే! వీరేశలింగం
గారు కొన్ని పాశ్చాత్య ప్రహసనాలను తెలుగువాతావరణం కల్పించి
అనువదించారు. కాని చిలకమర్తి కేవలం తెలుగు కథావస్తువును,
తెలుగువారిని ఆధారంచేసుకొనే తన ప్రహసనాలను వ్రాశాడు.

ఒకే నాటక సమాజానికి నాటకాలు వ్రాసియిచ్చి "సమాజ
నాటకరచయిత" గా ప్రఖ్యాతులైన తెలుగు నాటకకర్తలలో చిలక
మర్తి వేప్రథముణ్ణిగా చెప్పుకోవచ్చు. అంతకుముందు నాటకాలు వ్రాసిన
నాటకకర్తలలో చాలమందికి స్వంతనాటకసంస్థలు ఉన్నాయి. ధర్మ
వరం, వడ్డాది ప్రభృతులు తమ నాటకసంస్థలకోసం నాటకాలు వ్రాసి
అందులోనటించిన మహామహులు! కాని చిలకమర్తి తరువాతి తరంలో
ప్రారంభం కాబోతున్న వృత్తి నాటకసమాజాల పద్ధతికి దగ్గరగా
వస్తాడు. అవృత్తినాటక సమాజాలు ఒక రచయితను తమ సమాజానికి

రచయితగా ఎంచుకొనేవి. ఒకవిధంగా చిలకమర్తి రానున్న ఒక పద్ధతికి నాంది పలికిన వాడైనాడు.

సమాజాన్ని నిర్వహించడంలో కూడా ఆదర్శవంతమైన వృత్తి నాటక సమాజాల నిర్వచనపద్ధతిని అనుసరించినవాడు చిలకమర్తి. తాను హిందూనాటక సమాజానికి అధ్యక్షుడుగా ఉన్న కొద్దికాలంలో దానిని ఏ విధంగా నిర్వహించిందీ చిలకమర్తే ఈవిధంగా వ్రాసుకొన్నాడు:

> 'నాపెత్తనములో నున్నప్పుడు నాటకశాలను నీతిమంతముగా జేయుటకై మిక్కిలి ప్రయత్నించితిని. నీతిని నిలుపుటకు, సమాజము యొక్క గౌరవమును స్వాతంత్ర్యమును గాపాడుటకు, నేను శక్యమైనంతవరకు ప్రయత్నము చేసితిని.''[1]

ముప్పిడి జగ్గరాజుగారిని పిఠాపురంనుంచి పిలిపించి ఆడవేషాలు వేయించింది చిలకమర్తే! తమ సమాజంలో ప్రధానపాత్రలను ధరించే ఇద్దరు వ్యక్తులు భంగుతాగి అసందర్భంగా ప్రవర్తిస్తే వారిని సమాజం నుంచి తొలగించాడాయన. అధికారులు, వారిభార్యలు ఉచితంగా టిక్కెట్లనిమ్మని బలవంతంచేసినా దానిని లెక్కచేయలేదాయన. ఈవిధంగా సమాజంయొక్క గౌరవ, స్వాతంత్ర్యాలను నిలబెట్టడానికి ఎంతో కృషి చేశాడు.

తెలుగుజాతి పునరుజ్జీవనంలో సంఘసంస్కర్తగా ఆయన ఎంతటి ప్రముఖమైన పాత్రను నిర్వహించారో, తెలుగునాటక పునరుజ్జీవనంలో, తెలుగునాటకరంగ పునరుజ్జీవనంలోకూడా అంతటి ప్రముఖమైన పాత్రనే నిర్వహించిన మహారథుడు చిలకమర్తి. పాత

1. "స్వీయచరిత్రము", 239



పద్ధతులను తూలనాడక మన్నిస్తూనే కొత్తపోకడలకు శ్రీకారం చుట్టిన కళాప్రపూర్ణుడు. ఆయన 'గొప్ప' నాటకకర్త కాకపోవచ్చు. కాని ప్రయోగ యోగ్యాలుకాని 'గొప్ప' నాటకాలు వ్రాయడంకన్న ప్రయోగయోగ్యాలై, లక్షలాది ప్రేక్షకులను, ఆ బాలగోపాలాన్ని ఉర్రూతలూగించే 'చక్కని', ప్రదర్శన యోగ్యమైన నాటకాలను వ్రాసిన చిలకమర్తి లక్ష్యము నెరిగి ప్రవర్తిల్లిన సాహితీవేత్త. తన గుణాలతోపాటు లోపాలను, ఎదుటివారిలోని మంచిని గుర్తించి దానిని ధైర్యంగా ఒప్పుకోగలిగిన మనిషి. నాటకకర్తగా, నవలాకారుడుగా, హాస్యరచయితగా, ఏకసంథాగ్రాహిగా, సంఘసంస్కర్తగా తెలుగు వారికి చిరస్మరణీయుడు చిలకమర్తి.

13290
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి. గుంటూరు-6